www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 7-7-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 82 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: విదియ తె. 5.00 తదుపరి తదియ; నక్షత్రం: పుష్యమి పూర్తి; వర్జ్యం: మ.1.13-2.54; దుర్ముహూర్తం: సా.5.05-5.57; అమృతఘడియలు: రా.11.19-1.00; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.50; సూర్యాస్తమయం: 6.49 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




2 కమిటీలు



శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సమావేశమైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, రెండు రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు

విభజన సమస్యల పరిష్కారానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీఎంల సమావేశంలో నిర్ణయం

- తొలుత సీఎస్‌లతో అధికారుల కమిటీ.. 2 వారాల్లో భేటీ
- ఇరు రాష్ట్రాల మంత్రులతో మరో కమిటీ నియామకం
- అధికారుల కమిటీలో తేలకపోతే మంత్రుల కమిటీ దృష్టికి
- అక్కడ పరిష్కరించిన సమస్యలకు సీఎంల ఆమోదం
- డ్రగ్స్ నిరోధానికి అదనపు డీజీలతో కో-ఆర్డినేషన్ కమిటీ
- సీఎంలు రేవంత్, చంద్రబాబు సమావేశంలో నిర్ణయాలు
- డిప్యూటీ సీఎం భట్టి, ఏపీ మంత్రి సత్యప్రసాద్ వెల్లడి
- గంటా 45 నిమిషాలపాటు కొనసాగిన సీఎంల భేటీ



బాబుకు కాళోజీ పుస్తకం 'నా గొడవ'ను బహూకరించిన రేవంత్

వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని రేవంత్, భట్టికి అందించిన బాబు

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య విభజన సమస్యల పరిష్కారం దిశగా రెండు రాష్ట్రాలు ఎట్టకేలకు ఒక అడుగు ముందుకు వేశాయి. ఈ సమస్యల పరిష్కారానికిగాను రెండు రాష్ట్రాలు కలిసి రెండు కమిటీలను నియమించాలని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం నిర్ణయించింది. రెండు రాష్ట్రాల మంత్రులతో ఒక కమిటీ, అధికారులతో మరో కమిటీని వేయనున్నారు. ముందుగా చీఫ్ సెక్రటరీలతో ఉన్నతస్థాయి అధికారుల కమిటీని నియమిస్తారు. ఇందులో ఒక్కో రాష్ట్రం నుంచి చీఫ్ సెక్రటరీతో కలిపి ముగ్గురేసి అధికారులు ఉంటారు. తమ స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలపై ఈ కమిటీ దృష్టి సారిస్తుంది. అప్పటికీ సమస్యలకు పరిష్కారం లభించకపోతే.. ఇరు రాష్ట్రాల మంత్రులతో మరో కమిటీని నియమించాలని సీఎంలు నిర్ణయించారు. ఈ మంత్రుల కమిటీ పరిష్కరించిన సమస్యలకు ముఖ్యమంత్రుల స్థాయిలో ఆమోదం తెలపాలన్న నిర్ణయానికి వచ్చారు. అపరిష్కృతంగా ఉన్న 'ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం- 2014'లోని విభజన అంశాలపై శనివారం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఇక్కడి ప్రజాభవన్‌లో సమావేశమయ్యారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన సమావేశం రాత్రి 7.45 గంటల వరకు గంటా 45 నిమిషాలపాటు కొనసాగింది. ఈ సమావేశంలో తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పరిశ్రమలు, ఐటీ, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు(ప్రొటోకాల్) హర్కర వేణుగోపాలరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఇతర సీనియర్

మిగతా 13వ పేజీలో...

చిన్న చిన్న సమస్యలపై పేచీలు వద్దు

13

- మనోభావాలూ దెబ్బతినకుండా పరిష్కరిద్దాం
- ముందు రెండైనా చక్కదిద్దితే సానుకూలత
- 70 అంశాలు.. అధికారుల స్థాయిలోనే 50
- మిగతా 20 మంత్రుల కమిటీల ద్వారా..
- అప్పటికీ ఇంకా అవసరమైతే కేంద్రం వద్దకు..
- సీఎంలు రేవంత్, చంద్రబాబు ఏకాభిప్రాయం

ఒకేసారి సమస్యలన్నీ తీరిపోతాయని అనుకోవద్దు. ఒక్కోదానిని నెమ్మదిగా పరిష్కరించుకుంటూ వెళ్లాలి. ఇక సమస్యలు తీరవు అన్న వాతావరణం ఉండొద్దు. సకాలంలో పరిష్కారం కాక.. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలు చాలా నష్టపోయాయి. ఇకమీదటనైనా సాగదీయొద్దు.

- సమావేశంలో చంద్రబాబు, రేవంత్‌రెడ్డి

షెడ్యూలే ప్రకటించలేదు, వాయిదా ఎక్కడిది?

- నీట్ యూజీ నిరవధిక వాయిదా వార్తలను ఖండించిన కేంద్రం 2
- నెలాఖరులో నీట్ యూజీ కౌన్సెలింగ్!
- రోజుకో వార్తతో విద్యార్థుల్లో టెన్షన్

ఏడాదికి రెండుసార్లు టెట్!

నిబంధనలు సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు 12

4వేలకు పైగా సీఎస్ఈ సీట్లు

- కోర్ బ్రాంచ్‌లు నిర్వహించే కాలేజీలను ప్రోత్సహించే యోచనలో సర్కారు
- ఎప్‌సెట్ కౌన్సెలింగ్ రెండో దశలో సీట్ల పెంపు!



2

23న కేంద్ర బడ్జెట్

ఈనెల 22 నుంచి ఆగస్టు 12 వరకు పార్లమెంట్

నవ్విపోదురుగాక..



కొత్త పలుకు

"వాడిని అలా వదిలేయకండిరా! ఎవరికైనా చూపించండిరా!' అని 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' అనే చిత్రంలో రావు రమేశ్ క్యారక్టర్‌కు ఒక డైలాగ్ ఉంటుంది. మాజీ సీఎంలు కేసీఆర్, జగన్ రెడ్డి రెండు రోజుల క్రితం చేసిన ప్రకటనలు విన్న వారికి ఈ డైలాగ్ గుర్తుకొస్తే తప్పు పట్టాల్సిందేమీ లేదు. తాను ఓడిపోవడం వల్ల దేశ రైతాంగానికి నష్టం వాటిల్లిందని, కేంద్రంలో తన నాయకత్వంలో 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' ఏర్పాటు చేద్దామనుకున్నానని కేసీఆర్ చెప్పుకొన్నారు. 'నా ఓటమి దేశానికే నష్టం' అని కూడా ఆయన చెప్పుకొచ్చారు. తెలంగాణలో తాను ఓడిపోయినందుకు మహారాష్ట్రలో రైతులు బాధపడ్డారని అక్కడి నాయకులు తనతో అన్నారని కూడా ఆయన సెలవిచ్చారు. ఈ మాటలు విన్నవారికి కేసీఆర్ మానసిక స్థితిపై సహజంగానే అనుమానం వస్తుంది.

తెలంగాణలో తనను తిరస్కరించబోతున్నారన్న వాస్తవాన్ని గుర్తించకుండా జాతీయ పార్టీ అంటూ హడావుడి చేసి తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా పేరు మార్చుకున్న కేసీఆర్ ఆ దిశగా గట్టి ప్రయత్నం కూడా చేయలేదు. శాసనసభ ఎన్నికలకు ముందు మహారాష్ట్రతోపాటు ఒకటి రెండు పొరుగు రాష్ట్రాలకు చెందిన క్షేత్రస్థాయిలో బలం లేని నేతలు కొందర్ని పిలిపించుకొని హడావుడి చేశారు. ఎన్నికల్లో ఓడిపోయి ఏడు మాసాలు దాటుతున్నా తన ఓటమికి కారణాలేమిటో గుర్తించడానికి కేసీఆర్ ఇష్టపడకపోవడం ఆశ్చర్యంగా ఉంది.

2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల నాటి నుంచే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌కు తమలోని అసంతృప్తి తెలియజేస్తూనే ఉన్నారు. దుబ్బాక, హుజురాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. అయినా పట్టించుకోకపోగా జాతీయ పార్టీ అంటూ ప్రగల్భాలకు పోవడంతో 2023 నాటికి అంతకు ముందున్న అసంతృప్తి ప్రజాగ్రహంగా మారి పరాభవం చవిచూడాల్సి వచ్చింది.

రాష్ట్రంలో తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటో తెలియక బీఆర్ఎస్ శ్రేణులు ప్రస్తుతం అల్లాడిపోతున్నాయి. పార్టీ ఎమ్మెల్యేలు తనను వదిలిపోకుండా ఉండేందుకు కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలించడం లేదు. దీంతో ఆయన భారతీయ జనతా పార్టీకి చెందిన ఒక కీలక నేత సహాయాన్ని అర్థించారు. ఆ కీలక నేత రంగంలోకి దిగి... బీఆర్ఎస్‌ను వదిలిపోతారని ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యేలకు ఫోన్లు చేసి 'మీరు పార్టీ మారాలనుకుంటే భారతీయ జనతా పార్టీలో చేరండి. లేదంటే బీఆర్ఎస్‌లోనే ఉండండి. కాదూ కూడదని కాంగ్రెస్ పార్టీలో చేరితే తర్వాత పరిణామాలకు సిద్ధంగా ఉండండి' అని హెచ్చరించినట్టుగా తెలిసింది.

అయినా సదరు ప్రయత్నాలు ఫలిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద తమపై అనర్హత వేటు పడకుండా ఏం చేయాలన్న దానిపై ప్రస్తుతం వారు తర్జనభర్జన పడుతున్నారు. ఈ విషయంలో స్పష్టత వచ్చాక భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లోకి చేరికలు ఉంటాయని చెబుతున్నారు.

ఎన్నికల ఫలితాలు చూసి హిమాలయాలకు వెళ్లిపోదామనుకున్నానని వైరాగ్యం ప్రదర్శించిన జగన్ ఈ మధ్య కొంత తేరుకొని ప్రస్తుతం నెల్లూరు జైలులో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డిని పరామర్శించేందుకు అడుగు బయట పెట్టారు.

పరామర్శల తర్వాత జైలు బయట ఆయన మీడియాతో చేసిన వ్యాఖ్యలు కూడా 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాలోని రావు రమేశ్ డైలాగ్‌ను గుర్తుకు తెస్తున్నాయి. ప్రజలు తనను ఎందుకు గెలిపించారో చంద్రబాబు ఆలోచించుకోవాలని ఆయన సెలవిచ్చారు. ప్రజల్లో వ్యతిరేకత వల్ల తాను ఓడిపోలేదని, మంచి చేసి ఓడిపోయానన్న వింత లాజిక్‌ను కూడా తెర మీదకు తెచ్చారు.

చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కావస్తోంది. అత్యంత భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఎన్నో ఆశలు ఉన్నాయి. అదే సమయంలో అధికార పక్షం పోకడలపై కూడా ప్రజలు కన్నేసి ఉంచారు. కొద్ది రోజుల క్రితం జరిగిన రెండు సంఘటనలు కూటమి ప్రభుత్వానికి మచ్చ తెచ్చేవిగా ఉన్నాయి. రాయచోటిలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి భార్య ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ పట్ల అనుచితంగా ప్రవర్తించడం మొదటిది కాగా, తిరువూరు నియోజకవర్గంలో తెలుగుదేశం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు దగ్గరుండి మరీ ఒక భవనాన్ని కూల్చివేయించడం రెండవది. ఈ రెండు సంఘటనలు అధికార దుర్వినియోగానికి సంబంధించినవే.

4

ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు జాగ్రత్తగా మసలుకోవాలి. లేని పక్షంలో అట్టు తిరగేయడానికి ప్రజలు సిద్ధంగా ఉంటారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో రూల్ ఆఫ్ లా అమల్లో లేకుండా పోయిందని, అరాచకం ప్రబలిందని, నాయకులు అహంకారపూరితంగా వ్యవహరించారని నమ్మడం వల్లనే ప్రజలు ఎన్నికల్లో కూటమికి బ్రహ్మరథం పట్టారు.



శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను సతీసమేతంగా కలిసిన అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి

ఏడు బిల్లులకు
గవర్నర్ ఆమోదం!

- వర్సిటీలుగా ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు.. 4 టిమ్స్ ఆస్పత్రులకు నిమ్స్ హోదా
- మునిసిపాలిటీల్లో కోఆప్టెడ్ మెంబర్ల పెంపు.. ములుగు ఇక మునిసిపాలిటీ
- మూడు పంచాయతీలుగా భద్రాచలం.. మైనారిటీ కమిషన్‌లో జైన్‌లకు చోటు

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దాదాపు రెండేళ్లపాటు గవర్నర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న పలు కీలక బిల్లులకు తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదం తెలిపారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో ఆయనకు అప్పటి గవర్నర్ తమిళిసైకి మధ్య తలెత్తిన వ్యక్తిగత స్పర్థ కారణంగా అసెంబ్లీ ఉభయ సభల్లో ఆమోదం పొందిన పది బిల్లులు రాజ్‌భవన్‌లో చిక్కుకుపోయాయి. ఆ బిల్లుల పరిష్కారం కోసం గవర్నర్‌ను కలిసే ప్రయత్నం చేయడానికి బదులు కేసీఆర్ న్యాయమార్గాన్ని ఎంచుకొని హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పిటిషన్లు వేశారు. న్యాయస్థానాల సూచనల మేరకు అప్పటి గవర్నర్ కార్యాలయం 2023 ఏప్రిల్‌లో మూడు బిల్లులకు ఆమోదం తెలిపింది. మిగతా ఏడు బిల్లులను పరిశీలన పేరుతో పెండింగ్‌లో పెట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని, గవర్నర్‌ను ఒప్పించడంతో ఇప్పుడు ఏడు బిల్లులకు మోక్షం లభించింది. అయితే అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. బిల్లుల్లో ప్రధానమైనది.. గత గవర్నర్‌తో వివాదానికి కారణమైన ప్రైవేటు వర్సిటీల బిల్లు. గవర్నర్ ఆమోదం తెలపకపోవడంతో గురునానక్, శ్రీనిధి, మరికొన్ని ఇంజనీరింగ్ కాలేజీలకు వర్సిటీ గుర్తింపు లభించక వందలాది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరమైంది. వారిని అడ్డం పెట్టుకొని ప్రభుత్వం తనమీద ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తోందని అప్పటి గవర్నర్ ఆగ్రహం వ్యక్తం చేశారు కూడా. ఇప్పుడు ప్రైవేటు విశ్వవిద్యాలయాల బిల్లుకు ఆమోదం లభించడంతో ఆ కళాశాలలన్నింటికీ

మిగతా 13వ పేజీలో...

కాంగ్రెస్‌కు దమ్ముంటే.. ఫిరాయించిన ఎమ్మెల్యే స్థానాల్లో

ఎన్నికలకు వెళ్లాలి

- 26 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని చెప్పడం కాదు.. రాజీనామా చేయించి గెలిపించుకోండి
- ఉప ఎన్నికలు జరిగితే అన్ని సీట్లూ బీజేపీకే
- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్.. ఇదేనా పాంచ్ న్యాయ్?
- కేంద్ర మంత్రి పదవితో చేతులు కట్టేసినట్లయింది..
- అయినా నా దూకుడు ఆగదు: బండి సంజయ్
- వనపర్తి బీజేపీ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్యపై ఐజీకి ఫోన్

హైదరాబాద్, జూలై 6(ఆంధ్రజ్యోతి): 'మీకు ప్రజాబలం ఉన్నట్లయితే ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలకు వెళ్లండి. 26 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని చెప్పడం కాదు. ధైర్యముంటే, వారందరితో రాజీనామా చేయించి గెలిపించుకోండి' అని కాంగ్రెస్‌కు బీజేపీ నేత, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్ చేశారు. కేకేతో రాజీనామా సరే.. బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఎందుకు

మిగతా 12వ పేజీలో...



హైదరాబాద్‌లోని బీజేపీ ఆఫీసులో సంజయ్‌ను సన్మానిస్తున్న బీసీ నాయకులు

కొండచరియలు విరిగిపడి..
ఇద్దరు హైదరాబాదీల మృతి

ఉత్తరాఖండ్‌లో దుర్ఘటన 2



కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే బండ్ల

- బీఆర్ఎస్‌లో మరో వికెట్ డౌన్
- రేవంత్ సమక్షంలో చేరిన కృష్ణమోహన్‌రెడ్డి 12
- ఒకట్రెండు రోజుల్లో మరికొందరు గులాబీ ఎమ్మెల్యేలు!

ప్రభుత్వ సలహాదారుగా కె. కేశవరావు

క్యాబినెట్ హోదా ఇచ్చిన ప్రభుత్వం



ఇరాన్ అధ్యక్షుడిగా పెజెష్కియాన్

- ఇస్లామిక్ రిపబ్లిక్‌లో సంస్కరణవాది విజయం
- వృత్తిరీత్యా వైద్యుడు.. హిజాబ్ నిబంధనలను సరళీకరిస్తారని ప్రచారం! 2

23న కేంద్ర బడ్జెట్



» ఈ నెల 22 నుంచి ఆగస్టు 12 వరకు పార్లమెంట్ సమావేశాలు

న్యూఢిల్లీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 22 నుంచి ఆగస్టు 12 వరకు జరగనున్నాయి. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సమావేశాల రెండో రోజు, జూలై 23న 2024-25 ఏడాదికి గాను కేంద్ర బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు పార్లమెంట్ ఉభయసభల షెడ్యూల్‌ను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారం ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఏటా ఫిబ్రవరిలో బడ్జెట్‌ను ప్రకటిస్తుంది. అయితే, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 1న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పాటు పూర్తి కావడంతో ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. దీంతో వరుసగా ఏడుసార్లు బడ్జెట్ సమర్పించిన ఘనతను మంత్రి నిర్మలా సీతారామన్ అందుకోనున్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ తర్వాత కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండో మహిళగా ఇప్పటికే రికార్డులకెక్కిన నిర్మలా ఇప్పటిదాకా ఆరు బడ్జెట్లు సమర్పించారు. ఇప్పటివరకు మొరార్జీ దేశాయ్ వరుసగా ఆరుసార్లు బడ్జెట్ సమర్పించారు.

హత్రాస్ కేసులో ప్రధాన నిందితుడు మధుకర్ అరెస్టు

నోయిడా, జూలై 6: హత్రాస్ తొక్కిసలాట కేసులో ప్రధాన నిందితుడైన దేవప్రకాశ్ మధుకర్ (42) పోలీసులకు చిక్కాడు. హత్రాస్ ప్రత్యేక పోలీసు బృందం శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఢిల్లీలో అతడిని అరెస్టు చేసింది. ఈ నెల 2న యూపీలోని హత్రాస్ జిల్లా ఫుల్‌రాయిలో భోలే బాబా సత్సంగ్‌లో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 121 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి ప్రధాన నిర్వాహకుడు మధుకరే. అతనే ఆ కార్యక్రమానికి అనుమతి తీసుకున్నాడు. హత్రాస్ జిల్లాలోని సికందర్‌రావు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో కూడా అతనొక్కడినే నిందితుడిగా పేర్కొన్నారు. భోలే బాబా కార్యక్రమాలకు నిధులు సమీకరించడం కూడా మధుకరే చేస్తుంటాడని గుర్తించామని హత్రాస్ ఎస్పీ నిపుణ్ అగర్వాల్ తెలిపారు. 2010 నుంచి ఉపాధి హామీ పథకంలో కాంట్రాక్ట్ జూనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న మధుకర్ కొన్నేళ్లుగా భోలే బాబా సంస్థ కోసం పనిచేస్తున్నాడు. శనివారం అతడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించింది.



మధుకర్

వారిని వదిలిపెట్టొద్దు: భోలే బాబా

హత్రాస్ తొక్కిసలాటపై శనివారం భోలే బాబా తొలిసారి స్పందించారు. కార్యక్రమంలో గందరగోళం సృష్టించిన వారిని వదిలిపెట్టొద్దని ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. "జూలై 2 జరిగిన ఘటన నన్ను ఎంతో బాధించింది. మరణించిన వారి కుటుంబాలకు అండగా ఉంటాం. క్షతగాత్రులను ఆదుకుంటాం" అని భోలే బాబా అన్నారు.

లోకం తీరు



ఉత్తరాఖండ్‌లో కొండచరియలు విరిగిపడి..
ఇద్దరు హైదరాబాదీల మృతి

గోపేశ్వర్, జూలై 6: ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి.. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యాత్రికుల ప్రాణాలను బలిగొన్నాయి. శనివారం బద్రీనాథ్ జాతీయ రహదారిపై కర్ణప్రయాగ్‌కు సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సత్యనారాయణ(50), నిర్మల్ షాహి(36) అనే యాత్రికులు బద్రీనాథ్ ఆలయాన్ని దర్శించుకునేందుకు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా.. కొండచరియలు విరిగి వారిపై పడ్డాయి. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. బండరాళ్లను తొలగించి వారి మృతదేహాలను వెలికితీసినట్లు పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో కొద్దిరోజులుగా భారీవర్షాలు కురుస్తుండడంతో బద్రీనాథ్ జాతీయ రహదారిపై పలుచోట్ల కొండచరియలు విరిగిపడి రాకపోకలకు ఆటంకం కలుగుతున్నట్లు చెప్పారు.

ఎంపీ మాగుంటది తప్పుడు వాంగ్మూలం

» దాని ఆధారంగానే కేజ్రీవాల్ అరెస్టు
» మాట మార్చగానే మాగుంట కొడుక్కు బెయిల్
» వీడియో సందేశంలో సునీతా కేజ్రీవాల్



న్యూఢిల్లీ, జూలై 6: ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఇచ్చిన తప్పుడు వాంగ్మూలం ఆధారంగానే మద్యం కుంభకోణంలో తన భర్తను ఈడీ అరెస్టు చేసిందని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ ఆరోపించారు. శనివారం ఓ వీడియో సందేశంలో మాట్లాడిన ఆమె... ఢిల్లీలో ఓ చారిటబుల్ ట్రస్టుకు భూ కేటాయింపు విషయంలో ముఖ్యమంత్రిని కలిశానని మార్చి 16, 2021లో ఈడీకి తెలిపిన శ్రీనివాసులు రెడ్డి... తదనంతరం కుమారుడు మాగుంట రాఘవ అరెస్టయి జైలుకు వెళ్లడంతో మాట మార్చారని పేర్కొన్నారు. స్వయంగా కేజ్రీవాలే పది మంది ముందే తనను లిక్కర్ వ్యాపారంలోకి అడుగుపెట్టామని కోరారని, ఆప్‌కు రూ. 100 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని జూలై 17, 2023లో అదే ఈడీకి తప్పుడు వాంగ్మూలం ఇచ్చారని తెలిపారు. "అంతమంది ముందు ఎవరైనా డబ్బులు అడుగుతారా?" అని ప్రశ్నించారు. ఆయన అలా మాట మార్చగానే... కుమారుడు రాఘవకు బెయిల్ దొరికిందని సునీతా ఆరోపించారు. ఎంపీ మాట మార్చారని దాన్ని బట్టే స్పష్టమవుతోందన్నారు. ఈడీ, సీబీఐలను అడ్డంపెట్టుకొని కేజ్రీవాల్‌ను, ఆమ్ ఆద్మీ పార్టీని ప్రధాని మోదీ అంతం చేయాలని చూస్తున్నారన్నారు. సీఎంకు ప్రజలు మద్దతివ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నిజాయితీపరుడు, దేశ భక్తుడైనా కేజ్రీవాల్ లాంటి వారికి మద్దతివ్వకపోతే చదువుకున్న వ్యక్తులు రాజకీయాల్లోకి రావడానికి సాహసించరని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, తిహాడ్ జైలులో ఉన్న ముఖ్యమంత్రి కేజ్రీవాల్ మెడికల్ రికార్డులను పరిశీలించేందుకు, ఆయన తరఫున వైద్యుల్ని సంప్రదించేందుకు సునీతా కేజ్రీవాల్‌కు ఢిల్లీ కోర్టు అనుమతినిచ్చింది. వైద్య పరీక్షల సమయంలో తన భార్యను అనుమతించాలన్న కేజ్రీవాల్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది.

'అగ్నిపథ్' వయోపరిమితి పెంపునకు సిఫారసు!

న్యూఢిల్లీ, జూలై 6: అగ్నిపథ్ అభ్యర్థుల వయోపరిమితిని 23 ఏళ్లకు పెంచాలని, నాలుగేళ్ల తర్వాత కనీసం 50% మందిని కొనసాగించాలని సాయుధ దళాలు కేంద్రానికి సిఫారసు చేయనున్నాయి. సైనికుల్లో పోరాట సామర్థ్యాలను పెంచే దిశగా ఈ మార్పులను సూచించాలని నిర్ణయించినట్లు సీనియర్ సైనిక అధికారులు వెల్లడించారు. గరిష్ఠ వయోపరిమితిని ప్రస్తుతం ఉన్న 21 ఏళ్ల నుంచి 23 ఏళ్లకు పెంచడం ద్వారా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన అభ్యర్థులు త్రివిధ దళాల్లో సాంకేతిక ఉద్యోగాలు పొందడానికి అవకాశాలు పెరుగుతాయన్నారు. 50% మందిని కొనసాగించడం వల్ల కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లో సిబ్బంది కొరతను అధిగమించవచ్చన్నారు. ప్రస్తుతం నాలుగేళ్ల తర్వాత కేవలం 25% మంది అగ్నివీర్‌ల సర్వీసును మాత్రమే కొనసాగిస్తున్నారు. కాగా, ఆగ్రా వైమానిక కేంద్రం షాఘంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సర్వీస్ తుపాకీతో కాల్చుకొని ఓ అగ్నివీర్ బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆత్మహత్యకు పాల్పడిన అగ్నివీర్.. శ్రీకాంత్ అని, యూపీలోని బలియా జిల్లా ఆయన స్వస్థలమని, 2022లో అగ్నివీర్ పథకం ద్వారా వైమానిక దళంలో చేరారని అధికారులు తెలిపారు.

కశ్మీర్‌లో నలుగురు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్, జూలై 6: కశ్మీర్‌లో శనివారం జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోగా, నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. కుల్గాం జిల్లా ఫ్రిసాల్ చిన్నిగాం వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు, ఒక జవాను ప్రాణాలు కోల్పోయారు. ఇదే జిల్లాలోని మోదెర్‌గాం గ్రామం వద్ద జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఒక జవాను మరణించాడు. చిన్నిగాం ప్రాంతంలో ఉన్నారన్న సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, ఆర్మీ, సీఆర్‌పీఎఫ్ జవాన్లు కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పుల్లో గాయపడ్డ జవాను ఒకరు అనంతరం ప్రాణాలు కోల్పోయాడని అధికార వర్గాలు తెలిపాయి. మరో సంఘటనలో మోదెర్‌గాంలోని ఓ ఇంట్లో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న సమాచారం అందుకున్న భద్రత బలగాలు ఆ ఇంటి చుట్టుముట్టాయి. ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఓ ఆర్మీ జవాను ప్రాణాలు కోల్పోయాడు.

ప్రయాణికులంతా ఎక్కారు.. పైలెట్లు లేరు

» 12 గంటల పాటు నిలిచిపోయిన స్పైస్‌జెట్ విమానం

బెంగళూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నుంచి బెంగళూరు రావాల్సిన విమానం పైలెట్ల కొరత కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో టేకాఫ్ కాకుండానే నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు విమానంలో 12గంటలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ గడపాల్సి వచ్చింది. బెంగళూరు రావాల్సిన ఎస్‌జీ 8151 స్పైస్‌జెట్ విమానం శుక్రవారం రాత్రి 7.40 టేకాఫ్ కావాల్సి ఉంది. కానీ ఢిల్లీలో ఎంత సేపటికీ కదల్లేదు. రాత్రి ఆహారం, ఇతర కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రయాణికులు ఆకలితో అలమటించారు. సోషల్ మీడియా ద్వారా స్పైస్‌జెట్ సంస్థ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగళూరు విమానాశ్రయానికి శనివారం ఉదయం చేరుకున్న ప్రయాణికులు అక్కడే స్పైస్‌జెట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా, విమానాన్ని చీకట్లో నిలిపివేశారన్నారు. పైలెట్ల కొరత వల్ల ఇలా జరిగినట్లు ఎయిర్‌లైన్స్ సంస్థ తెలిపింది.

పని ఇప్పిస్తామని పడుపు వృత్తిలోకి

» యువతుల దుస్థితిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

న్యూఢిల్లీ, జూలై 6: పని ఇప్పిస్తామని చెప్పి, యువతులను బలవంతంగా పడుపు వృత్తిలోకి దించుతున్న వైనంపై జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) స్పందించింది. నిజానిజాలు నిగ్గు తేల్చాలంటూ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీచేసింది. రాంచీ (బిహార్), ఝార్ఖండ్‌లో ఈ నెల ఒకటో తేదీన హోటళ్లు, లాడ్జీలపై దాడులు చేసి అరెస్టులు చేసినప్పుడు చాలామంది మహిళలు.. తమకు పని ఇప్పిస్తామని చెప్పి కొందరు బలవంతంగా పడుపు వృత్తిలోకి లాగినట్లు చెప్పారని అందులో వివరించింది. కాగా, బిచ్చగాళ్ల రక్షణ, పునరావాసం కోసం జాతీయ విధానం రూపొందించాలని ప్రభుత్వాలకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ సిఫారసు చేసింది. దేశవ్యాప్తంగా ఎంత మంది బిచ్చగాళ్లు ఉన్నారనేదానిపై జాతీయ స్థాయిలో డేటాబేస్‌ను ఏర్పాటుచేయాలంది.

షెడ్యూలే ప్రకటించలేదు,
వాయిదా ఎక్కడిది?



నీట్ యూజీ నిరవధిక వాయిదా వార్తల్ని ఖండించిన కేంద్రం

» ఈ నెలాఖరులో నీట్ యూజీ కౌన్సెలింగ్!
» రోజుకో వార్తతో విద్యార్థుల్లో టెన్షన్

న్యూఢిల్లీ, హైదరాబాద్ జూలై 6(ఆంధ్రజ్యోతి): నీట్ యూజీ కౌన్సెలింగ్‌పై గందరగోళం నెలకొంది. నీట్ యూజీ జాతీయ కోటా కౌన్సెలింగ్ నిరవధికంగా వాయిదా పడిందని శనివారం వార్తలు వెలువడ్డాయి. నీట్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేయాలని దాఖలైన పిటిషన్లను ఇటీవల సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఎలాంటి అడ్డంకులు లేకపోయినా కౌన్సెలింగ్‌ను ఎందుకు నిరవధికంగా వాయిదా వేస్తున్నారని అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు. అయితే, ఈ వార్తలను కేంద్ర ఆరోగ్య శాఖ ఖండించింది. అసలు కౌన్సెలింగ్ తేదీలే ప్రకటించలేదని, అలాంటప్పుడు వాయిదాకు అవకాశం ఎక్కడని ప్రశ్నించింది. గత మూడేళ్లుగా ఎప్పుడూ జూలై మొదటి వారంలో కౌన్సెలింగ్ ప్రారంభం కాలేదని గుర్తు చేసింది. 2021 నీట్ కౌన్సెలింగ్ 2022 జనవరిలో జరిగిందని, 2022 కౌన్సెలింగ్ అదే ఏడాది అక్టోబరులో జరిగిందని, 2023 కౌన్సెలింగ్ అదే ఏడాది జూలై 20న మొదలైందని ప్రస్తావించింది. ఈ విద్యా సంవత్సరానికి నీట్ యూజీ కౌన్సెలింగ్ తేదీలను జూలై మూడో వారంలో ఖరారు చేస్తామని, పీజీ కౌన్సెలింగ్ తేదీలను ఆగస్టు రెండో వారం తర్వాత ఖరారు చేస్తామని గత నెలలోనే జాతీయ వైద్య కమిషన్ చెప్పిందని కేంద్ర ఆరోగ్య శాఖ గుర్తు చేసింది. వాటికి అనుగుణంగా మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ షెడ్యూల్‌ను ప్రకటిస్తుందని చెప్పింది. సుప్రీంకోర్టు విచారణను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం చేపట్టనున్నారు. కాగా, కొన్ని వైద్య కళాశాలలకు అనుమతులు ఇచ్చే ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, తొలిదశ కౌన్సెలింగ్‌కే ఆ సీట్లు అందుబాటులో ఉండేట్లు చూస్తామని జాతీయ వైద్య కమిషన్ వర్గాలు వెల్లడించాయి. నీట్ పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని డిమాండ్లు ఊపందుకుంటుండగా కేంద్ర ప్రభుత్వం మాత్రం భారీఎత్తున అక్రమాలు జరిగినట్లు రుజువేమీ లేకుండా రద్దు చేయడం వల్ల నిజాయితీతో పరీక్ష రాసిన లక్షల మంది అభ్యర్థులు ఇబ్బందుల పాలవుతారని చెప్పింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నీట్ పరీక్షను రద్దు చేసి, మరింత పారదర్శకంగా నిర్వహించాలని శనివారం డిమాండ్ చేశారు. నీట్ అక్రమాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు నిర్వహించాలని కోరారు.

విద్యార్థుల్లో టెన్షన్

నీట్‌పై రోజుకో రకంగా వస్తున్న వార్తలతో రాష్ట్ర విద్యార్థుల్లో ఒకరకమైన భయాందోళనలు నెలకొన్నాయి. ఒకవేళ నీట్ రద్దు అయితే ఎలా అన్న టెన్షన్ వారిలో నెలకొంది. మెడిసిన్‌లో సీటు రాకపోతే ఇతర కోర్సులకు వెళ్లాలనేకునే విద్యార్థులు పెద్దసంఖ్యలో ఉన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే కొద్దీ ఇతర కోర్సుల్లో చేరే అవకాశం కూడా కోల్పోతామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మే 5న జరిగిన నీట్ పరీక్షలకు తెలంగాణ నుంచి 77,849 మంది హాజరు కాగా 47,371 మంది(60 శాతం) ఉత్తీర్ణత సాధించారు. గతేడాది కేవలం 58 శాతమే ఉత్తీర్ణత సాధించగా...ఈ మారు అది రెండు శాతం మేరకు పెరిగింది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి 56 మెడికల్ కాలేజీలుండగా.. వాటిలో 8515 ఎంబీబీఎస్ సీట్లున్నాయి.

తెలంగాణకు కొత్తగా 11 వైద్య కళాశాలలు

దేశవ్యాప్తంగా 113 కళాశాలలకు దరఖాస్తులు

ఎన్ఎంసీ జాబితా విడుదల

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది తెలంగాణలో కొత్తగా 11 వైద్య కళాశాలలు రాబోతున్నాయి. ఇందులో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే 8 కళాశాలలు రానున్నాయి. గద్వాల, మెదక్, ములుగు, మహేశ్వరం, నర్సంపేట, కుత్బుల్లాపూర్, యాదాద్రి భువనగిరి, నారాయణపేటలో ప్రభుత్వ వైద్య కళాశాలల కోసం దరఖాస్తులు వచ్చినట్లు జాతీయ వైద్య కమిషన్ వెల్లడించింది. అలాగే ప్రైవేటులో నిజామాబాద్ నుంచి సిస్ట క్రిస్టియన్ వైద్య కళాశాల, రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జాఫర్‌ఘడ్‌లో సేవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరువు సమీపంలోని చిట్కుల్‌లో రాజరాజేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి దరఖాస్తులు వచ్చినట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కలిపి మొత్తం 113 వైద్య కళాశాలలను కొత్తగా ఏర్పాటు చేసేందుకు తమకు దరఖాస్తులు వచ్చినట్లు ఎన్ఎంసీ పేర్కొంది. దరఖాస్తుల జాబితాను ఎన్ఎంసీ శనివారం తన అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టింది. పొరుగునే ఉన్న ఏపీలో పాడేరు, మదనపల్లి, ఆదోనిలలో ప్రభుత్వ వైద్య కళాశాలలకు, చిత్తూరులోని తిరుపతిలో అన్నాగౌరి వైద్య కళాశాల, పులివెందులలో వైయస్సార్ వైద్య కళాశాల, చిత్తూరులోనే ఆర్వీఎస్ కళాశాల కోసం దరఖాస్తులు వచ్చినట్లు తెలిపింది.

స్వేచ్ఛా వాణిజ్యాన్ని కొలిక్కి తెద్దాం

» భారత్-యూకే ప్రధానుల అంగీకారం



న్యూఢిల్లీ, జూలై 6: భారత్-బ్రిటన్ దేశాల మధ్య పరస్పర ప్రయోజనకరమైన, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) వీలైనంత త్వరగా కొలిక్కి తెచ్చే దిశగా పని చేయాలని ఇరు దేశాల ప్రధానులు అంగీకరించారు. యూకే సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించి, ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన కియర్ స్టార్మర్‌కు మరోసారి అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ.. త్వరలో భారత పర్యటనకు రావాలంటూ ఆయన్ను ఆహ్వానించారు. శనివారం ఉదయం స్టార్మర్‌కు మోదీ ఫోన్ చేసి మాట్లాడారు. ఇరు దేశాల్లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎఫ్‌టీఏపై నిలిచిపోయిన చర్చలను కొనసాగించాలని ఇరువురు ప్రధానులు నిర్ణయించినట్లు భారత విదేశాంగశాఖ ఓ ప్రకటనలో వివరించింది.

లేబర్‌పార్టీ మేనిఫెస్టోలో మా స్కీములు..
అందుకే విజయం: స్టాలిన్

చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తన నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం గత మూడేళ్లుగా అమలు చేస్తున్న మూడు పథకాలను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చడం వల్లనే ఇంగ్లాండులో లేబర్ పార్టీ అధికారాన్ని కైవసం చేసుకుందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ప్రభుత్వ బడుల్లో 1-5వ తరగతి దాకా చదివే పిల్లలకు 'సీఎం అల్పాహార పథకం', ప్లస్-2 (12వ తరగతి) చదివే విద్యార్థులకు ప్రతిభాపాటవాలపై శిక్షణలందించే 'నాన్ ముదల్వన్ పథకం', నిరుపేదలకు ఇళ్లను నిర్మించి ఇచ్చే 'కలైంజర్ కనవు ఇల్ల దిట్టమ్' (కలైంజర్ డ్రీమ్ హౌస్ ప్రాజెక్ట్) పథకాన్ని లేబర్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చటం వల్ల అక్కడి ప్రజాభిమానం పొందిందని అన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై సీపీఎం ఆత్మ పరిశీలన

న్యూఢిల్లీ, జూలై 6: ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ బలంగా ఉన్న కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో ఓటమి పాలవడంపై సీపీఎం పార్టీ ఆత్మ విశ్లేషణ చేసుకుంది. జూన్ 28,29,30వ తేదీల్లో న్యూఢిల్లీలో భేటీ అయిన ఆ పార్టీ ముఖ్య నేతలతో కూడిన సెంట్రల్ కమిటీ ఓటమికి గల కారణాలను విశ్లేషించింది. ముఖ్యంగా తమ పార్టీకి ప్రథమ మద్దతుదారులైన శ్రామిక, పేద, మధ్యతరగతి వర్గాలు తమకు దూరం కావడానికి గల కారణాలను కమిటీ పరిశీలించింది. ఆ నివేదికను శనివారం విడుదల చేసింది. కేరళలో అధిక శాతం మైనారిటీలు కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకూడదనే ఉద్దేశంతో ఇండియా కూటమికి మద్దతుగా నిలిచారని, అలాగే యువత ఎన్నికలకు దూరంగా ఉండడం కూడా ఆ రాష్ట్రంలో తమ పార్టీని దెబ్బకొట్టిందని పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లో పార్టీ వ్యవస్థ బలహీనం కావడంతో అక్కడ ఓటమి చెందినట్లు నిర్ధారించింది. ఆ రాష్ట్రంలో కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ ఉనికే లేదని, 12 నుంచి 14% బూత్‌లలో పార్టీకి ఏజెంట్లే లేరని పేర్కొంది. అలాగే తృణముల్ కాంగ్రెస్ ప్రకటించిన పథకాలతో పేద వర్గాలు తమ నుంచి దూరంగా జరిగాయని నిర్ధారించింది. త్రిపురలో బీజేపీ గిరిజన రాజకీయాలు పురిగొల్పినందువల్లే ఓటమి చెందినట్లు పేర్కొంది. ఆయా రాష్ట్రాలతో పాటు దేశంలోని మిగతా చోట్ల క్యాడర్‌ను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సెంట్రల్ కమిటీ ఓ తీర్మానం చేసింది.

అయోధ్యలో బీజేపీతో పాటు రామాలయ ఉద్యమాన్నీ ఓడించాం

» గుజరాత్‌లోనూ ఆ పార్టీకి అయోధ్య గతే
» అసెంబ్లీ ఎన్నికల్లో తప్పక ఓడిపోతుంది
» ఇది తథ్యం.. రాసిపెట్టుకోండి: రాహుల్



అహ్మదాబాద్, జూలై 6: అయోధ్యలో బీజేపీ అభ్యర్థిని ఓడించడం ద్వారా.. అడ్వాణీ ప్రారంభించిన రామాలయ ఉద్యమాన్ని ఇండియా కూటమి నీరుగార్చిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లో కూడా బీజేపీకి అయోధ్యలో పట్టిన గతే పడుతుందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ కచ్చితంగా ఓడిపోతుందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శనివారం రాహుల్‌గాంధీ గుజరాత్ పీసీసీ(జీపీసీసీ) కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం అయ్యారు. "అయోధ్యలో బీజేపీ అభ్యర్థి ఓడిపోతారని ఎవరైనా ఊహించారా.. వారాణసీలో మోదీకి అంతతక్కువ మెజారిటీ వస్తుందనుకున్నారా. అలాగే.. గుజరాత్‌లో కూడా మార్పు రానుంది" అని వ్యాఖ్యానించారు. గుజరాత్ ప్రజలు భయపడవద్దన్నారు. రాహుల్‌గాంధీ లోక్‌సభలో చేసిన 'హిందూ' వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు ఇటీవల జీపీసీసీ ఆఫీసు వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు పార్టీల కార్యకర్తల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. కార్యాలయంలో కొద్ది భాగం ధ్వంసమైంది. ఈ నేపథ్యంలోనే ఆయనశనివారం గుజరాత్‌లో పార్టీ కార్యకర్తలతో భేటీ అయ్యారు. "వాళ్లు(బీజేపీ) మన ఆఫీసును ధ్వంసం చేశారు. మనల్ని బెదిరించాలని చూశారు. కానీ, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వారి ప్రభుత్వమే ధ్వంసం కాబోతోంది. ఇది తథ్యం. రాసిపెట్టుకోండి" అని అన్నారు. అయోధ్య ప్రజలు మోదీపై ఆగ్రహంతో ఉన్నారని రాహుల్ ఈ సందర్భంగా చెప్పారు. ఎయిర్‌పోర్టు కోసం సేకరించిన భూములకు సంబంధించి రైతులకు అక్కడి ప్రభుత్వం ఇంకా పరిహారం చెల్లించలేదన్నారు. మోదీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో తొలుత అయోధ్యలోనే పోటీ చేయాలని భావించారని, కానీ ఓడిపోతారన్న సమాచారం ఉండటంతో ఆ ఆలోచనను విరమించుకొని వారాణసీలో పోటీ చేశారని చెప్పారు. పార్టీ కార్యకర్తలతో సమావేశం అనంతరం రాహుల్ గాంధీ.. గుజరాత్ గడిచిన రెండుమూడేళ్లలో జరిగిన పెద్ద పెద్ద ప్రమాదాల్లో చనిపోయినవారి కుటుంబ సభ్యులను కలిశారు. రాజ్‌కోట్ గేమింగ్ జోన్ ప్రమాదం, 2022లో మోర్బీ బ్రిడ్జి కూలిన ఘటన, వడోదరలో పడవ మునిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలను రాహుల్ కలిసి మాట్లాడారు. వారి సమస్యలను పార్లమెంటులో ప్రస్తావిస్తానన్నారు.

ఇరాన్ అధ్యక్షుడిగా పెజెష్కియాన్



టెహ్రాన్, జూలై 6: ఇస్లామిక్ రిపబ్లిక్ దేశమైన ఇరాన్‌లో సంస్కరణవాది డాక్టర్ మసౌద్ పెజెష్కియాన్ (69) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మే నెలలో అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలవడంతో ఇరాన్‌లో ఎన్నికలు నిర్వహించారు. శుక్రవారం పోలింగ్ జరగ్గా.. 3 కోట్ల మందిపైగా ఓటు వేశారు. శనివారం ఫలితాలను వెల్లడించారు. పెజెష్కియాన్‌కు 1.60 కోట్ల ఓట్లు, ఇబ్రహీం జలీలీకి 1.30 కోట్ల ఓట్లు వచ్చాయి. పెజెష్కియాన్ 28 లక్షల ఓట్ల తేడాతో జలీలీని ఓడించారు. ఇరాన్‌లో అధ్యక్ష ఎన్నికలకు తొలుత జూన్ 28న పోలింగ్ జరిగింది. అయితే, 6.1 కోట్ల మంది ఓటర్లలో 40 శాతం మంది మాత్రమే హక్కు వినియోగించుకున్నారు. దేశం ఎదుర్కొంటున్న పరిస్థితుల పట్ల ఆగ్రహంతోనే ఇలా చేశారని తెలుస్తోంది. మొదటి రౌండ్‌లో పెజెష్కియాన్‌కు 42 శాతం, జలీలీకి 39 శాతం ఓట్లే వచ్చాయి. ఇరాన్ ఎన్నికల చట్టాల ప్రకారం పోలైన ఓట్లలో 50 శాతం పైగా వచ్చినవారే విజేతలు. లేదంటే.. టాప్-2లో ఉన్న ఇద్దరి మధ్య వారం తర్వాత మళ్లీ ఎన్నిక నిర్వహిస్తారు. దీనినే రన్ ఆఫ్ పోలింగ్ (రెండోసారి బ్యాలెట్) అంటారు. ఈసారి పెజెష్కియాన్ మెజారిటీ సాధించారు. గుండె వైద్య నిపుణుడైన ఈయనకు సంస్కరణవాదిగా పేరుంది. అత్యంత వివాదాస్పద 'హిజాబ్ ధారణ తప్పనిసరి' నిబంధనను సరళం చేస్తానని, ఆర్థిక ఆంక్షలను ఎత్తివేసేలా.. పశ్చిమ దేశాలతో సంబంధాలను మెరుగుపరుస్తానని తన ప్రచారంలో హామీ ఇచ్చారు. పెజెష్కియాన్.. 1954లో ఇరాన్‌లోని పశ్చిమ అజర్‌బైజాన్‌లో జన్మించారు. ఈయన తల్లి కుర్దు కాగా, తండ్రిది ఒకప్పటి సోవియట్ యూనియన్‌లోని అజర్ బైజాన్. 1980 నుంచి 8 ఏళ్ల ఇరాక్‌తో జరిగిన యుద్ధంలో వైద్యుడిగా సేవలందించారు. నాలుగుసార్లు ఎంపీగా గెలిచారు. వైద్య శాఖ మంత్రి, డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

మూత్రనాళాలు సన్నబడుతున్నాయ్

» రోడ్డు ప్రమాదాలు, ఇన్‌ఫెక్షన్లు కారణం
» యూరాలజీ సదస్సులో వైద్యుల వెల్లడి



యూరాలజీ సదస్సులో పాల్గొన్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మూత్రనాళాలు సన్నబడిపోతున్నాయని, దాంతో శస్త్రచికిత్స చేసి సరిచేయాల్సి వస్తోందని, ఈ తరహా ఆపరేషన్లు ఇటీవల కాలంలో బాగా పెరిగాయని వైద్య నిపుణులు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్ల వల్ల మూత్రనాళాలు సన్నబడుతున్నాయని వారు వివరించారు. ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆధ్వర్యంలో యూరాలజీ సదస్సు శనివారం జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభమైంది. యూరేత్రా పేరుతో నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల సదస్సుకు 8 దేశాలతో సహా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 800 మందికి పైగా యూరాలజిస్టులు హాజరయ్యారు. మూత్రనాళ పునర్నిర్మాణ శస్త్రచికిత్సల్లో సరికొత్త ప్రక్రియలపై సదస్సులో చర్చించారు. మూత్రనాళాలు సన్నబడే అవకాశాలు పురుషుల్లో ఎక్కువగా ఉంటాయని, ఇటీవల మహిళలు, పిల్లల్లోనూ ఈ సమస్య కనిపిస్తోందని వైద్యులు తెలిపారు. గతంలో మూత్రనాళాలు సన్నబడటానికి గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులు ప్రధాన కారణంగా కనిపించేవని, గత రెండు దశాబ్దాలుగా అవగాహన పెరగడంతో ఈ సమస్య 30-40 శాతం వరకు తగ్గిందన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు, ఇన్ఫెక్షన్ల వల్ల మూత్రనాళ పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు ఎక్కువగా చేయాల్సి వస్తోందన్నారు. యూరాలజిస్టు భవతేజ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఫ్రాక్చర్లు అయినప్పుడు మూత్రనాళాలు కూడా దెబ్బతింటాయని, అలాంటప్పుడు కొన్ని నెలలు వేచి ఉండి, తర్వాత సరిచేయాల్సి ఉంటుందన్నారు. ఏఐఎన్‌యూ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ మల్లికార్జున మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్లలో వెయ్యికి పైగా శస్త్రచికిత్సలు చేశామని తెలిపారు. గతంలో ఏడాదికి 50 ఆపరేషన్లు చేసేవాళ్లమని, ఇప్పుడు 200-250 వరకు చేస్తున్నామన్నారు. 'మూత్రనాళ పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు సంక్లిష్టమైనవి. వీటిలో వైఫల్యాల రేటు ఎక్కువ. రోగుల కోణం నుంచి చూసినప్పుడు పెరుగుతున్న డిమాండుకు, నిపుణులైన సర్జన్లకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చాల్సిన అవసరముంది. నిపుణుల నుంచి నేర్చుకుని శిక్షణ పొందడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమ'ని పేర్కొన్నారు.

గుంతకల్లు రైల్వే ప్రాజెక్టుల్లో అవినీతి!

గుంతకల్లు, జూలై 6: ఏపీలోని గుంతకల్లు డివిజన్‌లో రైల్వే ప్రాజెక్టుల్లో అవినీతికి పాల్పడిన డీఆర్ఎం సహా ఐదుగురు రైల్వే ఉన్నతాధికారులను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. వీరికి లంచం ఇచ్చిన ఇద్దరు కాంట్రాక్టర్లను కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరిని శనివారం కర్నూలు కోర్టుకు తరలించారు. రైల్వేలో భద్రత కేటగిరీ కింద గతిశక్తి ప్రాజెక్టును చేపట్టిన కేంద్రం... ఎన్నికలకు ముందు దీనికి రూ.వందల కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో అనంతపురం జిల్లా గుంతకల్లు డివిజన్‌కు రూ.350 కోట్ల వరకూ వచ్చాయి. డివిజన్ పరిధిలోని వివిధ వంతెనల పునర్నిర్మాణానికి వీటిని వినియోగించాల్సి ఉంది. ఈ పనులకు టెండర్లు పిలవగా.. దాదాపు రూ.60 కోట్లతో నిర్మించాల్సిన వంతెనల కాంట్రాక్టును వీలేరుకు చెందిన సత్యనారాయణ దక్కించుకున్నారు. ప్రైజ్ బిడ్డరుగా ఉన్న సత్యనారాయణ, పనులను థర్డ్‌పార్టీ కాంట్రాక్టర్లకు ఇచ్చారు. అలా వంతెన నిర్మాణ పనుల కాంట్రాక్టు తీసుకున్న సబ్ కాంట్రాక్టర్లు రమేశ్‌రెడ్డి, రహ్మతుల్లా.. యాక్సెప్టెన్సీ లెటర్ కోసం గుంతకల్లు డీఆర్ఎం కార్యాలయంలో సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్(సీనియర్ డీఎఫ్ఎం) ప్రదీప్ బాబును సంప్రదించారు. ఈ పని చేయడం కోసం ఆయనకు కొంచెం లంచం కూడా ఇచ్చారు. అయినా పని జరక్కపోవడంతో మరోమారు సీనియర్ డీఎఫ్ఎం వద్దకు వెళ్లారు. ఆయన మరింత లంచం డిమాండ్ చేయడంతో సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశారు. రైల్వేలో అవినీతి అధికారులను పట్టుకునేందుకు సీబీఐ అధికారులు వారం క్రితం గుంతకల్లుకు వచ్చారు. సీనియర్ డీఎఫ్ఎం కె.ప్రదీప్ బాబును, ఇంజనీరింగ్ విభాగం ఓఎస్ బాలాజీ, గతిశక్తి చీఫ్ ప్రాజెక్టు ఆఫీసు అకౌంట్స్ అసిస్టెంట్ లక్ష్మీపతిరాజులు గురువారం లంచం తీసుకుంటుండగా అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారంలో డీఆర్ఎం వినీత్ సింగ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. డీఆర్ఎం, డీఎఫ్ఎం ఇళ్లల్లో శుక్రవారం సోదాలు చేసి, పెద్దమొత్తంలో నగదు, బంగారు నగలు, ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం వీరిని కర్నూలులోని సీబీఐ ప్రత్యేక కోర్టు ఎదుట హాజరుపర్చగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

గుట్టలో తిరుమల తరహాలో క్యూకాంప్లెక్స్!

కొండపై మందుబాబుల గుర్తింపునకు బ్రీత్‌ఎనలైజర్లు

యాదగిరిగుట్ట ఈవో భాస్కర్‌రావు వెల్లడి



భువనగిరి అర్బన్, జూలై 6: తిరుమల తరహాలో యాదగిరిగుట్ట ఆలయంలో స్వయంభువులకు ఎదురుగా క్యూకాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని అనుకుంటున్నామని యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో భాస్కర్‌రావు చెప్పారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. ప్రతీ భక్తుడికి ఇకనుంచి నిత్యం శఠగోపం, ఆశీర్వచనం అందజేస్తామని తెలిపారు. భక్తుల కోసం బస్టాండ్ ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లను ఈ నెల 10న ప్రారంభిస్తామని ప్రకటించారు. అలాగే, శ్రావణమాసంలోపు అన్నదాన సత్ర భవనాన్ని ప్రారంభిస్తామన్నారు. ఈ నెల 14న వన మహోత్సవంలో భాగంగా 2వేల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. 15న స్వాతి నక్షత్రం సందర్భంగా ఉదయం 6.05గంటలకు జరిగే గిరి ప్రదక్షిణలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాగా, ఈనెల 5న కొండపైన బాత్‌రూంలో మద్యం సీసాలు, గుట్కా ప్యాకెట్లు పడేసిన ఆకుల గణేశ్ అనే వ్యక్తిని గుర్తించి పోలీసులకు అప్పగించామని ఈవో ప్రకటించారు. క్యూకాంప్లెక్స్‌లో తినుబండారాలు విక్రయించేందుకు అనుమతి పొందిన గుజ్జ శ్రీను అనే కాంట్రాక్టర్ వద్ద గణేశ్ పని చేస్తుంటాడని చెప్పారు. కాగా, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు. కొండపై మద్యం సేవించిన వారిని గుర్తించేందుకు బ్రీత్ అనలైజర్లను అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

వేములవాడ రాజన్న భక్తులకు బ్రేక్ దర్శనం!



- వచ్చే నెలలోనే ప్రారంభం.. టికెట్ ధర రూ.300

సిరిసిల్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో త్వరలోనే బ్రేక్ దర్శనం అందుబాటులోకి రానుంది. ఈ మేరకు దేవాదాయ శాఖకు వేములవాడ దేవస్థానం అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఇందుకు సంబంధించిన అనుమతులు త్వరలోనే రానుండగా.. శ్రావణ మాసం మొదటి వారంలోనే బ్రేక్ దర్శనాలను ప్రారంభించేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే యాదాద్రి ఆలయంలో బ్రేక్ దర్శనాలను పరిశీలించి వచ్చిన అధికారులు.. వేములవాడలో ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. బ్రేక్ దర్శనం టికెట్ ధరను రూ.300గా నిర్ణయించారు. పదేళ్ల లోపు చిన్నారులకు టికెట్ అవసరం లేదు. ప్రతి రోజూ ఉదయం 10.15 నుంచి 11.15 గంటల వరకు ఒకసారి, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు మరోసారి బ్రేక్ దర్శనం కల్పించనున్నారు. ఈ టికెట్ తీసుకున్న భక్తులకు వంద గ్రాముల లడ్డూను ఉచితంగా అందించనున్నారు. బ్రేక్ దర్శనం టికెట్లను ఆఫ్‌లైన్‌తోపాటు ఆన్‌లైన్‌లోనూ అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. బ్రేక్‌దర్శనాన్ని తెస్తున్నప్పటికీ సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు.

యువకుడి ప్రాణం తీసిన విద్యుత్ లైన్‌మన్ నిర్లక్ష్యం

- తనకు బదులుగా విధులు అప్పగింత
- విద్యుత్ స్తంభం పైనుంచి పడి మృత్యువాత



మహేశ్ (ఫైల్)

పాపన్నపేట, జూలై 6: మెదక్ జిల్లా పాపన్నపేట మండలం అర్కెలలో జూనియర్ లైన్‌మన్ నిర్లక్ష్యానికి ఓ యువకుడు బలయ్యాడు. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం పోసానిపల్లి గ్రామానికి చెందిన మన్నె మహేశ్ (32) పాపన్నపేట మండలం సీతానగరం గ్రామానికి చెందిన లంగడి సునీతను వివాహం చేసుకుని అక్కడే జీవిస్తున్నాడు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె సంతానం. అదే గ్రామంలో పనిచేస్తున్న జేఎల్‌ఎం తనకు బినామీ ఉద్యోగిగా మహేశ్‌ను పెట్టుకున్నాడు. నెలకు రూ. 4 వేలు ఇస్తూ తన పరిధిలో ఎక్కడ విద్యుత్ స్తంభం ఎక్కాల్సి వచ్చినా మహేశ్‌ను వినియోగించుకునేవాడు. ఈ క్రమంలో శనివారం అర్కెలలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేయాల్సి రావడంతో జేఎల్‌ఎం.. మహేశ్‌కు పని అప్పగించి వెళ్లిపోయాడు. అతడి ఆదేశం మేరకు మహేశ్ 11 కేవీ లైన్‌కు ఎల్‌సీ తీసుకుని విద్యుత్ స్తంభం పైకెక్కి మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న హై టెన్షన్ తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. దాంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మహేశ్ మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

డిండి గురుకులంలో 16 మంది విద్యార్థినులను కొరికిన ఎలుకలు

ఆస్పత్రిలో చికిత్స.. విద్యార్థి సంఘాల ఆందోళన

డిండి, జూలై 6: నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 16 మంది విద్యార్థినులను ఎలుకలు గాయపర్చాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గాయాలైన విద్యార్థినులకు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న పాఠశాల ఏఎన్ఎం, ప్రిన్సిపాల్.. ఎలుకలు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ నెల 2న ఆరుగురు, 3న ఆరుగురు, 5న నలుగురిని ఎలుకలు గాయపరచగా, వైద్యం అందించినట్లు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం రికార్డుల్లో నమోదు చేశారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ పద్మను వివరణ కోరగా నలుగురిని మాత్రమే ఎలుకలు గాయపర్చినట్లు తెలిపారు. విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎస్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గురుకులం ఎదుట ధర్నా నిర్వహించారు. కాగా, పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు 640 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల చుట్టూ పిచ్చి మొక్కలు, గడ్డి, చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాములు తిరుగుతున్నాయని విద్యార్థినులు తెలిపారు. పరిసరాల్లో మురుగునీరు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని, ఈగలు, దోమలు వ్యాపించి బాలికలు అనారోగ్యం పాలవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

మత్తు పదార్థాలను దరి చేరనివ్వొద్దు

హైకోర్టు న్యాయమూర్తి సుజోయ్‌పాల్

నిజామాబాద్ లీగల్, జూలై 6: మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని, వాటి వల్ల భవిష్యత్తు అంధకారంగా మారుతుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సుజోయ్‌పాల్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం 'మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సుజోయ్‌పాల్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. మాదక ద్రవ్యాల వైపు మరలకుండా జీవితంలో ఏర్పర్చుకున్న లక్ష్యం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. తాము చదువుకునే రోజుల్లో ఆత్మహత్యలు ఉండేవి కావని, కాని నేడు కొంత మంది విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడి మానసిక కుంగుబాటుకు లోనవుతూ ప్రాణాలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడలు, వ్యాయామాలు వంటివి చేస్తే మానసిక స్థైర్యం అలవడుతుందని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచస్థాయి ప్రమాణాలతో కొత్త హైకోర్టు

- అధికారంలోకి రాగానే నిర్మాణానికి 100 ఎకరాలిచ్చాం
- త్వరలో హెచ్‌ఆర్సీ చైర్మన్, సభ్యులను నియమిస్తాం
- నల్సార్-క్యాపిటల్ ఫౌండేషన్ అవార్డుల కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్



'భారత బాలలమైన మేము' అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, భారత అటార్నీ జనరల్ వెంకట రమణి తదితరులు

హైదరాబాద్, శామీర్‌పేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే మార్గదర్శకత్వంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో నూతన హైకోర్టు భవన సముదాయాన్ని నిర్మిస్తామని, న్యాయవ్యవస్థలో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అతికొద్ది రోజుల్లోనే కొత్త హైకోర్టు నిర్మాణం కోసం రాజేంద్రనగర్‌లో వంద ఎకరాలను కేటాయించామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తప్పులు జరిగాయని, ప్రజ లు అనూహ్యమైన తీర్పు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించారన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలను పునరుద్ధరిస్తామని చెప్పారు. న్యాయ వ్యవస్థకు అత్యం త గౌరవం ఇస్తామని, కోర్టు తీర్పులను, న్యాయవ్యవస్థ సలహాలను పాటిస్తామన్నారు. క్యాపిటల్ ఫౌండేషన్ వార్షిక ఉపన్యాసం, అవార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం శామీర్‌పేట్ నల్సార్ యూనివర్సిటీలో జరిగింది. ఈ కార్యక్రమంలో అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా ఆర్ వెంకటరమణి, తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్, నల్సార్ చాన్స్‌లర్ అలోక్ అరాధే, సుప్రీంమాజీ న్యాయమూర్తి, క్యాపిటల్ ఫౌండేషన్ చైర్మన్ ఏకే పట్నాయక్, క్యాపిటల్ ఫౌండేషన్ సెక్రటరీ వినోద్ సేథి, ప్రొఫెసర్ కే పురుషోత్తంరెడ్డి, నల్సార్ వైస్ ఛాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు తదితరులతో కలిసి మంత్రి ఉత్తమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎంతో మాట్లాడి హక్కుల మానవ కమిషన్ (హెచ్‌ఆర్సీ)కు త్వరలోనే చైర్మన్, సభ్యుల నియామకాలు జరిగేలా కృషిచేస్తానని చెప్పారు. కాగా, జస్టిస్ జేఎస్ వర్మ జాతీయ అవార్డును హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధేకు అటార్నీ జనరల్ వెంకటరమణి అందజేశారు. జస్టిస్ దీపాంకర్ ప్రసాద్ గుప్తా జాతీయ అవార్డు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ పీఎన్ భగవతి జాతీయ అవార్డును జస్టిస్ అజయ్ లాంబా, కేకే వేణుగోపాల్ జాతీయ అవార్డును సీనియర్ న్యాయవాది పరాగ్ పీ త్రిపాఠీ, కే పరాశరన్ జాతీయ అవార్డును ఎస్ఎస్ నాగానంద్, ఎన్ నరోత్తంరెడ్డి జాతీయ అవార్డును దిలీప్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ అండ్ హెల్త్‌కేర్ నేషనల్ అవార్డు డాక్టర్ అల్లంకి కిషన్‌రావు, ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ అవార్డు డాక్టర్ కే తులసీరావు, డాక్టర్ శివాజీరావు అవార్డును డాక్టర్ నర్సింహారెడ్డి, క్యాపిటల్ ఫౌండేషన్ నేషనల్ అవార్డును ప్రొఫెసర్ రామినేని శివరామ ప్రసాద్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు, తెలంగాణ హైకోర్టు జడ్జిలు జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, అడ్వకేట్ జనరల్ సురద్శన్ రెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

బస్సులో పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బందికి సన్మానం

చిన్నారికి లైఫ్ టైం ఉచిత బస్‌పాస్: సజ్జనార్



కండక్టర్ సరోజ, డ్రైవర్ ఎంఎం. అలీని సన్మానిస్తున్న సజ్జనార్

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో గర్భిణీకి పురుడుపోసి మానవత్వం చాటుకున్న సంస్థ సిబ్బందిని టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ.సజ్జనార్ ఘనంగా సన్మానించారు. బస్సులో జన్మించిన చిన్నారికి జీవిత కాలం ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా బస్‌పాస్ సౌకర్యం కల్పిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. శనివారం బస్ భవన్‌లో పురుడుపోసిన సిబ్బందిని ఆయన అధికారులతో కలిసి ఘనంగా సన్మానించారు. సమయస్ఫూర్తితో స్పందించిన కండక్టర్ సరోజ, డ్రైవర్ ఎంఎం. అలీ సేవలను ఈ సందర్భంగా సజ్జనార్ ప్రశంసించారు. ముషీరాబాద్ డిపోకు చెందిన 1 జెడ్ రూట్ బస్సులో శుక్రవారం ఉదయం శ్వేతా రత్నంకు పురిటి నొప్పులు రావడంతో మహిళా ప్రయాణికుల సాయంతో కండెక్టర్ సరోజ సాధారణ ప్రసవం చేసిన సంగతి తెలిసిందే. అనంతరం డ్రైవర్ అలీ తల్లీబిడ్డలను బస్సులో తీసుకెళ్లి గవర్నమెంటు ఆస్పత్రిలో చేర్పించారు. కాగా, శిశువుకు జనన ధ్రువీకరణ పత్రాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులు శనివారం అందజేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK



కొత్తపలుకు

నవ్విపోదురుగాక...

"వాడిని అలా వదిలేయకండిరా! ఎవరికైనా చూపించండిరా!' అని 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' అనే చిత్రంలో రావు రమేశ్ కేరెక్టర్‌కు ఒక డైలాగ్ ఉంటుంది. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రెండు రోజుల క్రితం చేసిన ప్రకటనలు విన్న వారికీ, చదివిన వారికీ ఈ డైలాగ్ గుర్తుకు వస్తే తప్పు పట్టాల్సిందేమీ లేదు. తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో తాను ఓడిపోవడం వల్ల దేశ రైతాంగానికి నష్టం వాటిల్లిందని, కేంద్రంలో తన నాయకత్వంలో 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' ఏర్పాటు చేద్దామనుకున్నానని కేసీఆర్ చెప్పుకొన్నారు. 'నా ఓటమి దేశానికే నష్టం' అని కూడా ఆయన చెప్పుకొచ్చారు. తెలంగాణలో తాను ఓడిపోయినందుకు మహారాష్ట్రలో రైతులు బాధపడ్డారని అక్కడి నాయకులు తనతో అన్నారని కూడా ఆయన సెలవిచ్చారు. ఈ మాటలు విన్నవారికి కేసీఆర్ మానసిక స్థితిపై సహజంగానే అనుమానం వస్తుంది. ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారు. కేసీఆర్ ఈ మౌలిక సూత్రాన్ని విస్మరించి ఏకంగా భారత ప్రధాని అయిపోదామని

> ప్రజల్లో వ్యతిరేకత వల్ల తాను ఓడిపోలేదని చెప్పుకోవడం జగన్ మానసిక స్థితికి అద్దంపడుతోంది. ప్రజల్లో వ్యతిరేకత లేకపోతే ఎవరైనా ఎందుకు ఓడిపోతారు? కాకి పిల్ల కాకికి ముద్దు అంటారు. అలాగే అధికారంలో ఉన్నప్పుడు బటన్లు నొక్కడమే ప్రజలకు చేసిన, చేయాల్సిన మంచి అని జగన్ నమ్మినట్టున్నారు. అందుకే మంచి చేసి మరీ ఓడిపోయామని ఆయన చెప్పుకొంటున్నారు. వైసీపీలో రాజకీయ అవగాహన ఉన్నవారు ఎవరైనా మిగిలి ఉంటే జగన్మోహన్‌రెడ్డికి జ్ఞానోదయం కలిగించే ప్రయత్నాలు అర్జంటుగా చేయాలి. తన పాలన ఎలా సాగిందో, 61 శాతం ప్రజలు తనను వద్దని ఎందుకు అనుకున్నారో కూడా తెలుసుకొనే ప్రయత్నం చేయకపోతే వైసీపీకి రాజకీయ భవిష్యత్తు ఉంటుందా?

ఆకాశానికి నిచ్చెనలు వేశారు. ఉట్టి కొట్టడానికి ఎగరలేనివాడు స్వర్గానికి ఎగురుతానని అన్నట్టుగా ఆయన మాటల ధోరణి ఉంది. తెలంగాణలో తనను తిరస్కరించబోతున్నారన్న వాస్తవాన్ని గుర్తించకుండా జాతీయ పార్టీ అంటూ హడావిడి చేసి తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా పేరు మార్చుకున్న కేసీఆర్ ఆ దిశగా గట్టి ప్రయత్నం కూడా చేయలేదు. శాసనసభ ఎన్నికలకు ముందు మహారాష్ట్రతోపాటు ఒకటి రెండు పొరుగు రాష్ట్రాలకు చెందిన క్షేత్రస్థాయిలో బలం లేని నేతలు కొందర్ని పిలిపించుకొని హడావిడి చేశారు. 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అన్న నినాదాన్ని అందుకున్న కేసీఆర్, మహారాష్ట్ర తప్ప మరే రాష్ట్రంలోనూ పర్యటించలేదు. ఢిల్లీలో జాతీయ పార్టీ కార్యాలయ భవన్ నిర్మిస్తున్నట్టుగా మందీమార్బలంతో వెళ్లి హడావిడి చేశారు. ఇప్పుడు లోక్‌సభలో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం కూడా లేకుండా పోయింది. స్వయం ప్రకటిత జాతీయ నాయకులకు ఉత్తరాది రాజకీయాలలో చోటు ఉండదు. ఈ విషయాన్ని తెలుసుకోకుండా తనకు తాను జాతీయ నాయకుడినని ఆయన ప్రచారం చేసుకున్నారు.


నాడు ఎన్టీఆర్ అలా...

1989కి ముందు ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీ రామారావు నేషనల్ ఫ్రంట్‌కు చైర్మన్‌గా వ్యవహరించారు. అప్పట్లో ప్రతిపక్షాలకు చెందిన హేమాహేమీ నాయకులైన దేవీలాల్, బిజూ పట్నాయక్, చంద్రశేఖర్‌వంటి వారు కూడా ఎన్టీఆర్‌తో కలసి నడిచారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వంతో విభేదించి బయటకు వచ్చిన విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ నేషనల్ ఫ్రంట్‌కు కన్వీనర్‌గా వ్యవహరించారు. 1989 ఎన్నికల్లో కేంద్రంలో వీపీ సింగ్ ప్రధానమంత్రిగా నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడింది. అనూహ్యంగా రాష్ట్రంలో ఎన్టీఆర్ అధికారం కోల్పోయారు. దీంతో జాతీయ స్థాయిలో ఎన్టీఆర్‌ను పట్టించుకున్నవారే లేకపోయారు. ఎన్టీఆర్ చేతుల మీదుగా ఎదిగిన నేషనల్ ఫ్రంట్ ఏర్పరచిన ప్రభుత్వంలో ఆయనకు చోటు లభించలేదు. ఎన్టీఆర్‌ను ఉప ప్రధానిగా నియమించాలని తెలుగుదేశం పార్టీ ప్రతిపాదించగా నాటి ప్రధాని వీపీ సింగ్ ఖాతరు చేయలేదు. ఎన్నికల్లో ఓడిపోయిన వారిని ఉప ప్రధానిని చేయడం కుదరదని తేల్చి చెప్పారు. రాజకీయాలు అంటేనే నంబర్ గేమ్. సంఖ్యా బలం ఆధారంగానే కేంద్రంలో అధికారంలో వాటా లభిస్తుంది. ప్రతిపక్షంలో కూర్చున్నా సంఖ్యా బలం లేకపోతే గౌరవం లభించదు. ఎన్టీఆర్‌కు ఎదురైన ఈ చేదు అనుభవం కేసీఆర్‌కు తెలియంది కాదు. అప్పుడు కేసీఆర్ తెలుగుదేశం పార్టీలోనే ఉన్నారు. జాతీయ రాజకీయాలలో దక్షిణాది వారి ఆధిపత్యాన్ని ఉత్తరాది వారు అంగీకరించరు. కారణం.. ఉత్తర భారతానికి అధిక సీట్లు ఉంటాయి. తెలుగు వాడైన పీవీ నరసింహారావు ఐదేళ్లపాటు ప్రధానిగా కొనసాగగలిగారంటే, అందుకు కారణం ఆయన బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందినవారు కావడమే అన్న అభిప్రాయం కూడా ఉంది. ఈ నేపథ్యంలో కేసీఆర్ నేల విడిచి సాము చేస్తున్నారని అప్పట్లోనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎన్నికల్లో ఓడిపోయి ఏడు మాసాలు దాటుతున్నా తన ఓటమికి కారణాలేమిటో గుర్తించడానికి కేసీఆర్ ఇష్టపడకపోవడం ఆశ్చర్యంగా ఉంది. పైగా ఈ దేశ రైతాంగమంతా తన నాయకత్వం లభించనందుకు బాధపడుతున్నట్టుగా బిల్డప్ ఇచ్చుకొనే ప్రయత్నం చేయడం హాస్యాస్పదంగా ఉంది. మిగతా రాష్ట్రాల రైతుల విషయం తర్వాత చూద్దాం! శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ రైతులు కూడా కేసీఆర్ పార్టీని బండకేసి బాదారు. జిల్లాలకు జిల్లాలు తుడిచిపెట్టుకుపోయాయి. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయారు. ఒకప్పుడు తెలంగాణలో తిరుగులేని నాయకుడిగా చెలామణి అయిన తనను ప్రజలు ఇంతలా ఎందుకు తిరస్కరించారన్నది తెలుసుకొనే ప్రయత్నం చేయకపోగా దేశ ప్రజలు తన నాయకత్వం కోసం అల్లాడిపోతున్నారని గొప్పలకు పోవడం వల్ల ఆయనే నవ్వులపాలవుతున్నారు.

ప్రజలు పంపిన సంకేతాలు...

2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల నాటి నుంచే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌కు తమలోని అసంతృప్తి తెలియజేస్తూనే ఉన్నారు. దుబ్బాక, హుజురాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. అయినా పట్టించుకోకపోగా జాతీయ పార్టీ అంటూ ప్రగల్భాలకు పోవడంతో 2023 నాటికి అంతకు ముందున్న అసంతృప్తి ప్రజాగ్రహంగా మారి పరాభవం చవిచూడాల్సి వచ్చింది. కాలం కలసి రాకపోతే ఆలోచనలు కూడా పెడమార్గం పడతాయి కాబోలు. రాష్ట్రంలో తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటో తెలియక బీఆర్ఎస్ శ్రేణులు ప్రస్తుతం అల్లాడిపోతున్నాయి. వారిలో ఆత్మవిశ్వాసం ప్రోదిచేసే ప్రయత్నం చేయకుండా ఎర్రవల్లిలోని తన ఫాం హౌజ్‌కు రోజూ కొందరిని పిలిపించుకొని 'నేను ఓడిపోయానని దేశమంతా బాధపడుతోంది' అని చెప్పుకోవడం కేసీఆర్‌కే చెల్లుతుంది. ఈ స్పీడ్ యుగంలో ఎవరికోసం ఎవరూ ఏడవరు. ఇంట్లో వాళ్లు పోతేనే నాలుగు రోజులు గడిచాక పనుల్లో పడి మరచిపోతున్నారు. అపర చాణక్యుడినని చెప్పుకొనే కేసీఆర్‌కు ఇవన్నీ తెలియవా? అడ్డం, పొడవు మాటలు చెప్పడం కేసీఆర్‌కు అలవాటే. అందుకే ఆయన మాటలను విశ్వసించని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పక్క చూపులు చూస్తున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు తనను వదిలిపోకుండా ఉండేందుకు కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలించడం లేదు. దీంతో ఆయన భారతీయ జనతా పార్టీకి చెందిన ఒక కీలక నేత సహాయాన్ని అర్థించారు. ఆ కీలక నేత రంగంలోకి దిగి... బీఆర్ఎస్‌ను వదిలిపోతారని ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యేలకు ఫోన్లు చేసి 'మీరు పార్టీ మారాలనుకుంటే భారతీయ జనతా పార్టీలో చేరండి. లేదంటే బీఆర్ఎస్‌లోనే ఉండండి. కాదూ కూడదని కాంగ్రెస్ పార్టీలో చేరితే తర్వాత పరిణామాలకు సిద్ధంగా ఉండండి' అని హెచ్చరించినట్టుగా తెలిసింది. బీజేపీతో రాజకీయంగా చేతులు కలపడానికి కేసీఆర్ ఇదివరకే సిద్ధపడిపోయినట్టు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ తరఫున బీజేపీకి చెందిన కీలక నేత రంగప్రవేశం చేసి ఫిరాయింపులను నిరోధించే పనిలో పడ్డారు. అయినా సదరు ప్రయత్నాలు ఫలిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద తమపై అనర్హత వేటు పడకుండా ఏం చేయాలన్న దానిపై ప్రస్తుతం వారు తర్జనభర్జన పడుతున్నారు. ఈ విషయంలో స్పష్టత వచ్చాక భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు ఉంటాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు రాజకీయ భవిష్యత్తు ఉంటుందని పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం పాదుకొల్పాల్సిన కేసీఆర్ గొప్పలకు పోవడం వింతగా ఉంది. ఫాంహౌజ్ నుంచి అడుగు బయటపెట్టకుండా... రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు అప్పుడే విసిగిపోయారని చెప్పుకొంటూ ఆత్మవంచన చేసుకుంటున్నారు. తాను కోల్పోయిన తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని తిరిగి చూరగొనే ప్రయత్నం చేయకుండా, దేశంలోని రైతులందరూ తన నాయకత్వం లభించలేదని ఆవేదన చెందుతున్నారని చెప్పుకోవడం ఎండమావుల వెంట పరుగెత్తడమే అవుతుంది.

> బీఆర్ఎస్‌కు రాజకీయ భవిష్యత్తు ఉంటుందని పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం పాదుకొల్పాల్సిన కేసీఆర్ గొప్పలకు పోవడం వింతగా ఉంది. ఫాంహౌజ్ నుంచి అడుగు బయట పెట్టకుండా... రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు అప్పుడే విసిగిపోయారని చెప్పుకొంటూ ఆత్మవంచన చేసుకుంటున్నారు.



> ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారు. కేసీఆర్ ఈ మౌలిక సూత్రాన్ని విస్మరించి ఏకంగా భారత ప్రధాని అయిపోదామని ఆకాశానికి నిచ్చెనలు వేశారు. ఉట్టి కొట్టడానికి ఎగరలేనివాడు స్వర్గానికి ఎగురుతానని అన్నట్టుగా ఆయన మాటల ధోరణి ఉంది. 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అన్న నినాదాన్ని అందుకున్న కేసీఆర్, మహారాష్ట్ర తప్ప మరే రాష్ట్రంలోనూ పర్యటించలేదు. ఢిల్లీలో జాతీయ పార్టీ కార్యాలయ భవన్ నిర్మిస్తున్నట్టుగా మందీమార్బలంతో వెళ్లి హడావిడి చేశారు. ఇప్పుడు లోక్‌సభలో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం కూడా లేకుండా పోయింది. పైగా ఈ దేశ రైతాంగమంతా తన నాయకత్వం లభించనందుకు బాధపడుతున్నట్టుగా బిల్డప్ ఇచ్చుకొనే ప్రయత్నం చేయడం హాస్యాస్పదంగా ఉంది. మిగతా రాష్ట్రాల రైతుల విషయం తర్వాత చూద్దాం! శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ రైతులు కూడా కేసీఆర్ పార్టీని బండకేసి బాదారు. జిల్లాలకు జిల్లాలు తుడిచిపెట్టుకుపోయాయి. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయారు. ఒకప్పుడు తెలంగాణలో తిరుగులేని నాయకుడిగా చెలామణి అయిన తనను ప్రజలు ఇంతలా ఎందుకు తిరస్కరించారన్నది తెలుసుకొనే ప్రయత్నం చేయకపోగా దేశ ప్రజలు తన నాయకత్వం కోసం అల్లాడిపోతున్నారని గొప్పలకు పోవడం వల్ల ఆయనే నవ్వులపాలవుతున్నారు.

అంతకుమించి... జగన్

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విషయానికి వద్దాం! ఎన్నికల ఫలితాలు చూసి హిమాలయాలకు వెళ్లిపోదామనుకున్నానని వైరాగ్యం ప్రదర్శించిన జగన్‌రెడ్డి ఈ మధ్య కొంత తేరుకొని ప్రస్తుతం నెల్లూరు జైలులో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించేందుకు అడుగు బయట పెట్టారు. 2004కు ముందు వైఎస్ రాజశేఖర రెడ్డి కూడా హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న గౌరు వెంకటరెడ్డిని పరామర్శించేందుకు కర్నూలు జైలుకు వెళ్లారు. ఇప్పుడు తండ్రి బాటలో జగన్మోహన్‌రెడ్డి పిన్నెల్లిని జైల్లో పరామర్శించారు. పరామర్శల తర్వాత జైలు బయట ఆయన విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలు కూడా 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాలోని రావు రమేశ్ డైలాగ్‌ను గుర్తుకు తెస్తున్నాయి. ప్రజలు తనను ఎందుకు గెలిపించారో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచించుకోవాలని జగన్‌రెడ్డి సెలవిచ్చారు. ప్రజల్లో వ్యతిరేకత వల్ల తాను ఓడిపోలేదని, మంచి చేసి కూడా ఓడిపోయానన్న వింత లాజిక్‌ను కూడా తెర మీదకు తెచ్చారు. ఎన్నికల్లో గెలిచినవారు ఎందుకు గెలిచామని ఆలోచించడం ఎక్కడైనా చూశామా? ఓడిపోయినవారు కదా ప్రజలు తమను ఎందుకు ఓడించారో సమీక్ష చేసుకుంటారు! ప్రజల్లో వ్యతిరేకత వల్ల తాను ఓడిపోలేదని చెప్పుకోవడం ఆయన మానసిక స్థితికి అద్దంపడుతోంది. ప్రజల్లో వ్యతిరేకత లేకపోతే ఎవరైనా ఎందుకు ఓడిపోతారు? కాకి పిల్ల కాకికి ముద్దు అంటారు. అలాగే అధికారంలో ఉన్నప్పుడు బటన్లు నొక్కడమే ప్రజలకు చేసిన, చేయాల్సిన మంచి అని జగన్ నమ్మినట్టున్నారు. అందుకే మంచి చేసి మరీ ఓడిపోయామని ఆయన చెప్పుకొంటున్నారు. వైసీపీలో రాజకీయ అవగాహన ఉన్నవారు ఎవరైనా మిగిలి ఉంటే జగన్మోహన్‌రెడ్డికి జ్ఞానోదయం కలిగించే ప్రయత్నాలు అర్జంటుగా చేయాలి. తన పాలన ఎలా సాగిందో, 61 శాతం ప్రజలు తనను వద్దని ఎందుకు అనుకున్నారో కూడా తెలుసుకొనే ప్రయత్నం చేయకపోతే వైసీపీకి రాజకీయ భవిష్యత్తు ఉంటుందా? జగన్‌రెడ్డి ఈ అసంబద్ధ వాదన చేస్తున్నప్పుడు ఆయన పక్కన అంబటి రాంబాబు, అనిల్ కుమార్ యాదవ్ మాత్రమే ఉన్నారు. వారి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంచివాడు కనుకే నాలుగు పర్యాయాలు ఎన్నికల్లో గెలిచారని కూడా జగన్ చెప్పారు. ఈ ఎన్నికల్లో ఆయనకు అనుకూలంగా ఓట్లు పడనివ్వడంలేదనే కోపంతో ఈవీఎం పగలగొట్టారని జగన్ చెప్పేయడంతో ఈ కేసులో పిన్నెల్లి మరింతగా ఇరుక్కుపోయారు. ఓట్లు పడకపోతే ఈవీఎంలను పగలగొట్టేయవచ్చునన్న ధోరణిలో జగన్ మాటలు ఉన్నాయి. రాష్ట్రంలో తమ పార్టీ కార్యకర్తలపై దాడులు పెరిగిపోయాయని, వాటిని ఆపాల్సిందిగా తాను కోరడం లేదని, తనకూ టైం వస్తుందని హెచ్చరిస్తున్నానని జగన్ ప్రకటించారు. గత ఐదేళ్లలో రూల్ ఆఫ్ లా లేకుండా పాలించిన జగన్మోహన్‌రెడ్డి దాడులు, దౌర్జన్యాలు అనడం వింతగా ఉంది. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కూడా పూర్తి కాలేదు. కానీ, జగన్ రోత పత్రికలో మాత్రం రోజూ ఏడుపులూ పెడబొబ్బలే కనిపిస్తున్నాయి. తల్లికి వందనం, ఆడపడుచులకు ఆర్థిక చేయూత వంటి పథకాల జాడ ఏదని ఆక్రోశిస్తున్నారు. మరో అడుగు ముందుకెళ్లి 'మీ రాష్ట్రానికి రాలేం బాబోయ్' అని సాఫ్ట్‌వేర్ కంపెనీలు అప్పుడే ప్రకటించాయంటూ మరో దిక్కుమాలిన వార్త వండి వార్చారు. ఇలాంటి వార్తే జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఇతర పత్రికలలో వచ్చి ఉంటే నీలి మీడియా, కూలి మీడియాతో పాటు పేటీఎం బ్యాచ్ రెచ్చిపోయి ఉండేది.

మంచీ... చెడూ..

ఎన్నికల ప్రచారం సందర్భంగా మంచివాళ్లు అని జగన్ పరిచయం చేసిన అభ్యర్థులందరూ ఓడిపోయారు. పిన్నెల్లి కూడా మంచివాడైతే ఐదో పర్యాయం కూడా గెలిచి ఉండాలి కదా? ఇంతకూ జగన్ డిక్షనరీలో మంచివాడు అన్న మాటకు నిర్వచనం ఏమిటి? ఆయన నిర్వచనాన్ని ప్రజలు అర్థం చేసుకున్నట్టు లేరు. అందుకే ఆ 'మంచి' వాళ్లను తుక్కు తుక్కుగా ఓడించారు. ప్రజలకు మంచి చేశానని జగన్ చెబుతున్న మాటలు కూడా ఈ కోవలోకే వస్తాయి. ప్రజల దృష్టిలో మంచి వేరు — జగన్ దృష్టిలో మంచి వేరు. అందుకే ఆయన చెప్పుకొనే మంచి ప్రజలకు రుచించలేదు. ప్రజలు తనను ఎందుకు ఓడించారో గుర్తించడానికి నిరాకరించడం వల్ల జగన్‌కే నష్టం. ప్రజల్లో వ్యతిరేకత లేకపోతే ఎవరైనా ఎందుకు ఓడిపోతారు? కేవలం పది శాతం ఓట్లు అటు వెళ్లడం వల్ల ఓడిపోయామని చెప్పుకోవడం ఆత్మవంచన కాక మరేమిటి? 2019 ఎన్నికల్లో జగన్‌కు 151 సీట్లు రావడానికి కూడా ఆ పది శాతం ఓట్లు అధికంగా రావడమే కారణం కదా? ఈ ఎన్నికల్లో ఆ వ్యత్యాసం 16 శాతానికి పెరిగింది. అందుకే ఆయనకు 11 సీట్లు మాత్రమే వచ్చాయి. నిజమైన మంచి అంటే ఏమిటో గుర్తించడానికి అంగీకరించనంత కాలం వైసీపీకి భవిష్యత్తు ఉండదు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అధికారుల వద్ద జగన్మోహన్‌రెడ్డి చేసిన ఒక వ్యాఖ్య ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ఒకరోజు ముఖ్యమంత్రి కార్యాలయం అధికారి ధనుంజయరెడ్డి 'రేపు ఉన్నత విద్యపై సమీక్ష పెట్టుకుందామా?' అని కొంత మంది అధికారులు ఉన్నప్పుడు జగన్‌రెడ్డిని ఉద్దేశించి అడిగారు. 'ఏమిటీ? ఉన్నత విద్యపై సమీక్షా? ఆ సమీక్ష చేస్తే ఓట్లు వస్తాయా?' అని జగన్ ప్రశ్నించగా... 'రావు' అని ధనుంజయ రెడ్డి నసిగారు. వెంటనే జగన్ 'పోనీ నోట్లు (అంటే డబ్బులు) వస్తాయా?' అని ప్రశ్నించారు. దీంతో అవాక్కవడం అధికారుల వంతయింది. ఇలాంటి దిక్కుమాలిన ఆలోచనలు చేయడం వల్లనే ఈ ఎన్నికల్లో జగన్‌రెడ్డి చిత్తు చిత్తుగా ఓడిపోయారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదనుకుంటా!

కూటమిపై అందరి కళ్లు...

ఈ విషయం అలా ఉంచితే, చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కావస్తోంది. అత్యంత భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఎన్నో ఆశలు ఉన్నాయి. అదే సమయంలో అధికార పక్షం పోకడలపై కూడా ప్రజలు కన్నేసి ఉంచారు. కొద్ది రోజుల క్రితం జరిగిన రెండు సంఘటనలు కూటమి ప్రభుత్వానికి మచ్చ తెచ్చేవిగా ఉన్నాయి. రాయచోటిలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి భార్య ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ పట్ల అనుచితంగా ప్రవర్తించడం మొదటిది కాగా, తిరువూరు నియోజకవర్గంలో తెలుగుదేశం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు దగ్గరుండి మరీ ఒక భవనాన్ని కూల్చివేయించడం రెండవది. ఈ రెండు సంఘటనలు అధికార దుర్వినియోగానికి సంబంధించినవే. మంత్రి భార్య అయినంత మాత్రాన వారికి ప్రత్యేక సౌకర్యాలు, ప్రోటోకాల్ ఉండవు. అయినా మంత్రి రాంప్రసాద్ రెడ్డి భార్య అధికార దర్పం ప్రదర్శించే ప్రయత్నం చేసి విమర్శలపాలయ్యారు. ఈ సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి మంత్రిని మందలించారు. ఇక కొలికపూడి శ్రీనివాసరావు విషయానికి వస్తే, నిబంధనలకు విరుద్ధంగా ఎవరో భవనాన్ని నిర్మించారని చెప్పి ఆయన స్వయంగా దగ్గరుండి, అధికారులు వారించినా వినకుండా సదరు భవనాన్ని పడగొట్టించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మితమయ్యే భవనాలపై చర్యలు తీసుకోవాల్సింది అధికారులు మాత్రమే. మహా అయితే ఎమ్మెల్యే ఫిర్యాదు చేయవచ్చు. అంతేగానీ దగ్గరుండి మరీ కూలగొట్టించే అధికారం ఎమ్మెల్యేలకు ఉండదు. ఈ సంఘటనపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి శ్రీనివాసరావును పిలిపించుకొని మందలించారు. అయితే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు జాగ్రత్తగా మసలుకోవాలి. లేని పక్షంలో అట్టు తిరగేయడానికి ప్రజలు సిద్ధంగా ఉంటారు. జగన్మోహన్‌రెడ్డి హయాంలో రూల్ ఆఫ్ లా అమల్లో లేకుండా పోయిందని, అరాచకం ప్రబలిందని, నాయకులు అహంకారపూరితంగా వ్యవహరించారని నమ్మడం వల్లనే ప్రజలు ఎన్నికల్లో కూటమికి బ్రహ్మరథం పట్టారు. ఈ కారణంగా నాటి దుశ్చర్యలను ప్రజలు గుర్తుకు తెచ్చుకొనే పనులేవీ కూటమి నేతలు చేయకూడదు. అలా చేయడం వల్ల జగన్మోహన్‌రెడ్డికి రాజకీయంగా జీవం పోసినవారు అవుతారు. పిన్నెల్లి వంటి వారిని జైలులో పరామర్శించడం వల్ల జగన్‌కు రాజకీయంగా మైలేజీ రాదుగానీ, వైసీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు, దౌర్జన్యాలు జరిపితే మాత్రం ఆయనకు అవకాశం ఇచ్చినట్టే అవుతుంది. పాలన ఎలా ఉండకూడదో జగన్‌రెడ్డి అందరికీ తెలియజేశారు కనుక కూటమి నేతలు అధికార దర్పానికి, అధికార దుర్వినియోగానికి దూరంగా ఉండాలి. లేని పక్షంలో వారికే నష్టం!

> 1989కి ముందు ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీ రామారావు నేషనల్ ఫ్రంట్‌కు చైర్మన్‌గా వ్యవహరించారు. అప్పట్లో ప్రతిపక్షాలకు చెందిన హేమాహేమీ నాయకులైన దేవీలాల్, బిజూ పట్నాయక్, చంద్రశేఖర్‌వంటి వారు కూడా ఎన్టీఆర్‌తో కలసి నడిచారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వంతో విభేదించి బయటకు వచ్చిన విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ నేషనల్ ఫ్రంట్‌కు కన్వీనర్‌గా వ్యవహరించారు. 1989 ఎన్నికల్లో కేంద్రంలో వీపీ సింగ్ ప్రధానమంత్రిగా నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడింది. అనూహ్యంగా రాష్ట్రంలో ఎన్టీఆర్ అధికారం కోల్పోయారు. దీంతో జాతీయ స్థాయిలో ఎన్టీఆర్‌ను పట్టించుకున్నవారే లేకపోయారు. ఎన్టీఆర్‌ను ఉప ప్రధానిగా నియమించాలని తెలుగుదేశం పార్టీ ప్రతిపాదించగా నాటి ప్రధాని వీపీ సింగ్ ఖాతరు చేయలేదు. ఎన్నికల్లో ఓడిపోయిన వారిని ఉప ప్రధానిని చేయడం కుదరదని తేల్చి చెప్పారు. ఎన్టీఆర్‌కు ఎదురైన ఈ చేదు అనుభవం కేసీఆర్‌కు తెలియంది కాదు. జాతీయ రాజకీయాలలో దక్షిణాది వారి ఆధిపత్యాన్ని ఉత్తరాదివారు అంగీకరించరు.

కాకతీయులపై అపనింద!

> ప్రాంతేతర నవలాకారుడు ఒకరు సృష్టించిన కట్టుకథను నమ్మి మన చారిత్రక పురుషులను అవమానపరచుకోవడం సబబేనా? మేడారం దేవతలు కోయ గిరిజనుల వనదేవతలుగా భావించి, ఆ దేవతల మహాత్మ్యాన్ని కీర్తిస్తే వచ్చే నష్టం ఏమిటి? మా దేవతలకు ఎవరితో యుద్ధం జరగలేదని మొత్తుకునే గిరిజనుల నమ్మకాన్ని, వారి స్థల పురాణాలను గౌరవిస్తే వచ్చే నష్టం ఏమిటి? కాకతీయులకు గిరిజనులకు మధ్య యుద్ధం జరిగిందనేది కేవలం ఊహాగానమే అని తెలంగాణ శాసనాల పరిష్కర్త పివి పరబ్రహ్మశాస్త్రి స్పష్టంగా చెప్పారు.





వాస్తవం మనసుకి ఎక్కడానికి చాలా సమయం పడుతుంది. కానీ మిథ్యలు, అపోహలు త్వరగా ఆకర్షిస్తాయి. వాస్తవం కన్నా అపోహల మీదే ఎక్కువ మక్కువ ఉంటుంది! ఎందుకంటే వదంతులకు ఉన్నంత ప్రచారం వాస్తవానికి ఉండదు. ఇక్కడ వాస్తవం ఏమంటే గిరిజనులకు కాకతీయులకు మధ్య ఎలాంటి యుద్ధం జరగలేదని, సమ్మక్క సారక్కలు గిరిజన దేవతలు అన్నది. ఇద్దరు ప్రాంతేతరులు లేవదీసిన వదంతికి శాస్త్రీయ ఆధారాలు వెతకకుండా వదంతిని నిజమే అని నమ్మడం వల్ల గిరిజనుల మనోభావాలు దెబ్బతిన్నాయి...! మరోవైపు కాకతీయుల కీర్తికి భంగం కలిగింది. ఈ విషయంలో మనం తెలుగు విశ్వవిద్యాలయం గిరిజన విజ్ఞాన పీఠం వరంగల్ వారు ప్రచురించిన 'మేడారం జాతర' పుస్తకాన్ని రెఫరెన్స్‌గా తీసుకుందాం. అందులో స్పష్టంగా ఉంది పూర్వకాలం నుండి మేడారం గద్దెల వద్ద వంశ పారంపర్య పూజారులుగా కొనసాగుతున్న సిద్ధబోయిన, కాక వంశస్థులైన గిరిజన పూజారులను యుద్ధం గురించి ప్రశ్నిస్తే చాలు సమ్మక్క సారలమ్మలకు ఎవరితోని యుద్ధం జరగలేదు, వారు మా పుట్టు దేవతలు అని చెప్పడమే కాదు సమ్మక్క తమ పూర్వీకులకు పసిపాపగా వనంలో దొరికిన దేవతగా చెప్తారు! పైగా గిరిజనులలో చందా, డోలి, కొర్రాజు వంశీయుల కథనాలు కూడా సమ్మక్క, సారలమ్మలు పుట్టు దేవతలనే కథనాలను వినిపిస్తారు అంతే తప్ప తమ దేవతలు యుద్ధంలో చనిపోయారనే కథనాన్ని మాత్రం వారు అంగీకరించరు. అలా ఎవరైనా ప్రశ్నిస్తే వాళ్లను తమ సంస్కృతీ సంప్రదాయాన్ని హేళనపరుస్తున్న వ్యక్తులుగా భావిస్తారు! అని స్పష్టంగా పేర్కొన్నారు.

మొట్టమొదట 1996లో సీమాంధ్ర నవలాకారుడైన ముదిగొండ శివప్రసాద్ తన 'చంద్రకళ' అనే నవలలో కాకతీయులకు గిరిజనులకు యుద్ధం జరిగిందని కట్టు కథ అల్లాడు. అది నిజమని నమ్మి అదే సంవత్సరం జాతర నిర్వాహకులైన అధికారుల ప్రోత్సాహంతో కొల్లి నరసయ్య అనే వ్యక్తి ఒక పుస్తకం ప్రచురించగా, 2000 సంవత్సరంలో గుంటూరు జిల్లాకు చెందిన చిన్న వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తన పుస్తకం ద్వారా అదే కట్టు కథను బహుళ ప్రచారం చేశాడు! (సమ్మక్క సారలమ్మల జాతరను గిరిజన విశ్వాసాలకు విరుద్ధంగా కమర్షియలైజేషన్ చేయడంలో ఒక ఆకర్షణీయ కథనంగా ఈ యుద్ధ కథనం ఉపయోగపడి ఉండవచ్చు).

ఇక చరిత్రలోకి వెళితే కోయ రాజ్యం నిజంగానే ఉంది అనుకున్నప్పుడు ఆ రాజ్యానికి ఒక రాజధాని ఉండాలి. అల్లబడిన కథనం ప్రకారం అది మేడారం గ్రామమై ఉండాలి, కానీ యుద్ధం జరిగిందని చెప్పబడుతున్న ఈ ప్రాంతం ఒక దట్టమైన అరణ్య ప్రాంతం. గిరిజన రాజులు ఒకవేళ ఉండి ఉంటే రక్షణ కోసం మేడారంలో గానీ, దాని చుట్టుపక్కల గాని, కట్టుకున్న కోటలు గాని, శత్రువుని అడ్డుకునే రక్షణ పరమైన నిర్మాణాలు కానీ కనిపించవు. మేడారంలో ఒకవేల కోటలాంటి కట్టడం ఒకటి ఉండి ఉంటే దాన్ని శిథిలాలైనా నేటికీ మనకు అక్కడ రేఖా మాత్రంగానైనా కనిపించాలి.. పైగా సమ్మక్క, సారక్క పగిడిద్ద రాజు గోవిందరాజుల పేర్లు మనకు చరిత్రలో ఎక్కడ కనిపించవు. కాకతీయులు ఎవరితో యుద్ధం చేసినా దానిని శాసనబద్ధం చేశారు కానీ కోయ రాజులతో యుద్ధం చేసిన విషయం కలికానికి కూడా ఆగుపడదు.

కొంతమంది పోలవాస రాజును పగిడిద్దరాజుగా ఆయన కొడుకు జగ్గదేవుని జంపన్నగా చూపబోయారు. అయితే చరిత్రలో పోలవాస మేడరాజు మంథని గుండ రాజులు ఇద్దరితో కాకతియ రుద్రదేవునికి జరిగిందని చెప్పబడుతున్న యుద్ధం నేటి కరీంనగర్ వద్ద గల నగునూరులో జరిగింది. పైగా ఈ యుద్ధ విజేత కాకతీయ రుద్రదేవుడు, ఆయన మంత్రి గంగాధరుడు. అంతేకానీ ప్రతాపరుద్రునికి ఆ యుద్ధంతో ఎలాంటి సంబంధం లేదు. రుద్రదేవుడు 1158 నాటి వాడైతే ప్రతాపరుద్రుడు 1323 ప్రాంతం నాటివాడు. అంటే వీరిద్దరి మధ్య 200 సంవత్సరాల తేడా ఉంది. ఇక జగిత్యాల ప్రాంతాన్ని ఏలిన పోలవాసరాజు గిరిజనుడు కాదు. అలా అని చెప్పడానికి వారు వేయించిన 1122 నాటి గోవిందాపుర శాసనములోనూ, బానాజీపేట శాసనాల్లోనూ తాము జైన మతస్థులమని పేర్కొన్నారు. పైగా తమ వంశకర్త మాధవ వర్మ అని పేర్కొన్నారు. ఈ మాధవవర్మను క్షత్రియ రాజులు తమ వంశ మూలకర్తగా పేర్కొంటారు. ఈ మాధవవర్మ ఒకప్పుడు తెలంగాణను పరిపాలించిన విష్ణుకుండిన వంశస్థుడు. వీళ్ళు ఏ శాసనాలలోను తాము గిరిజనులమని కానీ, కోయవారమని గాని పేర్కొనలేదు. గిరిజనులవి ప్రాచీన ఆచారాలు. వారి పూజా విధానం విగ్రహారాధనకు వ్యతిరేకం. వాళ్ళు వనదేవతలను పూజిస్తారు.

1984నాటి సమ్మక్క గద్దె ఫోటో చూస్తే నమిలినార చెట్టును సమ్మక్కగా పూజించడం కనిపిస్తుంది. (ప్రస్తుతం ఆ చెట్టు లేదు). ఆ చెట్టును ఆవహించే దేవతను సమ్మక్కను కుంకుమ రూపంలో చిలకల గట్టునుండి తీసుకొని వస్తారు. వీటిని బట్టి వారి ఆదిమాచారాలు గమనించవచ్చు. కానీ ఇక్కడ పోలవాసరాజులు పూర్తిగా విగ్రహారాధకులు... ఇక పశ్చిమ చాళుక్యులకు ఈ పోలవాస రాజులు కాకతీయులు ఇద్దరు సామంతులుగా కొనసాగారు. వీరి రెండు రాజ్యాలు పక్కపక్కనే ఉండటం వల్ల మొదట్లో ఇరు రాజ్యాల మధ్య మిత్రత్వం ఉన్నప్పటికీ వారిద్దరూ ఉమ్మడి ప్రభువైన చాళుక్యుల పట్ల విధేయత విషయంలో ఒకరికొకరు కాలక్రమంలో శత్రువులుగా మారారు. కళ్యాణి చాళుక్యులు బలహీనపడిన సందర్భంగా రుద్రదేవుడు స్వతంత్రుడై కాకతీయ ప్రథమ సార్వభౌమ పాలకుడిగా అవతరిస్తాడు. ఇది సహించని చాళుక్య వంశ వారసుడైన కాలచూరి బిజ్జలుడు తన కుమారుడైన మైళగికి సైన్యాన్ని ఇచ్చి రుద్రదేవుని అణిచివేసే పని అప్పగిస్తాడు... ఈ మైళగి రుద్రదేవునిపై శత్రుత్వం గల నగునూరు ప్రభువైన దొమ్మరాజును పోలవాస ప్రభువైన రెండవ మేడ రాజును, అతడి కొడుకైన జగ్గ దేవునితో పాటు అందరిని చేరదీస్తాడు. కాకతీయ రాజ్యం పైకి దండయాత్రకు మంచి అవకాశంగా భావించిన వీరంతా సంతోషంగా మైళగి పక్షం చేరుతారు. చివరికి వీరంతా కుట్రలో భాగస్వాములై 1157 లేదా 58 ప్రాంతాల మధ్య రుద్రదేవునితో యుద్ధానికి దిగుతారు.

హనుమకొండ వేయి స్తంభాల గుడి శాసనం ప్రకారం ఈ యుద్ధంలో రుద్రదేవుడు విజేతగా నిలుస్తాడు. దొమ్మరాజు జగ్గదేవుడు యుద్ధంలో మరణించగా మేడరాజు అదిలాబాద్ జిల్లాలోని జన్నారం అడవుల్లోకి పారిపోతాడు... తన కూతుర్ని రుద్ర దేవుడికి ఇచ్చి వివాహం చేసి శాంతి నెలకొల్పుకోమని మేడరాజుకు అతని స్నేహితులు ఎంత చెప్పినా వినకుండా రుద్రదేవుడితో శత్రుత్వం వహించి ఎప్పటికైనా గెలువగలమని అహంకారంతో అడవులకు పారిపోయాడు. ఇదే విషయం హనుమకొండ శాసనంలో ఈ విధంగా ఉంది 'అనిర్వాన్ కన్యకాం దాతుం యసె□మేడనృపోధధవ్ విభూతించాభిమానంచ కీర్తించకుల సంచితాం' అని పేర్కొనబడింది. ఇదే విషయాన్ని వక్రీకరించి మేడరాజు కూతురు పేరు సారక్క అని ఆమెను ఇచ్చి పెళ్లి చేయకపోయేసరికి మొదటి ప్రతాపరుద్రుడు మేడరాజుతో యుద్ధం చేశాడని చెప్పడం ఏమీ న్యాయం?

'మా సమ్మక్క సారక్క జంపన్న పుట్టు దేవతలు వారికి ఎవరితో యుద్ధం జరగలేదని' మొత్తుకునే వడ్డెలు (జాతరలో సమ్మక్క సారక్క పూజారులు) వారి నమ్మకాలకు విలువివ్వనక్కర్లేదా? జాతరకు వచ్చే అశేష జనవాహిని సమ్మక్క సారలమ్మలు తమ కోరికలు తీర్చే దేవతలుగా తలచి వస్తున్నారు. గాని వారు వీరవనితలు, అప్పుడెప్పుడో మధ్య యుగాల్లో యుద్ధం చేశారని అబ్బురపడుతూ వస్తున్నారా? కాకతీయుల సంక్షేమ పాలన ధర్మనిరతి త్యాగం లాంటి సుగుణాలు చెప్పడానికిది సందర్భంగాదు. పాలకుల మనసు మంచిదైతే ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చని ప్రజలకు మేలు చేయవచ్చని లోకానికి చాటిన ప్రగతిశీలురు కాకతీయులు. కమర్షియలైజేషన్ కోసం సృష్టించిన కట్టుకథను నమ్మి మన చారిత్రక పురుషులను అవమానపరచుకుంటూ మన వేలుతో మనకన్నే పొడుచుకునేలా చేసిన వారి కుట్రలను విజయవంతం చేద్దామా లేక మేడారం దేవతలు కోయ గిరిజనుల వనదేవతలుగా భావించి వారి విశ్వాసాన్ని గౌరవిస్తూ ఆ దేవతల మహాత్మ్యాన్ని కీర్తిస్తే వచ్చే నష్టం ఏమిటి? మా దేవతలకు ఎవరితో యుద్ధం జరగలేదని మొత్తుకునే గిరిజనులను, వారి నమ్మకాన్ని వారి స్థల పురాణాలను గౌరవిస్తే వచ్చే నష్టం ఏమిటి? కాకతీయులకు కోయ గిరిజనుల మధ్య యుద్ధం జరిగిందని శాసన రహిత పిడివాదం చేయకపోతే వచ్చే ముప్పు ఏమిటి? ప్రాతఃస్మరణీయులు తెలంగాణ శాసనాల పరిష్కర్త కీ.శే. పివి పరబ్రహ్మశాస్త్రి గారిని ఈ విషయమై సంప్రదించినప్పుడు కాకతీయులకు గిరిజనులకు మధ్య యుద్ధం జరిగిందనేది కేవలం ఊహాగానమే అని స్పష్టంగా చెప్పారు..

కాకతీయ కళాతోరణం అనేది నాటి సుసంపన్నతకు, సుపరిపాలనకు, ప్రజల అభీష్టానికి ప్రతీక. దాన్ని చెరిపివేయడం అంటే ప్రజల కొన్ని వేలఏళ్ల చరిత్రను కాలరాయడమే. కాబట్టి తెలంగాణ రాష్ట్ర రాజముద్రలో కాకతీయ కళాతోరణం ఉండాల్సిందే!

■ డా. అంబటి శ్రీనివాస్‌రాజు
'మన కాకతీయులు' గ్రంథకర్త

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.1 కనిష్ఠం 23.8

టీడీపీ నుంచి చేరి మంత్రులు కాలేదా..?

గతంలో టీడీపీ నుంచి టీఆర్‌ఎస్‌లో చేరిన వారు మంత్రులు అయ్యారు. వారు రాజీనామా చేశారా..? రాజకీయ అంశాలను సమావేశంలో ప్రస్తావిస్తూ సమస్యలపై చర్చ జరగకుండా చేశారు. బీఆర్‌ఎస్, బీజేపీ సభ్యులు ఉద్దేశ్యపూర్వకంగానే సమావేశం నిర్వహణకు సహకరించలేదు.

- గద్వాల్ విజయలక్ష్మి, మేయర్





పరస్పరం తోసుకుంటున్న కార్పొరేటర్లు

కౌన్సిల్‌లో రసాభాస

తోపులాటలో చిరిగిన చొక్కాతో రాంనగర్ కార్పొరేటర్ రవిచారి

- బీజేపీ వర్సెస్ ఎంఐఎం
- తోపులాటలు, దూషణలు
- ప్లకార్డుపై అసదుద్దీన్ క్యారికేచర్ ఉండడంతో అభ్యంతరం
- పార్టీ ఫిరాయింపులపై బీఆర్‌ఎస్ నిరసన
- మేయర్, డిప్యూటీ మేయర్ రాజీనామాకు డిమాండ్
- పనులే చేయడం లేదని నినాదాలు
- మూడు గంటల్లో నాలుగుసార్లు వాయిదాపడిన కౌన్సిల్

చిరిగిన చొక్కాలు.. తెగిన చేతి గడియారాలు..!

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల అనంతరం శనివారం నిర్వహించిన జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం అర్థాంతరంగా ముగిసింది. మూడు గంటల సమయంలో నాలుగుసార్లు వాయిదా పడింది. వివిధ అంశాలపై సభ్యులు పట్టుమని గంట కూడా ప్రసంగించలేదు. మరణించిన సభ్యులకు సంతాపం, అధికారుల పరిచయం మినహా పెద్దగా చర్చ జరగలేదు. రాజకీయ అంశాలు.. నాయకులపై విమర్శలను సాకుగా చూపుతూ సభ్యులు పదే పదే మేయర్ పోడియం వద్దకు వెళ్లడంతోపాటు ఓ దశలో ఒకరిపైకి మరొకరు దూసుకెళ్లారు. ఈ క్రమంలో కొందరు కార్పొరేటర్ల చొక్కాలు చిరిగాయి.. చేతి గడియారాలు తెగిపడ్డాయి. నిరసన పేరిట కూర్చునే సీట్ల మీదకు ఎక్కి మరీ నినాదాలు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అధికార, ప్రతిపక్షం అన్న తేడా లేకుండా కౌన్సిల్‌లోని అన్ని పార్టీల సభ్యులూ అదే తీరుగా వ్యవహరించారు. కనీస చర్చ జరగని సమావేశంలో భోజనాలు, ఇతరత్రా ఏర్పాట్ల కోసం రూ.15 లక్షల ప్రజాధనం వృథా చేయడం గమనార్హం. గతంలో ఎన్నడూ లేని విధంగా ముగ్గురు మినహా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు సమావేశానికి హాజరయ్యారు. కాంగ్రెస్‌కు చెందిన ఓ ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పాల్గొన్నారు. బీజేపీ నుంచి ఎంపీ ఈటల రాజేందర్ వచ్చినా.. ఆ సమయంలో సమావేశం వాయిదా పడడంతో వెనుదిరిగారు.



బీజేపీ కార్పొరేటర్ల నిరసన

సమావేశం సాగిందిలా...

- ఉదయం 10.38 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి రాగానే.. కాంగ్రెస్

మిగతా 6వ పేజీలో..

వినూత్నంగా..

కౌన్సిల్ సమావేశానికి ముందు బీఆర్‌ఎస్, బీజేపీ కార్పొరేటర్లు ప్రధాన కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. మురుగు పొంగుతున్నా.. దోమల తీవ్రత పెరిగినా పట్టించుకోవడం లేదని డ్రైనేజీ పైపులు, గుర్రపు డెక్క మొక్కలతో నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ కార్పొరేటర్లు శ్రవణ్, ఆకుల శ్రీవాణి డ్రైనేజీ పైపులైన్లు ఎత్తుకొని బల్దియాకు వచ్చారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని.. పార్టీ మారిన మేయర్ రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు నిరసన తెలిపారు. పోడియం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్లనుద్దేశించి మేయర్.. మహిళలు మహిళల్లా ఉండాలన్నారు. దీనికి బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



బీజేపీ, ఎంఐఎంల మధ్య గొడవకు కారణమైన ప్లకార్డు ఇదే

కొత్త టీం.. సమర్థవంతంగా పనిచేస్తాం



జీహెచ్ఎంసీలో యువతతో కూడిన కొత్త టీం ఉంది. ఆదాయం పెంపు.. అభివృద్ధి పనులు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతాం. కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు చెల్లించేలా బ్యాంకులతో టై అప్ చేసే విషయాన్ని పరిశీలిస్తున్నాం. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం.

- ఆమ్రపాలి కాట, కమిషనర్

తండ్రిలా తనయ రాజీనామా చేయరా..?



కాంగ్రెస్‌లో చేరిన కే కేశవరావు.. బీఆర్‌ఎస్ ఇచ్చిన రాజ్యసభ పదవికి రాజీనామా చేశారు. ఇది స్వాగతించదగ్గ నిర్ణయం. మా పార్టీ నుంచి మేయర్‌గా ఎన్నికైన కేకే కూతురు విజయలక్ష్మి పదవికి ఎందుకు రాజీనామా చేయరు. నైతికత ఉంటే పార్టీ ద్వారా వచ్చిన పదవినీ వదులుకోవాలి. మ్యాన్‌హోల్ మూత ఏర్పాటుకూ అధికారులు నిధులు లేవనడం బాధాకరం.

-వివేక్, ఎమ్మెల్యే

రాజకీయాలకు వేదికగా మార్చారు



కౌన్సిల్‌లో గ్రేటర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ జరగాలి. అందుకు భిన్నంగా రాజకీయాలకు వేదికగా మార్చారు. ప్లకార్డుల ప్రదర్శన, పోడియం ముందు నిరసన సబబు కాదు.

- మాజిద్ హుస్సేన్, ఎమ్మెల్యే

సమస్యలపై చర్చించాలనుకున్నాం



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైంది. ఇప్పటి వరకు పైసా పని చేయలేదు. గతంలో మంజూరైన పనులనూ రద్దు చేశారు. ఈ విషయంపై కౌన్సిల్‌లో చర్చించి ప్రజా సమస్యలు పరిష్కరించాలనుకున్నాం. కానీ అధికార పార్టీకి ఆ ఉద్దేశం లేదు.

- సింధూఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్, బీఆర్‌ఎస్

ఫిరాయింపులే రాజకీయ అస్త్రంగా..



పార్టీ ఫిరాయింపులను రాజకీయ అస్త్రంగా బీఆర్‌ఎస్ వాడుకోవాలని చూసింది. తెలంగాణలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే వారు. హైదరాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

- దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్

పార్టీ మారారు.. పైసా నిధులు తేలేదు



అధికార పార్టీకి వెళ్లిన మేయర్, డిప్యూటీ మేయర్ నగర అభివృద్ధికి నిధులు తీసుకురావాలి. ఇప్పటి వరకు పైసా తీసుకురాలేదు. ఎంఐఎం, కాంగ్రెస్ ఒక్కటై ఈ రోజు మీటింగ్‌లో చర్చ జరగకుండా చేశాయి.

- కొప్పుల నరసింహారెడ్డి, బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్

నేడు జగదాంబిక అమ్మవారికి బంగారు బోనం

- 9 గంటలకు మహాకాళి ఆలయంలో పూజలు
- లంగర్‌హౌజ్ వద్ద స్వాగతం పలకనున్న మంత్రులు

చార్మినార్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని భాగ్యనగర్ మహాకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో భక్తులు నేడు గోల్కొండ జగదాంబిక అమ్మవారికి బోనాలను సమర్పించనున్నారు. నగరంలోని అమ్మవారి ఆలయాలతో పాటు విజయవాడలోని కనకదుర్గ అమ్మవారికి బోనాలను సమర్పించనున్నామని, మొదటి బంగారు బోనాన్ని గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సమర్పించనున్నామని కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పాత బస్తీ మీరాలంమండి మహాకాళి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బోనంతో అంగరంగ వైభవంగా గోల్కొండ కోటకు బయలుదేరుతామన్నారు. గోల్కొండ బోనాల ఉత్సవాల నిర్వాహకుల ఆధ్వర్యంలో లంగర్‌హౌజ్ వద్ద ఏర్పాటు చేసే స్వాగత వేదికపై నుంచి మంత్రులు తమకు స్వాగతం పలుకుతారని ఆయన తెలిపారు. పోతురాజుల నృత్యాలు, కళాకారుల కళా ప్రదర్శనలతో జోగిని నిషాక్రాంతి నైవేద్యపు బంగారు పాత్రను తలపై పెట్టుకుని చేతుల్లో హీరా గోలాలను పట్టుకుని గోల్కొండ జగదాంబిక అమ్మవారికి బోనం సమర్పిస్తారని తెలిపారు.



మీరాలంమండి మహాకాళి ఆలయంలో మహాభిషేకం పూజలో గాజుల అంజయ్య తదితరులు

బల్కంపేటకు 80 ప్రత్యేక బస్సులు 8

అఫిడవిట్‌లు తీసుకుంటూనే..

ఫ్యాకల్టీ ర్యాటిఫికేషన్ దరఖాస్తులు

- జేఎన్‌టీయూ అధికారుల తీరుపై ప్రైవేట్ యాజమాన్యాల విస్మయం

8

ఎప్‌సెట్ అభ్యర్థులు అప్‌సెట్..!

- కిటకిటలాడుతున్న హెల్ప్‌లైన్ సెంటర్లు
- కౌన్సెలింగ్ స్లాట్స్ దొరకక ఇతర జిల్లాలకు..
- అదనపు స్లాట్స్ ఇవ్వాలని అభ్యర్థుల డిమాండ్

8

మత్తు డాక్టర్ ఆత్మహత్య



వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా శనివారం నారాయణగూడ వెటర్నరీ ఆస్పత్రిలో పెంపుడు కుక్కకు వ్యాక్సిన్ వేయించేందుకు తీసుకొచ్చిన యువతి

మాదాపూర్‌లో 7.8 మి.మీ

- నగరంలో మోస్తరు వర్షం
- ఆదివారం గ్రేటర్‌కు ఎల్లో హెచ్చరికలు



సచివాలయం వద్ద వర్షంలోనే వెళ్తున్న వాహనదారుడు

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం 6.30 నుంచి 7 గంటల వరకు పలు ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మాదాపూర్‌లోని కావూరిహిల్స్ వద్ద అత్యధికంగా 7.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బోరబండలో 6.5, ఎంసీహెచ్ఆర్‌డీలో 6.3, ఫతేనగర్‌లో 5.5, బాలానగర్, యూసుఫ్‌గూడలో 5.3, మూసాపేటలో 4.8 మిల్లీమీటర్లు కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్‌పేట, ట్యాంక్‌బండ్, టోలిచౌకి, మెహిదీపట్నం, జేఎన్‌టీయూ మార్గాల్లో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

మరో రెండు రోజులు వర్ష సూచన

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో మరో రెండు రోజులు సాయంత్రం, రాత్రి సమయంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంటుందని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆదివారం గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఎల్లో హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసింది.

విద్యుత్ బిల్లు చెల్లింపు సులభం

అందుబాటులోకి టీఎస్ఎస్పీడీసీఎల్ యాప్

- సద్వినియోగంపై డిస్కం ప్రచారం
- 5 రోజుల్లోనే 1.92 లక్షల డౌన్‌లోడ్స్
- యాప్‌లో బిల్లు చెల్లించిన 2.5 లక్షల మంది

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీఎస్ఎస్పీడీసీఎల్) మొబైల్ యాప్ డౌన్‌లోడ్స్ చేసుకుంటున్న వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. ఇప్పటికే 1.92 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకోగా, శనివారం సాయంత్రం 4 గంటల వరకు 2.5 లక్షల మంది బిల్లు చెల్లించారు.

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నిర్ణయంతో జూలై 1 నుంచి గూగుల్‌పే/ఫోన్‌పే/పేటీఎం/అమెజాన్ పే ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో విద్యుత్ శాఖ టీఎస్ఎస్పీడీసీఎల్ యాప్‌లో సులభంగా బిల్లులు చెల్లించవచ్చంటూ ప్రచారం మొదలు పెట్టింది. వినియోగదారులు బిల్లు చెల్లింపుతో పాటు ఎలాంటి ఫిర్యాదులైనా యాప్‌లో చేయవచ్చంటూ విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆగస్టు నుంచి విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తెస్తామని ఇప్పటికే ప్రకటించిన విద్యుత్‌సంస్థలు.. జూలైలో ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లిస్తున్న వారికి సమస్యలు తలెత్తకుండా చర్యలు



మిగతా 6వ పేజీలో..

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత

- రూ.700 తిరిగి ఇవ్వలేదని ఒకరికి కత్తిపోటు

నగరంలో శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. మరోచోట అప్పుగా తీసుకున్న రూ.700 తిరిగి ఇవ్వలేదని స్నేహితుడిని కత్తితో పొడిచాడు. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

సైదాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ లక్ష్మీనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బత్తుల విష్ణువర్ధన్‌రెడ్డి(40) శుక్రవారం రాత్రి బైక్‌పై కర్మన్‌ఘాట్ నుంచి సైదాబాద్ వైపు వేగంగా వస్తున్నాడు. చంపాపేట ప్రధాన రహదారిపై ఓనస్ ఆస్పత్రి ఎదుట బైక్ అదుపు తప్పి డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. స్తంభం వంగిపోగా, విష్ణువర్ధన్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈయనకు తల్లిదండ్రులతో పాటు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



గుర్తు తెలియని మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధి కొత్తగూడెం చౌరస్తాలో శనివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి(40) హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని దాటుతున్నాడు. అదే సమయంలో చౌటుప్పల్ నుంచి హైదరాబాద్ వైపునకు వస్తున్న గుర్తు తెలియని వాహనం అతడిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో

మిగతా 6వ పేజీలో..

విదేశీ ఉద్యోగాల పేరుతో కన్సల్టెన్సీల మోసం

సోషల్ మీడియా రివ్యూలు నమ్మి మోసపోవద్దు: ఎస్ఐటీ డీసీపీ

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలు, వీసాల పేరుతో కన్సల్టెన్సీలు సోషల్‌మీడియాలో చేస్తున్న పోస్టింగ్‌లు, రేటింగ్‌లను నమ్మి మోసపోవద్దని, క్రైం, ఎస్ఐటీ డీసీపీ తెలిపారు. ఆయా కన్సల్టెన్సీ కార్యాలయాలను చూసి, పరిశీలించిన తర్వాతే ముందడుగు వేయాలన్నారు. యూకే, మాల్టా, కెనడాల్లో జాబ్ వీసాలు ఇప్పిస్తామని సుమారు 100 మంది నుంచి రూ.7.6కోట్లు వసూలు చేసిన రియాన్ వీసా అండ్ ఇమ్మిగ్రేషన్ లిమిటెడ్ నిర్వాహకుడు మాదాస్ కుమార్‌తోపాటు ఉద్యోగులను ఇటీవల సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలో ఇదే విధంగా మోసాలు చేస్తున్న పలు కన్సల్టెన్సీలు ఉన్నాయని వాటితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే మోసాలకు పాల్పడుతున్న సోమాజిగూడలోని హెక్సస్ మైగ్రేషన్ కన్సల్టెన్సీ నిర్వాహకులు జపాల శశాంక్, హిమాయత్‌నగర్‌లోని అనగా కెరీర్ సొల్యూషన్స్ నిర్వాహకులు ముమ్మర్తి ప్రశాంత్‌శర్మ, రే సెవెన్ ఎడ్యుకేషన్ అండ్ ఇమ్మిగ్రేషన్ నిర్వాహకుడు రూపేస్ కుమార్ కుడుముల, హోప్‌స్టోన్ కెరీర్ కన్సల్టెన్సీ నిర్వాహకుడు ముత్యాల సందీప్‌రెడ్డి, ఎస్ఆర్ఎన్ గ్లోబల్ వీసా హెల్ప్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకుడు మద్దలి తిరుమల ఫణీంద్రకుమార్‌లపై కేసులు నమోదు చేశామని తెలిపారు. వీసా కోసం ప్రయత్నించే అభ్యర్థులు ఆయా సంస్థలపై ఉన్న కేసుల గురించి తెలుసుకోవాలని సూచించారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లయన్స్‌క్లబ్ గ్రీన్‌ల్యాండ్స్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. రాణిగంజ్ గుజరాతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాలో 2,600మంది ఉద్యోగార్థులు పాల్గొన్నారని, వారిలో 2,450 మందిని ఎంపికయ్యారని, కొందరికి ఆఫర్ లెటర్‌లు అందించామని పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ సందీప్ హరి తెలిపారు. హెచ్ఆర్ కో, నిపుణ ఎన్‌జీఓల సహకారంతో నిర్వహించిన ఈమెగా జాబ్‌మేళాలో టెక్ మహీంద్రా, అమర్‌రాజా, అపోలో, జియో, ఫ్లిప్ కార్ట్ వంటి 75సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ జాబ్‌మేళాలో రామ్‌కీ గ్రూపుల డైరెక్టర్ పీజీ. శాస్త్రి, రామ్‌కీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఎం. రామిరెడ్డి, లయన్స్‌క్లబ్ గ్రీన్‌లాండ్స్ లక్ష్మీకుమారి, అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ డీసీపీ మధుకర్ స్వామితో పాటు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.


అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేస్తున్న అధికారులు

హాకీ తెలంగాణ బాలురు, బాలికల జట్టు ఎంపిక


ఎంపికైన బాలికల జట్టు

గచ్చిబౌలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ఆర్ కడపజిల్లా పులివెందులలో 10నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే సౌత్‌జోన్ హాకీ టోర్నమెంట్‌కు తెలంగాణ హాకీజట్టు ఫైనల్ అయినట్లు రాష్ట్ర హాకీ అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం గచ్చిబౌలి స్టేడియంలో క్రీడాకారులకు కిట్‌లను క్రీడా అసోసియేషన్ తరుపున అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ హాకీ సెక్రటరీ భీమ్‌సింగ్, హైదరాబాద్, రంగారెడ్డి సెక్రటరీలు వేణు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్‌లో రసాభాస

(5వ పేజీ తరువాయి)

కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్ మాట్లాడే ప్రయత్నం చేశారు. దీంతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్ పోడియం వద్దకు వెళ్లారు. అదే సమయంలో కాంగ్రెస్ సభ్యులు పోడియం వద్దకు వచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యులు పోటాపోటీగా నినాదాలు చేశారు. బీజేపీ కార్పొరేటర్లూ అక్కడకు రావడంతో గందరగోళం నెలకొంది. దీంతో సమావేశాన్ని 15నిమిషాలు వాయిదా వేశారు. తర్వాత మీటింగ్ మొదలు కాగా.. మేయర్ అభివృద్ధిపై మాట్లాడుతుండగా బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. బీజేపీ సభ్యుడు శంకర్‌యాదవ్ కూడా మీకు అభివృద్ధి చేయడం చేతకాక పార్టీ మారారని విమర్శించారు. మీకు బాగానే చేతనవుతుందని మేయర్ సమాధానమిచ్చారు. ఈ క్రమంలో బీజేపీ, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది.

- తన ప్రసంగం నిలిపివేసిన మేయర్ మాజీ రాజ్యసభ సభ్యుడు డి. శ్రీనివాస్, ఎమ్మెల్యే లాస్యనందిత, ఎర్రగడ్డ కార్పొరేటర్ షాహీన్‌బేగం మరణం పట్ల సంతాపం తెలపాలని సూచించారు. ఒక్కో పార్టీ నుంచి ఇద్దరు, ముగ్గురు సభ్యులు మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. అనంతరం మౌనం పాటించి కౌన్సిల్ సంతాపం తెలిపింది.
- కొత్తగా వచ్చిన కమిషనర్ ఆమ్రపాలి, ఇతర అధికారుల పరిచయ కార్యక్రమం జరిగింది. అనంతరం బీఆర్ఎస్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు మంజూరు చేసిన పనులను రద్దు చేయడం సబబు కాదని, ఇది అందరు సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యని పేర్కొన్నారు. తమ సర్కిల్‌లోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్‌కుమార్ వద్దకు వెళితే.. మంత్రి పొన్నం ప్రభాకర్ లెటర్ ఇచ్చిన పనులు మాత్రమే చేస్తామని చెప్పారని, ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు.
- ప్రశ్నోత్తరాలపై చర్చ మొదలుపెట్టాలని మేయర్ భావించగా.. వర్షాకాలం సమస్యలపై చర్చించాలని బీజేపీ, బీఆర్ఎస్ కార్పొరేటర్లు పోడియం వద్దకు వెళ్లారు. దీంతో మరోసారి ఐదు నిమిషాలు సమావేశం వాయిదా పడింది.

తోపులాట.. ఉద్రిక్తత..

సమావేశం వాయిదా పడిన సమయంలో బీజేపీ, ఎంఐఎం మధ్య తీవ్ర వాగ్వాదం నడిచింది. మొదటి సారి సభ వాయిదాపడిన సమయంలో మేయర్ పోడియం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తోన్న బీజేపీ సభ్యుల వద్దకు ఎంఐఎం కార్పొరేటర్లు వెళ్లారు. 'కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం దోస్తీ.. సమస్యలతో ప్రజల కుస్తీ..' అంటూ రేవంత్‌రెడ్డి, కేసీఆర్, అసదుద్దీన్ క్యారికేచర్లతో ఉన్న ప్లకార్డును ప్రదర్శించడంపై ఎంఐఎం కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. ప్లకార్డులను లాక్కునే ప్రయత్నం చేయగా ఇరు పార్టీల సభ్యుల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. ఓ దశలో ఒకరిపై ఒకరు దాడి చేసుకునేందుకు దూసుకెళ్లారు. కౌన్సిల్‌లోకి వచ్చిన మార్షల్స్ వాగ్వాదం పెరగకుండా నిలువరించే ప్రయత్నం చేశారు. మార్షల్స్‌నూ సభ్యులు తోసివేశారు. ఇతర సభ్యులు సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. మరోసారి సమావేశం వాయిదా పడిన సమయంలో అదే పరిస్థితి. బీజేపీ కార్పొరేటర్ల చేతుల్లో ఉన్న ప్లకార్డులను ఎంఐఎం సభ్యులు లాక్కొని చించేశారు. ఈ క్రమంలో బీజేపీ సభ్యుల వైపు దూసుకెళ్లారు. వాళ్లూ అదే స్థాయిలో ప్రతిఘటించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మహిళా సభ్యుల చేతుల్లో ఉన్న ప్లకార్డులను ఎంఐఎం కార్పొరేటర్లు లాక్కుని చించారు. ఇరు పార్టీల సభ్యులు కుర్చీలు ఎక్కి మరీ వాదులాడుకున్నారు. వివాదం జరిగిన రెండు సందర్భాల్లోనూ జై శ్రీరామ్.. అల్లా హో అక్బర్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.


సమావేశానికి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

అర్ధాంతరంగా ముగింపు..

బీజేపీ, ఎంఐఎం కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరుగుతోన్న సమయంలో కౌన్సిల్‌లోకి వచ్చిన మేయర్.. సభ్యులు తమ స్థానాల్లో కూర్చోవాలని సూచించారు. మేయర్ రాజీనామా చేయాలని పోడియం వద్ద బీఆర్ఎస్ కార్పొరేటర్ల నిరసన.. మరోవైపు బీజేపీ, ఎంఐఎం సభ్యుల గొడవ నేపథ్యంలో ఎజెండాలోని అన్ని అంశాలు ఆమోదం పొందాయని పేర్కొంటూ సమావేశాన్ని ముగిస్తున్నట్టు విజయలక్ష్మి ప్రకటించారు.

మేయర్, డిప్యూటీ మేయర్ రాజీనామా చేయాలని..

బీఆర్ఎస్ బీ-ఫారంపై గెలిచి పదవులు పొందిన మేయర్, డిప్యూటీ మేయర్‌లు రాజీనామా చేయాలని ఆ పార్టీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. పార్టీ వదులుకున్న వాళ్లు ఆ పార్టీ ఇచ్చిన పదవుల్లో కొనసాగడం ఏంటని ప్రశ్నించారు. దీంతో విజయలక్ష్మి, బీఆర్ఎస్ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. పార్టీ ఫిరాయింపుల గురించి మీరు మాట్లాడడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కౌన్సిల్‌లో సమస్యలపై చర్చిద్దాం.. రాజీనామాలపై బయట మాట్లాడుదాం.. కావాలనుకుంటే నా చాంబర్ ముందు ధర్నా చేయండి అని మేయర్ సూచించారు. అయినా, బీఆర్ఎస్ కార్పొరేటర్లు వినకపోవడంతో సమావేశం మరోసారి వాయిదా పడింది.

వాటర్‌బోర్డు ఎండీ రావాలని..

కౌన్సిల్ సమావేశానికి వాటర్‌బోర్డు డైరెక్టర్లు రావడంపై సభ్యులు అభ్యంతరం తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి రావాల్సిందే అని పట్టుబట్టారు. మేయర్ పోడియం వద్ద సభ్యులు గుమిగూడారు. వెంటనే అశోక్‌రెడ్డితో మాట్లాడిన ఆమ్రపాలి వైరల్ ఫీవర్ వల్ల రాలేదని సమాధానమిచ్చారు. అయినా సభ్యులు వినిపించుకోకపోవడంతో సమావేశం వాయిదా వేశారు.

బెంజ్ కారు దగ్ధం..

● ఎల్బీ స్టేడియంలో పరుగులు తీసిన జనం..


ఎల్బీ స్టేడియంఆవరణలో దగ్ధమవుతున్న కారు

ఖైరతాబాద్, జూలై6 (ఆంధ్రజ్యోతి): ఆగిపోయిన బెంజ్ కారును ప్రారంభించేందుకు ప్రయత్నిస్తుండగా మంటలు చెలరేగి దగ్ధమైన ఘటన ఎల్బీ స్టేడియం ఆవరణలో శనివారం జరిగింది. ఈ ఘటనతో అక్కడున్న వారు భయాందోళనలకు గురయ్యారు. సైఫాబాద్ పీఎస్ ఎస్ఐ సురేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తార్నాకకు చెందిన కిరణ్‌కుమార్‌కు చెందిన బెంజ్ కారు (ఏపీ 09 బీసీ 9333) శుక్రవారం రాత్రి ఎల్బీ స్టేడియం వద్ద స్టార్ట్ కాకపోవడంతో ఫతేమైదాన్ వద్ద పార్క్ చేసి వెళ్లిపోయాడు. శనివారం మధ్యాహ్నం మరో బ్యాటరీ సహాయంతో కారును ప్రారంభించేందుకు ప్రయత్నించగా.. బ్యాటరీ నుంచి నిప్పురవ్వలు ఎగిసిపడి కారుకు మంటలంటుకున్నాయి. క్షణాల్లోనే మంటలు పెద్దఎత్తున చెలరేగాయి. దీంతో యజమాని స్థానికుల సహాయంతో పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమయిందని ఎస్ఐ సురేష్‌రెడ్డి తెలిపారు. కారు పేలిపోతుందేమోనన్న అనుమానంతో అక్కడున్నవారు పరుగులు తీశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

నలుగురు మృత్యువాత

(5వ పేజీ తరువాయి)

అతడి నడుము భాగంపై నుంచి వాహనం వెళ్లడంతో పొట్ట, కాళ్లు పూర్తిగా ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు 5.2 అడుగులు ఉంటాడని, ఒంటిపై లేత ఆకుపచ్చ కలర్ చొక్కా, నలుపు కలర్ ప్యాంట్ ఉన్నదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు..

మదీన, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడకు చెందిన సయ్యద్ షబ్బీర్ అలీ(45) శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో తన బైక్‌పై వెళ్తున్నాడు. బండ్లగూడ ప్రధాన రహదారిపై హైవే హోటల్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ఆరాంఘర్ వైపు నుంచి మరో బైక్‌పై వస్తున్న మహ్మద్ హాజీ, ఆజం(47)లను ఢీకొట్టారు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ సయ్యద్ షబ్బీర్ అలీ, ఆజంలు మృతిచెందారు.

రూ.700 తిరిగి ఇవ్వలేదని కత్తిపోటు

చాంద్రాయణగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చేతి బదులుగా తీసుకున్న రూ.700 తిరిగి ఇవ్వలేదన్న కోపంతో స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన సంఘటన శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాలాపత్తర్‌కు చెందిన తాహెర్(22) వద్ద స్నేహితుడు షేక్ అలీం(24) రూ.700 అప్పుగా తీసుకున్నాడు. శనివారం మధ్యాహ్నం జహనుమాలోని బాయ్స్‌టౌన్ పాఠశాల సమీపంలో ఇద్దరు తారసడగా డబ్బుల విషయంలో గొడవ జరిగింది. ఆగ్రహానికి గురైన తాహెర్ కత్తితో అలీం కడుపులో పొడిచాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ బిల్లు చెల్లింపు సులభం

(5వ పేజీ తరువాయి)

తీసుకుంటున్నారు. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా డిస్కం యాప్‌లో బిల్లులు చెల్లించాలంటూ సూచిస్తున్నారు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

- గూగుల్ ప్లే స్టోర్ నుంచి టీఎస్ఎస్పీడీసీఎల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- యూనిక్ సర్వీస్ నంబర్ (యూఎస్‌సీ) నమోదు చేయాలి
- మొబైల్ నంబర్ టైప్ చేయగానే ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేసి, ఆ తర్వాత రిజిస్టర్ బటన్ మీద క్లిక్ చేయాలి.
- ఆటోమేటిక్‌గా పేరు, ఫోన్ నంబర్, ఇతర వివరాలు వస్తాయి.
- యాప్‌లో బిల్ పేమెంట్, బిల్ హిస్టరీ, ఇతర ఆన్‌లైన్ పేమెంట్స్ కూడా చేసుకునే సదుపాయం అందుబాటులో ఉంది.
- విద్యుత్ అంతరాయం, హెచ్చుతగ్గుదలు, మీటర్ కాలిపోవడం, బిల్లింగ్ సమస్యలు, కొత్త కనెక్షన్‌కు దరఖాస్తు, గ్రీన్ టారీఫ్, రూఫ్‌టాప్‌సోలార్, పేరు మార్పు, అడ్రస్ మార్పు/తప్పుల సవరణ, కేటగిరీ మార్పు, అదనపులోడ్ పెంపు, షిఫ్టింగ్ పనులు, టారీఫ్ వివరాలు, విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులు చేయవచ్చు. అధికారుల వివరాలను తెలుసుకోవచ్చు.

బిల్లు చెల్లింపునకు..

- యాప్‌లో 'పే యువర్ బిల్'పై క్లిక్ చేస్తే పేరు, యూఎస్సీ నంబర్, బిల్లు చూపిస్తుంది.
- వివరాలు సరిచూసుకుని, ఈ-మెయిల్ ఐడీ నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రొసీడ్ టూ పే బటన్ మీద క్లిక్ చేయాలి.
- పే విత్ టీ-వాలెట్, బిల్‌డెస్క్, పేమెంట్, పేటీఎం అనే ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిలో ఒకటి ఎంచుకోవాలి. బిల్ డెస్క్ పేమెంట్ ఎంచుకుంటే క్రెడిట్/డెబిట్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, వాలెట్, క్యూఆర్, యూపీఐ వంటి ఆప్షన్లు కనిపిస్తాయి. వాటితో బిల్లు చెల్లించవచ్చు.
- యూపీఐ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లిస్తే డిస్కం యాప్‌లోకి వస్తే పేమెంట్ పూర్తైనట్లు నోటిఫికేషన్ వస్తుంది. దాంతో బిల్ రిసిప్టును కూడా వినియోగదారులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



మొక్కకు నీరు పోస్తున్న వర్సిటీ డీన్ డాక్టర్ సత్యనారాయణ

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

రాజేంద్రనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరున ఒక మొక్క నాటుదాం) అంటూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం అధ్వర్యంలో శనివారం నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వర్సిటీ డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి.నరేందర్‌రెడ్డి, హెల్త్‌సెంటర్ వర్సిటీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు మొక్కలు నాటారు. వర్సిటీ డీన్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ సి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలను నాటడమే కాదు, పర్యావరణంలో మొక్కల ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరు తెలుసుకుని వాటిని సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.మాధవి, హెల్త్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ సి. పద్మవేణి తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న అనిల్‌కుమార్ తదితరులు

కుమ్మర్ల తొలి బోనం పండగను విజయవంతం చేయండి

కార్వాన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కుమ్మర్ల తొలి బోనం పండుగను విజయవంత చేయాలని తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాల ఉత్సవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లూరి అనిల్ కుమార్ కోరారు. తెలంగాణ కుమ్మర్ల సామాజిక సాంస్కృతిక ఆధ్యాత్మిక కళావైభవాన్ని చాటడంలో బోనాలు చారిత్ర ప్రధాన్యత సంతరించుకుందని అయన అన్నారు. సరూర్‌నగర్ తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్కాజ్‌గిరి కుమార్ నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఆషాఢమాసంలో జరుగుతున్న బోనాల ఉత్సవాల్లో ప్రతి గ్రామంలో, పట్టణంలో కుమ్మర్లు మొదటి బోనాన్ని అమ్మవారికి సమర్పించడం అనవాయితీగా వస్తుందన్నారు. గోల్కొండ బోనాలకు రాష్ట్ర నలుమూలల నుంచి కుమ్మర్లు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



భీంకార్ భజరంగ్

మదీన, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటికివెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండా పోయాడు. ఈ ఘటన హుసేనిఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం... ఘాన్సీబజార్‌లో నివాసముండే భీంకార్ భజరంగ్(76) ఫుట్‌పాత్‌పై దుస్తులు విక్రయిస్తుంటాడు. ఈనెల 1వ తేదీన ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయటికివెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు అప్పటి నుంచి ఆయన కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో శనివారం కుటుంబ సభ్యులు హుసేనిఆలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నవీన్ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 87126 60334, 87126 61284 ఫోన్ నంబర్లలో సమాచారం ఇవ్వాలన్నారు.

పనికోసం వెళ్లిన యువకుడు...



మల్లేశ్వరాస్వామి

పహాడిషరీఫ్ జూలై 6 (ఆంధ్రజ్యోతి): పనికోసం వెళ్లిన యువకుడు అదృశ్యం అయ్యాడు. ఈ ఘటన పహాడిషరీఫ్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జల్‌పల్లి ఎంబీనగర్‌కు చెందిన టీ దేవేంద్రప్రసాద్, నాగ వీరదుర్గ మల్లేశ్వరాస్వామి సోదరులు. ఈ నెల 2న వీరదుర్గ మల్లేశ్వరా స్వామి.. మంచుటౌన్‌షిప్‌లో పనికి వెళ్లి తిరిగి రాలేదు. మరుసటి రోజు సోదరుడుదేవేంద్రప్రసాద్ ఇంటికి వచ్చి చూడగా కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ వచ్చింది. అప్పటి నుంచి అతడి కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం దేవేంద్ర ప్రసాద్ పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

జీహెచ్ఎంసీ కార్మికుడి ఆత్మహత్య

చాంద్రాయణగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో జీహెచ్ఎంసీ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఛత్రినాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కందికల్ భట్టీనగర్‌కు చెందిన వినోద్(35) జీహెచ్ఎంసీలో కార్మికుడు. జీహెచ్ఎంసీ అధికారులు మూడు నెలల నుంచి కొంతమంది సిబ్బందిని డీఆర్ఎఫ్ ఎలోకి పంపించారు. దూరప్రాంతాలకు వెళ్లలేక, ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం రాత్రి ఇంట్లోని దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అధికారుల కక్షసాధింపు చర్యల కారణంగానే వినోద్ ఆత్మహత్య చేసుకున్నాడని తోటి కార్మికులు ఆరోపిస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు..

గోషామహల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులో చుడీ బజార్ మహిళ, ఎంజీబీఎస్ బస్ స్టేషన్ విషం తాగి మరో మహిళ అత్మహత్య చేసుకున్నారు.

బేగంబజార్ చుడీబజార్‌కు చెందిన భాగవతన్ భార్య ఉమాబాయి (47) కొంతకాలంగా చీరల వ్యాపారం నిర్వహిస్తుంది. వ్యాపారంలో నష్టాలు రావడంతో తీవ్ర ఆర్థికభారంతో సతమతమవుతూ జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతిరాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని షాహినాథ్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.చౌహాన్ తెలిపారు.

విషం తాగిన మహిళ...

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరుకుమారం గ్రామానికి చెందిన వీరయ్య కూమార్తె శైలజ(43) అక్కడే ఓ చర్చిలో పనిచేస్తుంది. ఉపాధి కోసం నగరానికి వచ్చిన శైలజా శనివారం తెల్లవారుజామున విషం తాగి బస్‌స్టేషన్‌లో అపస్మారకస్థితిలో పడిపోయింది. గమనించిన స్టేషన్ సిబ్బంది అఫ్జల్‌గంజ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మహిళను ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్టు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని అఫ్జల్‌గంగ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న అఫ్జల్‌గంజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్వహణ లోపం.. పార్కుకు శాపం

- పేరుకుపోయిన చెత్తకుప్పలు
- ఓపెన్ జిమ్ నిరుపయోగం

వీధి కుక్కల స్వైరవిహారం



పార్కులో సంచరిస్తున్న వీధి కుక్కలు



తుప్పుపట్టిన పనికిరాకుండా మారిన పరికరాలు



ఓపెన్ జిమ్‌లో విరిగిన పరికరం



విరిగిపోయిన ఆట పరికరాలు



అఫ్జల్‌గంజ్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయల నిధులతో నిర్మించిన ఇమ్లిబన్ పార్కు నిర్వహణ లేక అధ్వానంగా మారింది. పార్కులో చెత్తాచెదారం, మట్టిదిబ్బలు పేరుకుపోయాయి. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వందల సంఖ్యలో వాకర్లు ఇక్కడికి వస్తుంటారు. కొందరు ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేసి సేద తీరుతుంటారు. ఇక్కడికి వచ్చే వారు గుంతలుగా మారిన వాకింగ్ ట్రాక్‌పై సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో కిందపడి గాయాలకు గురైన సందర్భాలున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు పార్కు నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదు. గతంలో పార్కు పచ్చదనంతో నిండి ఉండేది. సేద తీరేందుకు గడ్డితో కూడిన పచ్చికబయళ్లు ఉండేవి. ప్రస్తుతం నిర్వహణ లోపం కారణంగా ఎక్కడికక్కడ ఎండిపోయాయి. ఒకసారి పార్కుకు వచ్చిన సందర్శకులు పార్కులోని దుస్థితి చూసి మరోసారి రావడం లేదు. ఉద్యానవనశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దీనికితోడు పార్కుకు ఆనుకొని ఉన్న చెత్త డంపింగ్‌యార్డ్ వల్ల భరించలేని దుర్వాసన వస్తోంది. వాకర్లు, సందర్శకులు ఇబ్బందులకు గురవుతున్నారు.

శిథిలావస్థకు చేరిన ఓపెన్ జిమ్

సందర్శకులు, వాకర్లు, చిన్న పిల్లలకు ఆట విడుపుగా ఉండేందుకు కోట్లాది రూపాలతో పార్కులో జిమ్‌ను ఏర్పాటుచేశారు. నిర్వహణ లోపం కారణంగా జిమ్ యంత్రాలు విరిగి శిథిలావస్థకు చేరాయి. రెండేళ్లుగా జిమ్ పనిచేయకున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోలేదు. దీంతో పార్కుకు వచ్చే సందర్శకుల సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. పార్కులో పదుల సంఖ్యలో వీధి కుక్కలు సంచరిస్తున్నా కట్టడి చేయడంలో సెక్యూరిటీ గార్డులు విఫలమవుతున్నారు. పార్కుకు వచ్చే వాకర్లు, సందర్శకులు భయాందోళనకు గురవుతున్నారు.

పార్కు నిర్వహణను పట్టించుకోండి



కోట్లాది రూపాయలతో నిర్మించిన పార్కు అధికారుల నిర్వహణ కొరవడటంతో అధ్వానంగా తయారైంది. దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి. పార్కులో వీధి కుక్కలను అరికట్టాలి. పార్కు నిర్వహణపై ఎమ్మెల్యే, ఎంపీలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

- వి.కిషన్‌యాదవ్, వాకర్ సామాజికవేత్త (గౌలిగూడ)

ఓపెన్ జిమ్‌కు మరమ్మతులు చేపట్టాలి



లక్షలాది రూపాయలు వెచ్చించి వాకర్ల కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలి. కొన్ని రోజులుగా పార్కును శుభ్రం చేయకపోవడంతో చెత్త, చెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది. వాకింగ్ ట్రాక్ దెబ్బతిని రెండేళ్లవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో వాకింగ్ వచ్చే వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. సమస్యను పరిష్కరించకపోతే వాకర్లతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం.

- సల్లా అశోక్ యాదవ్ (సీబీఎస్), వాకర్

పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ల పంపిణీ



పెంపుడు కుక్కకు యాంటీ రేబిస్ వాక్సిన్‌ను వేస్తున్న డాక్టర్లు

రాజేంద్రనగర్, జూలై6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జోనోసిస్ దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్ వెటర్నరీ కాంప్లెక్స్ ఆవరణలో పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమాన్ని పీవీ నర్సింహ్మారావు పశువైద్య విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ రఘునందన్, పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఉదయ్‌కుమార్‌తో కలసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వరల్డ్ జోనోసిస్ డే సందర్భంగా రాజేంద్రనగర్ పశు వైద్య కళాశాలకు చెందిన వెటర్నరీ హాస్పిటల్‌లో పెంపుడు జంతువులకు యాంటీ ఉచితంగా రేబిస్ వాక్సిన్ వేస్తున్నామని అన్నారు. శనివారం 150 పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేశామని తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ వెటర్నరీ క్లీనికల్ కాంప్లెక్స్ ప్రొ. రామచంద్రారెడ్డి, అసోసియేట్ ప్రొ. డాక్టర్ రాంసింగ్, ప్రొ. కె.సి.ఎస్ రెడ్డి, డాక్టర్ జయశ్రీ, డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ పావని స్పాన్సర్లు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన ఉండాలి: వెటర్నరీ డైరెక్టర్

గోషామహల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రేబిస్ వ్యాధిపట్ల ప్రజలకు అవగాహన ఉండాలని హైదరాబాద్ జిల్లా వెటర్నరీ, హస్బెండరీశాఖ డైరెక్టర్ బి.గోపి, పశు సంవర్థక అధికారి డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, నారాయణగూడ వెటర్నరీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం నారాయణగూడలోని వెటర్నరీ దవాఖానాలో పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పెంపుడు జంతువుల నుంచి 150 రకాల వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. రోజూ పెంపుడు జంతువులతో గడిపేవారు వ్యాక్సిన్ వేయించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ఇమ్యు నోలాజికల్ లిమిటెడ్ చీఫ్ మేనేజర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, డిప్యూటీ డైరెక్టర్ డా. మధుసూదన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/LVKwyN9లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

28న రాజేంద్రనగర్ సర్కిల్‌లో బోనాలు

రాజేంద్రనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్‌లో బోనాల ఉత్సవాలు నిర్వహించడానికి ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు మోంద్ర నర్సింహ్మ, బస్తీల పెద్దల సమక్షంలో ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బోనాల ఉత్సవాల నిర్వాహణ, ఏర్పాట్లపై వారు చర్చించారు. రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడలో ఈ నెల 28న బోనాల ఉత్సవాలు, ఘటాల ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహిస్తామని నర్సింహ్మ తెలిపారు. రాజేంద్రనగర్, బుద్వేల్, ప్రేమావతిపేట్, శివరాంపల్లి, అత్తాపూర్, మైలార్‌దేవుపల్లి ప్రాంతాలలోనూ ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆదర్శాలను నేటి యువత పాటించాలి



శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నటరాజ్ నాంధారి, సోమ్రాజ్ సింగ్ తదితరులు

గోషామహల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఏక్ పేడ్ అప్‌కీ మా కే నామ్ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. శనివారం జాంబాగ్ డివిజన్ బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బంగారు సుధీర్‌కుమార్, సీనియర్ నాయకులు గొడుగు శ్రీనివాస్‌యాదవ్, మయూర్ కాండ్లేకర్, రామకృష్ణ, రాధిక ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో మొక్కలను నాటి నీరు పోశారు. గోషామహల్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు నటరాజ్ నాంధారి, సోమ్రాజ్‌సింగ్, గుణవంత్‌రావు బిరాదర్, అనిల్‌సింగ్ ఆధ్వర్యంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జుమ్మెరాత్‌బజార్‌లోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేశ్ సింగ్, విపిన్ రామవత్, రాజా, అక్షయ్ సాహు, కిషన్, దీపక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చూపిన ఆదర్శాలను నేటి యువత పాటించాలన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

చాంద్రాయణగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని బీజేపీ శాలిబండ డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ సూర్యవంశీ ఆధ్వర్యంలో రాజన్నబావి వద్ద పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం శ్యామాప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కోటి ధర్మతేజ, వై.నరేశ్, ముఖేశ్, ఉదయ్ కిరణ్, లావణ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-సిగరెట్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

- **538 ఈ-సిగరెట్లు స్వాధీనం**

మదీన, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని నిషేధిత ఈ-సిగరెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని కాలాపత్తర్ పోలీసులు, యాంటీ నార్కోటిక్ బ్యూరో అధికారులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.8లక్షల విలువ చేసే ఈ-సిగరెట్ మిషన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీరాలం ట్యాంక్ ఖాజానగర్‌కు చెందిన మహ్మద్ ఖదీర్ కుమారుడు మహ్మద్ జాఫర్(25) రాపిడో బైక్ రైడర్. ఇతనికి షేక్‌పేటకు చెందిన అహ్మద్ పరిచయమయ్యాడు. వీరిద్దరు అధిక సంపాదన కోసం ఈ-సిగరెట్‌లను అమ్మాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన మైనర్ విద్యార్థులను ఎంపిక చేసుకుని వారిని సంప్రదించేవారు. వాట్సప్ నంబర్‌కు ఆర్డర్‌లను స్వీకరించి వారు చెప్పిన అడ్రస్‌కు వెళ్లి ఈ-సిగరెట్‌లను అందజేసి డబ్బులు తీసుకునేవారు. శనివారం యాంటీ నార్కోటిక్ బ్యూరో అధికారిక టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చిన సమాచారం మేరకు యాంటీ నార్కోటిక్, కాలాపత్తర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి సెల్‌ఫోన్‌లను తనిఖీ చేయగా నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులను నంబర్లను గుర్తించారు. నిందితుల నుంచి వివిధ ఫ్లేవర్‌లకు చెందిన 55 బాక్సులలో ఉన్న 538 ఈ-సిగరెట్ మిషన్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.8లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్

అఫ్జల్‌గంజ్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను సుల్తాన్ బజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఓ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారితో కలిసి ఏసీపీ శంకర్ వివరాలు వెల్లడించారు. ఉప్పల్ ప్రాంతానికి చెందిన అభిషేక్, మహేష్ పలు నేరాలకు పాల్పడి గతంలో జైలుకు వెళ్లి వచ్చారు. వారికి మేడిపల్లికి చెందిన తనిష్కతో పరిచయం కావడంతో... ముగ్గురూ గంజాయి తాగేవారు. ఈ నెల 3న ఆదిలాబాద్‌కు చెందిన అనిల్ ట్రీట్మెంట్ నిమిత్తం సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌కు వచ్చి తిరిగి ఆదిలాబాద్ వెళ్లేందుకు ఎంజీబీఎస్ వెళ్తుండగా... బైక్‌పై వచ్చిన ముగ్గురు రంగమహల్ వద్ద అనిల్‌ను అడ్డగించి సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన సుల్తాన్ బజార్ పోలీసులు సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. బైక్ నెంబర్ ఆధారంగా ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా, దొంగతనం చేసినట్లు వారు అంగీకరించారు. దొంగతనం చేసేందుకు తనిష్క.. అతని తండ్రి బైక్‌ను వాడినట్లు ఏసీపీ వెల్లడించారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం: వక్తలు

పంజాగుట్ట, జూలై 6(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, నాణ్యమైన విద్య ప్రభుత్వ లక్ష్యం కావాలని పలువురు వక్తలు అన్నారు. విద్యా సంక్షోభాన్ని సర్కార్ గుర్తించాలని, ఎక్కువ నిధులు కేటాయించి సంస్కరణలు తేవాలని, విద్యపై నిర్లక్ష్యంతో ఒక తరానికే అన్యాయం చేయకూడదని వారన్నారు. జవహర్ బాల్‌మంచ్(జేబీఎం)సంస్థ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న 'విద్యామిషన్' పై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సంస్థ ఛైర్మన్ మామిడి రిషికేశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ఓబీసీ సెల్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, క్రాంతి తదితరులు హాజరై మాట్లాడారు. ఆర్థికంగా ఎంత అభివృద్ధి సాధించినా విద్యావంతులైన మానవ వనరులు లేకపోతే అభివృద్ధి అసాధ్యమని అన్నారు. అత్యధిక యువత కలిగిన దేశాన్ని పటిష్ఠమైన దేశంగా మార్చాలంటే విద్యతోనే సాధ్యమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విద్యను పటిష్ఠం చేసే లక్ష్యంతో తీసుకొస్తున్న విద్యామిషన్‌కు ఇలాంటి సమావేశాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యారంగంపై లోతైన అధ్యయనం చేయడంతో పాటు ముఖ్యమంత్రి అధ్యక్షతన సమగ్ర సమీక్ష నిర్వహించాలని అన్నారు. విద్యా రంగానికి అధిక నిధులు కేటాయిస్తూ క్షేత్రస్థాయిలో అమలుపై దృష్టి సారించాలని సూచించారు.

'మంత్రివర్గంలో మున్నూరుకాపులకు చోటు కల్పించాలి'

పంజాగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోనే అత్యధిక జనాభా కలిగిన మున్నూరుకాపు సామాజిక వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ విజ్ఞప్తి చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణలో రెండు మంత్రి పదవులను తమ సామాజికవర్గానికి కేటాయించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, మున్నూరుకాపు కార్పొరేషనుకు రూ.2వేల కోట్లను కేటాయించాలని, కోకాపేటలో ఆత్మగౌరవ భవానికి మరో రూ.20కోట్లను మంజూరు చేయాలన్నారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకోటి రాజు, కార్యదర్శి వాసాల వెంకన్న, ఆర్వీ మహేందర్, గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షులు దేశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాకాళేశ్వరి మహాభిషేకం

చార్మినార్ జూలై 6 (ఆంధ్రజ్యోతి): మీరాలంమండి మహాకాళేశ్వర దేవాలయంలో శనివారం లోకకల్యాణార్థం.. మహాకాళేశ్వర పరివార సహిత మహాకాళేశ్వరి మహాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ అలంకార బ్రహ్మ ఆత్రేయాచార్యుల ఆధ్వర్యంలో ఈ మహాభిషేకం ప్రత్యేక పూజా కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పసుపు, కుంకుమలతో పాటు 108 రకాల సుగంధ ద్రవ్యాలు, పళ్ల రసాలతో అమ్మవారికి మహాభిషేకం ఘణంగా జరిగింది. అనంతరం అలంకరణ, హారతిలతో పాటు ప్రసాద వితరణ జరిగింది. నేటి మంచి ఈ నెల 26 వరకు రుద్ర సహిత త్రిశతచండీ మహాయాగం ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీ నుంచి 26వ తేదీ వరకు రుద్ర సహిత త్రిశతచండీ మహాయాగం పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని దేవాలయం కమిటీ ఛైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. 20 రోజుల పాటు దీక్షా పూర్వకంగా వేద పండితులతో పూజా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి దేవాలయంలో ధ్వజారోహణ చేయనున్నారన్నారు.

ఇద్దరు వ్యక్తుల అవయదానం

- **13 మందికి పునర్జన్మ**



సిరికొండు ప్రసాద్, టి.నర్సింగ్‌రావు

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తుల అవయవదానంతో పదమూడు మందికి పునర్జన్మ లభించింది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు వ్యక్తుల బ్రెయిన్ డెడ్ కావడంతో వారి నుంచి మూత్రపిండాలు, కాలేయం, గుండె, లంగ్స్, కార్నియా అవయవాలను సేకరించి అవసరమైన వారికి మార్పిడి చేశారు. వరంగల్‌కు చెందిన ల్యాబ్‌టెక్నీషియన్ సిరికొండ ప్రసాద్ (36) గతనెల 27న బైక్‌పై వెళుతుండగా కిందపడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా శుక్రవారం పరిస్థితి విషమించడంతో బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. కాగా, ఈస్ట్‌మారేడ్‌పల్లికి చెందిన టి.నర్సింగ్‌రావు (39) గతనెల 28న ద్విచక్రవాహనంపై నుంచి కింద పడ్డాడు. అతడిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తుండగా శుక్రవారం బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. ఇరువురి కుటుంబ సభ్యులకు జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్స్ అవగాహన కల్పించడంతో వారు అవయవదానానికి ముందుకు వచ్చారు. మృతిచెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి సేకరించిన అవయవాలను అవసరమైన 13 మంది బాధితులకు అమర్చారు.

చెత్తకుప్పలను తొలగించారు



గౌలిపురా పోలీస్ ఔట్‌పోస్ట్ ముందు పేరుకుపోయిన చెత్తను అధికారులు తొలగించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన సర్కిల్-9 ఏఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతి గౌలిపురాలో పర్యటించి పేరుకుపోయిన చెత్తను సిబ్బందితో తొలగింపజేశారు.

- చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



బషీర్‌బాగ్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ వి. హనుమంతరావు



ఆరాంఘర్ చౌరస్తాలో జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, దళిత సంఘాల నాయకులు

బర్కత్‌పుర/రాజేంద్రనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని, సంఘ సంస్కర్త, సామాజిక న్యాయ సాధనకు కృషి చేసిన మహోన్నతుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని పలువురు కొనియాడారు. జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతి సందర్భంగా బషీర్‌బాగ్‌లోని డాక్టర్ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం రంగురంగుల పూలతో అలంకరించారు. శనివారం మాజీ ఎంపీ వి. హనుమంతరావు, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, టీపీసీసీ కార్యదర్శులు శంభుల శ్రీకాంత్‌గౌడ్, అప్సర్, బాబు, యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి కోటం అనిల్ తదితరులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నిజాం కళాశాలలో జరిగిన వర్ధంతి వేడుకల్లో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. ఉపేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘం నాయకులు కుమార్, బీసీ సెల్ కో- ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వార్డెన్ మార్కండేయ, యాదగిరి పాల్గొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరాంఘర్ బాబుజగ్జీవన్‌రాం చౌరస్తాలో, బుద్వేల్ ఎక్స్‌టెన్షన్ చౌరస్తాలో, బాబుల్‌రెడ్డినగర్‌లో, భవానీకాలనీలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు, చిత్రపటాలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గోల్కొండ బోనాల సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు

● పార్కింగ్‌కు ఏర్పాట్లు

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ బోనాల సందర్భంగా గోల్కొండకు వెళ్లే దారుల్లో వాహనాలను అనుమతించబోమని, భక్తులు కేటాయించిన ప్రదేశాల్లోనే పార్కింగ్ చేసుకోవాలని అడిషనల్ సీపీ పి.విశ్వప్రసాద్ తెలిపారు. బోనాలకు నగరంతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వచ్చే అవకాశమున్నందున గోల్కొండకు వచ్చే రోడ్లలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు వాహనాల రాకపోకలపై నిషేధం ఉంటుందన్నారు. గోల్కొండ కోటలో అమ్మవారికి ఈనెల 7న మొదటి పూజ, 11న రెండో పూజ, 14న మూడో పూజ, 18న నాలుగో పూజ, 21న ఐదో పూజ, 25న ఆరో పూజ, 28న ఏడో పూజ, ఆగస్టు 1న ఎనిమిదో పూజ, ఆగస్టు 4న తొమ్మిదో పూజ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా రామ్‌దేవ్‌గూడ నుంచి గోల్కొండకు వెళ్లే మక్కీదర్వాజ, లంగర్‌హౌజ్ నుంచి వెళ్లే ఫతేదర్వాజ, షేక్‌పేట నాలా నుంచి వెళ్లే బంజారాదర్వాజ వద్ద భారీగా భక్తులు వచ్చే అవకాశముండటంతో ఆయా ప్రాంతాల్లో వాహనాలను అనుమతించరు. రాందేవ్‌గూడ వైపునుంచి వచ్చే భక్తులు తమ వాహనాలను మిలిటరీ గ్రౌండ్, అషూర్‌ఖానాలో నిలుపుకొని గోల్కొండకు వెళ్లాలి. లంగర్‌హౌజ్ వైపు నుంచి వచ్చే భక్తుల వాహనాలను ఫతేదర్వాజ వైపు అనుమతించరు. వారు తమ వాహనాలను మిలిటరీ గ్రౌండ్‌లో నిలుపుకోవాలి. షేక్‌పేట వైపు నుంచి వచ్చే భక్తులు గోల్ఫ్‌క్లబ్ పార్కింగ్‌లో తమ వాహనాలను నిలిపి గోల్కొండ లోపలికి వెళ్లాలి. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా తమకు కేటాయించిన ప్రదేశంలోనే భక్తులు వాహనాలు నిలుపుకోవాలని, ట్రాఫిక్ సంబంధిత సమస్య ఉంటే హెల్ప్ లైన్ నంబర్ 9010203626లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేటినుంచి ఉజ్జయినీ మహంకాళి ఘటోత్సవం


అమ్మవారి ఘటోత్సవం(ఫైల్)

సికింద్రాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాలలో కీలక ఘట్టమైన ఘటోత్సవం ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 21, 22వ తేదీల్లో బోనాల జాతర జరగనుండగా, ఆదివారం అమ్మవారి ఘటోత్సవంతో జాతరకు అంకురార్పణ జరగనుంది. ఆదివారం ఉదయం ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో అభిషేకం, అర్చన, గణపతి హోమం, నివేదన, మహా హారతి తదితర పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. మధ్యాహ్నం 2గంటలకు అమ్మవారి ఘటం ఆభరణాలకు, ఘట సామగ్రికి ప్రత్యేక పూజలు చేసి, ఘటాన్ని తయారు చేయడానికి కర్బలా మైదానంలో దేవాలయ అనువంశిక ధర్మకర్తలకు అందజేస్తారు.

ఢిల్లీలో బోనాల ఉత్సవాలకు దత్తాత్రేయకు ఆహ్వానం


బండారు దత్తాత్రేయకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న వెంకటేశ్, అరవింద్‌కుమార్‌గౌడ్

చాంద్రాయణగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 8,9,10 తేదీలలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జరిగే బోనాల ఉత్సవాలకు హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయను ఆహ్వానించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేశ్, కన్వీనర్ జి.అరవింద్‌కుమార్‌గౌడ్ శనివారం హరియాణా గురుగ్రామ్‌లోని పీడబ్ల్యూడీ రెస్ట్‌హౌస్‌లో ఆయనను కలిసి ఆహ్వానం అందజేశారు.

నేడు ఈపీఎఫ్‌ఓ, ఈఎస్‌ఐసీ ఉద్యోగ పరీక్ష

● నగరంలో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ఎంప్లాయిస్ ప్రావిడెండ్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ), ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) నర్సింగ్ ఆఫీసర్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పరీక్షలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈపీఎఫ్ఓ పర్సనల్ అసిస్టెంట్ పరీక్షకు జిల్లాలో 6,090 మంది అభ్యర్థులు హాజరవుతుండగా.. 17 సబ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. అలాగే ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్షకు 13,728 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. వీరికి 37 సబ్‌సెంటర్లను కేటాయించారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు ఈపీఎఫ్ఓ, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఈఎస్ఐసీ పరీక్షలు జరుగుతాయని, ఓఎంఆర్ పద్ధతిలో ఉంటాయని అధికారులు తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందే గేట్లు మూసి వేస్తారని చెప్పారు. అభ్యర్థులు ఈ-అడ్మిట్ కార్డుతో కేంద్రాలకు హాజరుకావాలని సూచించారు.

సీపీగెట్ ప్రవేశ పరీక్షలు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే రాష్ట్రస్థాయి కామన్ పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశ పరీక్షలు (సీపీగెట్- 2024) శనివారం ప్రారంభమయ్యాయి. 6వ తేదీ నుంచి ఈ నెల 16వ తేదీ వరకు ప్రతిరోజూ మూడు సెషన్లలో 45 సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించేందుకు ఉస్మానియా యూనివర్సిటీ ఏర్పాట్లు చేసింది. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లా కేంద్రాల్లో నాలుగు సబ్జెక్టులకు మూడు సెషన్లలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆయా సబ్జెక్టుల్లో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న 7,416మంది అభ్యర్థులకు గాను 6,465మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవ్వగా, మొదటిరోజు హాజరుశాతం 87.17 నమోదైనట్లు సీపీగెట్ కన్వీనర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన (మైనారిటీ) విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులు అభ్యసించేందుకు సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి మొహమ్మద్ ఇలియాస్ అహ్మద్ తెలిపారు. అమెరికా, ఆస్ట్రేలియా, లండన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, సౌత్ కొరియా, సింగపూర్ దేశాల్లో పోస్టు గ్రాడ్యుయేట్స్/డాక్టరల్ స్టడీస్ చేసేందుకు అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2024 జనవరి నుంచి 2024 జూలై కాలంలో (స్ప్రింగ్ సీజన్) ఆయా దేశాల్లో అడ్మిషన్ తీసుకున్న అర్హత కలిగిన అభ్యర్థులు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 8 నుంచి ఆగస్టు 7 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తు కాపీలను హైదరాబాద్ జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం ఏడాదికి రూ.5లక్షల లోపు మించకూడదని, సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకానికి ఎంపికైన ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్/ఆర్థిక సాయం కింద రూ.20 లక్షలు, విమాన ప్రయాణ చార్జీల కింద రూ.60 వేలు చెల్లిస్తామన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా మైనారిటీస్ సంక్షేమశాఖ కార్యాలయం ఫోన్ నంబర్ 040-23240134లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అఫిడవిట్‌లు తీసుకుంటూనే..

ఫ్యాకల్టీ ర్యాటిఫికేషన్ దరఖాస్తులు

జేఎన్‌టీయూ అధికారుల తీరుపై ప్రైవేటు యాజమాన్యాల విస్మయం

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఉన్నతాధికారుల తీరుతో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఈనెల 4 నుంచి ఇంజనీరింగ్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభమయ్యాక కూడా ప్రైవేటు కాలేజీలకు అనుమతించిన సీట్లలో మార్పులు చేసి రివైజ్డ్ ఈఓఏ (ఎక్స్‌టెన్షన్ ఆఫ్ అప్రూవల్) జారీచేయాలంటూ ఏఐసీటీఈకి జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ లేఖ రాయడం వివాదాస్పదమైంది. తాజాగా ప్రైవేటు కాలేజీల్లో ఫ్యాకల్టీ, ప్రిన్సిపాల్స్ ర్యాటిఫికేషన్‌కు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ పేరిట శుక్రవారం సర్క్యులర్ జారీచేయడంపైనా యూనివర్సిటీ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

తనిఖీలు పూర్తయ్యాక ర్యాటిఫికేషన్లు..

సాధారణంగా సెలక్షన్ కమిటీ మీటింగ్ (ఎస్‌సీఎం) ఏర్పాటుచేసి ఫ్యాకల్టీ ర్యాటిఫికేషన్ పూర్తిచేశాకే ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ తనిఖీలు, అఫిలియేషన్ల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే, జేఎన్‌టీయూ అధికారులు గతేడాది నుంచి ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలు పూర్తయి, లోపాలున్న కళాశాలల నుంచి అఫిడవిట్లు తీసుకొని అఫిలియేషన్లు ఇచ్చేస్తున్నారు. మరోవైపు ఫ్యాకల్టీ ర్యాటిఫికేషన్ కోసం ఎస్‌సీఎంలు ఏర్పాటు చేస్తున్నాం కనుక, ఆన్‌లైన్‌లో ఈ నెల 12లోగా దరఖాస్తులు చేయాలని వర్సిటీ రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీచేయడాన్ని ప్రైవేటు కాలేజీల ప్రతినిధులు ఆక్షేపిస్తున్నారు.

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవానికి

80 ప్రత్యేక బస్సులు

● ఈనెల 8 నుంచి 10 వరకు స్పెషల్ ఆపరేషన్స్

● 18 పాయింట్ల నుంచి ఎస్ఆర్‌నగర్ వరకు బస్సులు



హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ అమ్మవారి వార్షిక కల్యాణోత్సవం నేపథ్యంలో జూలై 8 నుంచి 10వ తేదీ వరకు గ్రేటర్ ఆర్టీసీ 80 ప్రత్యేక బస్సులు నడుపుతుందని గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. మూడు రోజుల పాటు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూబ్లీబస్‌స్టేషన్, ఎంజీబీఎస్, సీబీఎస్, సికింద్రాబాద్, ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్, మెహిదీపట్నం, కాచిగూడ రైల్వే స్టేషన్, హయత్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, ఉప్పల్ ఎక్స్‌రోడ్, వియాపూర్ ఎక్స్‌రోడ్, రాంనగర్, మల్కాజిగిరితో పాటు మొత్తం 18 పాయింట్ల నుంచి ఎస్ఆర్ నగర్ వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. బల్కంపేట అమ్మవారి కల్యాణోత్సవానికి గ్రేటర్‌తో పాటు పలు జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారని రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపుతామన్నారు. ప్రయాణికుల కోసం రేతిఫైల్ బస్‌స్టేషన్ (9959226154), కోఠి (9959226160) ప్రాంతాల్లో కమ్యూనికేషన్ సెంటర్లు అందుబాటులో ఉంటాయని బస్సు ల వివరాలకు ఈ ఫోన్ నంబర్లలో వివరాలు తెలుసుకోవచ్చన్నారు. స్పెషల్ ఆపరేషన్స్ నిర్వహణకు నలుగురు అధికారులను ఆర్టీసీ ప్రత్యేకంగా నియమించింది. బల్కంపేట దేవాలయం కూకట్‌పల్లి డీఎం (9959226151), సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రాణిగంజ్ డీఎం (9959226147), జేబీఎస్ కంటోన్మెంట్ డీఎం- (9959226143), ఎంజీబీఎస్ ముషీరాబాద్ డీఎం (9959226418) నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

బోనాల నేపథ్యంలో విద్యుత్‌శాఖ ప్రత్యేక ఏర్పాట్లు

బోనాల నేపథ్యంలో గ్రేటర్, రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల పరిధిలో విద్యుత్‌శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గ్రేటర్‌జోన్ పరిధిలోని ప్రముఖ దేవాలయాల వద్ద 854 వరకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసింది. ముఖ్య ప్రాంతాల్లో అదనంగా మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగా ఉంచినట్లు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఒక్కో దేవాలయం వద్ద ఒక్కో అధికారి, సిబ్బందికి ప్రత్యేకంగా విధులు కేటాయించినట్లు మెట్రో జోన్ చీఫ్ ఇంజనీర్ నర్సింహస్వామి, రంగారెడ్డి జోన్ సీఈ పి.ఆనంద్, మేడ్చల్ జోన్ సీఈ సాయిబాబా తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టడంతో పాటు ముఖ్య ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

చాదర్‌ఘాట్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలంలో గురుపౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ చేసే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు రీజినల్ మేనేజర్ శ్రీలత తెలిపారు. ఈనెల 19వ తేదీన ఆర్టీసీ మహాత్మాగాంధీ బస్‌స్టేషన్, బీహెచ్‌ఈఎల్, ఈసీఐఎల్ ప్రాంతాల నుంచి సూపర్ లగ్జరీ బస్సులు నడవనున్నాయి. ఎంజీబీఎస్ నుంచి ఒకరికి రూ.3,700లు చార్జీ వసూలు చేయనున్నారు. బీహెచ్‌ఈఎల్, ఈసీఐఎల్ నుంచి రూ.3,900లు చార్జీ వసూలు చేయనున్నారు. 19న బయలుదేరే బస్సు 20న ఉదయం 8గంటలకు కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనానంతరం బయలుదేరి రాత్రి 8గంటలకు అరుణాచలం చేరుకుంటుంది. 21న మధ్యాహ్నం 3గంటలకు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి 22న ఉదయం 6గంటలకు ఎంజీబీఎస్‌కు చేరుకుంటుందని ఆర్ఎం వివరించారు. ప్రయాణికుల సౌకర్యార్థం రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ముందుగా సీట్లను బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాల కోసం 99592 26249, 93465 59649, 96663 50995 ద్వారా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఎప్‌సెట్ అభ్యర్థులు అప్‌సెట్..!

● కౌన్సెలింగ్ స్లాట్స్ దొరకక ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన దుస్థితి

● అదనపు స్లాట్స్ ఇవ్వాలని అభ్యర్థుల డిమాండ్


జేఎన్‌టీయూ హెల్ప్‌లైన్ సెంటర్‌లో సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్‌లో ర్యాంకులు పొందిన అభ్యర్థులు అప్‌సెట్ అవుతున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా ధ్రువపత్రాల నిమిత్తం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్లలో స్లాట్స్ దొరకకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. వాస్తవానికి ఈనెల 4 నుంచి స్లాట్స్ బుకింగ్ ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 36 హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేయగా, హైదరాబాద్‌లో 6 కేంద్రాలు ఉన్నాయి. అయితే.. ఈ ఆరు కేంద్రాల్లోనూ స్లాట్స్ మొదటిరోజే మధ్యాహ్నానికే అయిపోయాయి. గ్రేటర్ పరిధిలోని కూకట్‌పల్లి జేఎన్‌టీయూ, మాసబ్‌ట్యాంక్, రామంతపూర్, మారేడ్‌పల్లి పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఈ నెల 13వరకు ఒక్క స్లాట్ కూడా లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న అభ్యర్థులు పొరుగు జిల్లాల్లోని హెల్ప్‌లైన్ సెంటర్లకు వెళ్లక తప్పడం లేదు. పాతబస్తీలోని క్యూక్యూ పాలిటెక్నిక్ సెంటర్‌లో కొద్దిపాటి స్లాట్స్ ఉన్నప్పటికీ ఈనెల 13న మాత్రమే లభ్యమవుతాయని, 13వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ కోసం వేచి ఉంటే గడువులోగా ఆప్షన్లు ఎక్సర్‌సైజ్ చేసేందుకు సమయం సరిపోదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని అన్ని హెల్ప్‌లైన్ కేంద్రాల్లో మరిన్ని స్లాట్స్ పెంచాలని, అదనపు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై కౌన్సెలింగ్ క్యాంప్ ఆఫీసర్ శ్రీనివాస్ స్పందిస్తూ, నగరంలోని కొన్ని హెల్ప్‌లైన్ కేంద్రాల్లో స్లాట్స్ దొరకకపోవడం వాస్తవమేనన్నారు. డిమాండ్ ఉన్న హెల్ప్‌లైన్ కేంద్రాల్లో మరిన్ని స్లాట్స్ పెంచడం, అదనపు సిబ్బందిని నియమించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధ బీభత్సం అమానుషం

● సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు

● రాజ్‌భవన్ వద్ద నిరసన.. పలువురి అరెస్ట్


రాజ్‌భవన్ ముట్టడికి యత్నిస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా ప్రతినిధులను అడ్డుకుంటున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాపై అమెరికా అండదండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధం అమానుషమని, ఆ దేశంతో భారత దేశ ఆర్థిక సైనిక, ఇతర ఒప్పందాలు తక్షణమే రద్దు చేసుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. పాలస్తీనాలో ఇజ్రాయిల్ ఏకపక్ష దాడులు నిలిపివేసేలాగా ఐక్యరాజ్యసమితి లాంటి సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాజ్‌భవన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించింది. రాజ్‌భవన్ వైపు ర్యాలీగా వెళ్తున్న పార్టీ శ్రేణులను నాయకులు పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం పోటు రంగారావు మాట్లాడుతూ పాలస్తీనాలోని సుమారు 38వేల మందికి పైగా స్త్రీలు, పిల్లలను, ప్రజలను ఇజ్రాయిల్ బాంబుదాడులు, కాల్పుల ద్వారా చంపివేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం వెనుక అమెరికా సామ్రాజ్యవాద దుర్నీతి దాగి ఉందన్నారు. భారత ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు ఇచ్చిన మద్దతును, అన్ని రకాల ఒప్పందాలను తక్షణం ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో కె.జి.రాంచందర్, కె.రమ, కెచ్చల రంగయ్య, రాయల చంద్రశేఖర్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, చిన్న చంద్రన్న, గుమ్మడి నరసయ్య, వి.ప్రభాకర్, ఎం.హన్మేశ్, సదానందం, ఎస్.ఎల్.పద్మ, రాంచందర్, అవుల అశోక్, కొత్తపల్లి రవి, అరుణ్‌కుమార్, శిరోమణి, ఝాన్సీ, మంగతాయి, లక్ష్మీబాయి తదితరులు ఉన్నారు.

దండుమల్కాపూర్‌లో ఫ్లైఓవర్ నిర్మించాలి

● మంత్రి కోమటిరెడ్డికి టిఫ్ వినతి


మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య ప్రతినిధులు

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై దండు మల్కాపూర్‌లో అభివృద్ధి చేసిన టిఫ్ ఎంఎస్‌ఎంఈ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య (టిఫ్) ప్రతినిధుల బృందం మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డిని శనివారం కోరింది. సుమారు 552 ఎకరాల్లో ప్రారంభించిన టిఫ్ ఎంఎస్‌ఎంఈ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను సుమారు 1,855 ఎకరాల్లో విస్తరించనున్నట్టు సమాఖ్య ప్రతినిధులు మంత్రికి తెలిపారు. యాదాద్రి- భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పరిధిలో నూతన పారిశ్రామికవాడల ఏర్పాటుకు విస్తృత అవకాశాలున్నాయని సమాఖ్య అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి మంత్రికి సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. అలాగే సమీపంలోని ఆందోల్ మైసమ్మ గుడి వద్ద భక్తుల రద్దీ దృష్ట్యా ఫ్లైఓవర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఫ్ సీనియర్ జాయింట్ సెక్రటరీ గోపాల్‌రావు, నాదర్‌గుల్ పారిశ్రామిక ప్రాంత అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, గాంధీనగర్ పారిశ్రామిక ప్రాంత అధ్యక్షుడు స్వామిగౌడ్, జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంత ఐలా వైస్ చైర్మన్ ఏఎల్ఎస్ రెడ్డి, మౌలాలి పారిశ్రామిక ప్రాంత ఐలా చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చర్లపల్లి పారిశ్రామిక ప్రాంత ఐలా సెక్రటరీ వెంకటేశ్వరరెడ్డి, ఐరన్ అండ్ స్టీల్ ఫర్నిచర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మోహన్ అమిరెడ్డి, తెలంగాణ వెబ్ ఆఫ్సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అది సమాఖ్య స్ఫూర్తికి ముప్పు

● దక్షిణాసియా దేశాల మధ్య సఖ్యత అవసరం

● ప్రఖ్యాత పాత్రికేయుడు ఆకార్ పటేల్


మాట్లాడుతున్న ఆకార్ పటేల్

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో అధికార కేంద్రీకరణ వల్ల కేంద్ర, రాష్ట్రాల మధ్య సహకార సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటుందని ప్రఖ్యాత పాత్రికేయుడు, రచయిత ఆకార్ పటేల్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాల అధికారాన్ని బలహీన పరచడం సరికాదని హితవుపలికారు. ఇది ఇలానే కొనసాగితే భవిష్యత్‌లో సమాఖ్య స్ఫూర్తికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. మంతన్ సంవాద్ ఆధ్వర్యంలో శనివారం లక్డీకపూల్‌లోని ఓ పాఠశాల ఆవరణలో 'ది కేస్ ఫర్ ఆప్టిజం' అనే అంశంపై ఆకార్ పటేల్ ప్రసంగించారు. 'స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో భారతదేశం ఐదో స్థానంలో ఉందని మనం గొప్పగా చెప్పుకొంటున్నాం. నిజానికి సాంఘికాభివృద్ధి, జీవన ప్రమాణాలు, పేదరికం వంటి కొన్ని విషయాల్లో బంగ్లాదేశ్, పాకిస్థాన్, శ్రీలంక తదితర దేశాలకన్నా భారత్ మెరుగ్గా ఏమీ లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. యూరోపియన్ సభ్యదేశాలు ఒక సమ్మిళిత ఆర్థిక సమాఖ్యగా ఏర్పడినట్లు, దక్షిణాసియా దేశాలు కూడా ఒక ఆర్థిక కూటమిగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. ఆర్థికంగా దేశం అత్యంత బలమైనదిగా ఎదుగుతున్నప్పటికీ ఆర్థిక అసమానతలు అంతకంతకు పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాంమనోహర్‌రెడ్డి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు డాక్టర్ ఆత్మహత్య


డాక్టర్ ప్రాచీకార్ (ఫైల్)

బేగంపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): నిమ్స్‌లోని అనస్థీషియా విభాగంలో అడిషనల్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రాచీకార్(46) ఎక్కువ మోతాదులో మత్తుమందు తీసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. బేగంపేట ఎస్సై జయచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన ప్రాచీకార్ భర్త దీపక్ కార్డియాలజిస్టుగా పని చేస్తున్నారు. వీరికి 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఒక కుమారుడు ఉన్నాడు. బేగంపేటలోని బ్రాహ్మణవాడిలో సొంత ఇంట్లో ఉన్న వీరు నెల రోజుల క్రితం మూసాపేటలోని మరో ఇంటికి మారారు. శుక్రవారం సాయంత్రం ఆమె విధులు ముగించుకొని బ్రాహ్మణవాడిలోని ఇంటికి వెళ్లి మత్తు ఇంజక్షన్ తీసుకొని అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఎంత సేపటికి ఇంటికి రాక పోవడంతో భర్త ఆమెకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో భర్త బ్రాహ్మణవాడిలోని ఇంటికి వెళ్లి చూడగా ఇంటి లోపల నుంచి తలుపునకు గడియపెట్టి ఉంది. తలుపు పగులగొట్టి చూడగా ఆమె అపస్మారక స్థితిలో ఉండడంతో వెంటనే చికిత్స కోసం నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

నూతన ఆవిష్కరణలతో దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి

● మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నైతికత, నిబద్ధత, నూతన ఆవిష్కరణలతో భారతదేశ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని చార్టర్డ్ అకౌంటెంట్లకు హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సూచించారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం చార్టర్డ్ అకౌంటెంట్ డే ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్వీఎస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డిజిటల్ టెక్నాలజీలను అనుసరించి భారతీయ నగరాలను గ్లోబల్ అకౌంట్స్ ప్రాసెసింగ్ హబ్‌లుగా మార్చాలని సూచించారు. ఉన్నతమైన నైతిక ప్రమాణాలు, కఠినమైన ఆడిటింగ్ పద్ధతులను అవలంబించడం ద్వారా అవినీతి, మోసాలను నిరోధించవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి, సీఏ స్నేహజ, చార్టర్డ్ అకౌంటెంట్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు సీఏ దేవరాజరెడ్డి, సీఏ ఎం.పీ విజయ్‌కుమార్, సీఏ లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'దర్ద్' పుస్తావిష్కరణ సభ

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మూలవాసీ ముస్లిం కవిత్వం "దర్ద్" పుస్తకావిష్కరణ సభ ఆదివారం సాయంత్రం 6గంటలకు సుందరయ్య భవన్ దొడ్డి కొమురయ్య హాల్‌లో జరుగుతుందని బహుజన్ రైటర్స్ ఫోరం, హర్యాలీ ముస్లిం రచయితల వేదిక శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆవిష్కరణ సభలో వక్తలు సామిడి జగన్‌రెడ్డి మోర్సీ మార్గరెట్, పసునూరి రవీందర్, శ్రీరామ్ పుప్పాల, సమన్వయ కర్తగా నస్రీన్‌ఖాన్, అధ్యక్షత కవి యాకూబ్, ఆవిష్కర్తగా అంబటి సురేంద్రరాజు, ముఖ్య అతిథిగా జి.లక్ష్మీ నరసయ్య పాల్గొంటారని తెలిపారు.

సీఏపీఎఫ్‌లో మహేష్ భగవత్ బృందం స్టూడెంట్స్ సత్తా

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) కేంద్ర సాయుధ బలగాలైన సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీల్లో అసిస్టెంట్ కమాండెంట్ పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించింది. ఆయా పరీక్షల్లో అర్హత సాధించిన వారిలో అపాయింట్‌మెంట్ కోసం 312 మంది అభ్యర్థుల్ని శుక్రవారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా 312 మంది అభ్యర్థులు ఆయా విభాగాల్లో ఎంపిక కాగా అందులో 60 మందికిపైగా అభ్యర్థులకు ఏడీజీ మహేష్ భగవత్ బృందం ఇంటర్వ్యూల కోసం మార్గదర్శకత్వం వహించింది. తెలంగాణ నుంచి సీఏపీఎఫ్ పరీక్షలో 27వ ర్యాంకు సాధించిన అన్వేష్‌రెడ్డి, 177వ ర్యాంక్ సాధించిన ప్రద్యుమ్నరెడ్డితో పాటు మరికొందరికి భగవత్ బృందం తర్ఫీదు ఇచ్చింది. కాగా మహేష్ భగవత్ బృందం ఇంటర్వ్యూల్లో మెలకువలు నేర్పడంతో 2016 నుంచి ఇప్పటి వరకు యూపీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో 2400 మందికి పైగా అభ్యర్థులు విజయం సాధించారు.

నిమ్స్ మేలో యువతకు ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడలోని నిమ్స్ మేలో నిరుద్యోగ యువతకు పలు కోర్సుల్లో జూలై 4వ తేదీ నుంచి ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అసోసియేట్ ఫ్యాకల్టీ సభ్యురాలు వి.స్వప్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఈ శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నదన్నారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన 18-35 ఏళ్లలోపు అభ్యర్థులు విద్యార్హత పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, మూడు పాస్‌పోర్ట్ ఫొటోలు, ఐడీ ప్రూఫ్ ధ్రువీకరణ పత్రాలను ఈనెల 20 తేదీలోపు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కోర్సుల్లో గ్రాఫిక్ డిజైనర్, మేకప్ ఆర్టిస్ట్, క్రాఫ్ట్ బేకర్ కోర్సులకు పదోతరగతి, టైలర్, యానిమేటర్ కోర్సులకు ఇంటర్, కంపోజిటర్, మీడియా డెవలపర్, అప్లికేషన్ డెవలపర్ (వెబ్/మొబైల్), వీఎఫ్ఎక్స్ ఎడిటర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, క్లౌడ్ కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్, అకౌంట్స్, ఏఐ, ఎంఎల్ జూనియర్ టెలికాం డేటా అనలిస్ట్ ఎగ్జిక్యూటివ్ కోర్సులకు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. కోర్సుల సమాచారం కోసం www.nimsme.org చూడాలని, ఫోన్ నం.040-23633244/217/218లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ శుభ సూచకం

● డాక్టర్ వర్రె వేంకటేశ్వర్లు

పంజాగుట్ట, జూలై 6(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో సమావేశం కావడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్టీఐ మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో పాటు, పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సత్సంబంధాలు కొనసాగించడం రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. గత పది సంవత్సరాలుగా 9వ షెడ్యూల్‌లోని 23 అంశాలు, 10వ షెడ్యూల్లో 30 అంశాలపై ఇప్పటివరకు ఏకాభిప్రాయం రాలేదని, దీంతో విభజన అంశాలు పెండిగ్‌లో ఉన్నాయని అన్నారు. ప్రస్తుత తెలుగు రాష్ట్రాల సీఎంలు ఆ సమస్యల పరిష్కారానికి ముందుకు రావడం శుభ పరిణామమని ఆయన పేర్కొన్నారు.

చంద్రబాబు ర్యాలీలో దొంగల చేతివాటం

● నాలుగు బంగారు గొలుసులు, మూడు సెల్‌ఫోన్‌లు చోరీ

బంజారాహిల్స్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబునాయుడు మొదటిసారి నగరానికి వచ్చిన సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో దొంగలు చేతివాటం చూపారు. నాలుగు బంగారు గొలుసులు, మూడు సెల్‌ఫోన్‌లను చోరీ చేశారు. బేగంపేట నుంచి ఎన్టీఆర్ ట్రస్టు భవన్ వరకు ర్యాలీ వచ్చాక సంబరాలు అంబరాన్నంటాయి. ఇదే అవకాశంగా భావించిన స్నాచర్లు తమ పని కానిచ్చారు. ఎన్ఏవీఎస్ రవితేజకు చెందిన 38 గ్రాముల బంగారు గొలుసు, గొరంట్ల వెంకటేష్, బి.శ్రీకాంత్‌లకు చెందిన 29 గ్రాముల బంగారు గొలుసులు, గాంధీ ఆచారికి చెందిన 14 గ్రాముల బంగారు గొలుసు, వెల్లంకి రమణకు చెందిన ఐ ఫోన్-13 మాక్స్ ప్రో, వెంపాటి శేలం రాజుకు చెందిన ఐ ఫోన్-14 మ్యాక్స్‌ప్రో, శ్రీనివాస్‌కు చెందిన సామ్‌సంగ్ ఎ-13 మొబైల్ ఫోన్‌లను తస్కరించారు. బాధితులు ఇచ్చిన వేర్వేరు ఫిర్యాదుల మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో పట్టుబడ్డ వారికి ఉస్మానియా హాస్టల్‌తో సంబంధం లేదు

● ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్

హైదరబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ధూల్‌పేటకు చెందిన గంజాయి విక్రేతతో పాటు గంజాయి కొనుగోలు చేస్తూ పట్టుబడ్డ ఇద్దరు వైద్యులు ఉస్మానియా మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులని, వారు కాలేజ్ హాస్టల్‌లో ఉండటం లేదని ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ తెలిపారు. మీడియాలో (ఆంధ్రజ్యోతి కాదు) ఉస్మానియా వైద్య విద్యార్థులు, ఉస్మానియా క్యాంపస్‌లో గంజాయి కొనుగోలు చేస్తున్నారని వచ్చిందని, ఇది పూర్తిగా తప్పని పేర్కొన్నారు. గంజాయి కొనుగోలు చేస్తూ పట్టుబడ్డ డాక్టర్ కె.మణికందన్, డాక్టర్ వి అరవిండ్‌లు ఉస్మానియా పూర్వ విద్యార్థులని, వారు క్యాంపస్‌లో ఉండటం లేదని స్పష్టం చేశారు.

అడ్డాకూలీని చంపిన ముగ్గురి రిమాండ్

మియాపూర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): టీస్టాల్‌లో మంచినీళ్లు తాగడానికి వెళ్లిన అడ్డాకూలీ సాయిలుపై అక్కడ పనిచేసే యువడితో పాటు అతని ఇద్దరు స్నేహితులు దాడిచేయడంతో పెనుగులాటలో ప్రాణాలు విడిచిన సంఘటన తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించిన ముగ్గురు నిందితులను నర్రం సతీష్(24), జి.జగదీష్(26), బి.భానుప్రసాద్(28)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులు అదుపులో హత్యకేసు నిందితుడు

బౌద్ధనగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): వారాసిగూడ బ్రాహ్మణబస్తీలో జరిగిన హత్య కేసులో నిందితుడిని చిలకలగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బ్రాహ్మణబస్తీలో మరమ్మతులు చేస్తున్న భవనంలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న కమ్మరి రామచంద్రయ్య శుక్రవారం తెల్లవారుజామున హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడు టైల్స్ పనిచేసే గుంటూరుకు చెందిన సలీమ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

సండే సెలబ్రిటీ



ఇప్పుడు దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా 'కల్కి 2898 ఏడీ' చిత్రం గురించే చర్చ. ఓ పాన్ వరల్డ్ సబ్జెక్ట్‌ను ఎన్నుకుని, పురాణాలను ముడిపెడుతూ రూపొందించిన ఈ చిత్రం వసూళ్ల పరంగా ప్రభంజనం సృష్టిస్తోంది. కొన్ని నెలలుగా పెద్ద సినిమాలు లేక వెలవెలబోతున్న థియేటర్లు 'కల్కి' రాకతో కళకళలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో సీనియర్ నటుడు కృష్ణంరాజు సతీమణి, హీరో ప్రభాస్ పెదతల్లి **శ్యామలాదేవి** ఈ చిత్ర విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ కొన్ని ఆసక్తికరమైన అంశాలను 'నవ్య'తో పంచుకున్నారు.

మా ప్రభాస్ కోహినూర్ వజ్రం

'కల్కి' విజయాన్ని ఎలా ఆస్వాదిస్తున్నారు?

చాలా ఆనందంగా ఉంది. సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం మొదటి నుంచీ ఉంది. సినిమా చూసి ప్రపంచవ్యాప్తంగా ప్రభాస్ ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. ఇదో అద్భుతమైన సినిమా అని అందరూ ప్రశంసిస్తుంటే గర్వంగా ఉంది. ఈ సినిమా కోసం మా ప్రభాస్ ఎంత హార్డ్ వర్క్ చేశాడో నాకు తెలుసు. ఆ కష్టానికి అద్భుతమైన ఫలితం దక్కడం ఆనందంగా ఉంది. మరో విషయం ఏమిటంటే .. అశ్వనీదత్‌గారి బేనర్‌లో కృష్ణంరాజుగారు నటించారు. 'అడవిసింహాలు' వంటి అద్భుతమైన హిట్ ఇచ్చారు. అటువంటి బేనర్‌లో ప్రభాస్ కూడా నటించడం మా ఆనందానికి మరో కారణం.

నలభై ఏళ్ల క్రితం కృష్ణంరాజు 'కల్కి' పేరుతో ఒక సినిమా ప్రారంభించి, మధ్యలో ఆపేశారు కదా!

అవునండీ. మా గోపీకృష్ణా బేనర్ మీద ఆ చిత్రాన్ని రాజుగారు ప్రారంభించారు. సంగీత దర్శకుడిగా కీరవాణికి అదే తొలి సినిమా కావాలి. అప్పట్లో ఓ అద్భుతమైన పాటను ఆయన రికార్డ్ చేశారు కూడా. 'కల్కి' సినిమా ఎందుకు ఆగిపోయిందో నాకు తెలీదు కానీ ఇప్పుడు అదే పేరుతో మా అబ్బాయి ప్రభాస్ సినిమా రావడం, అది సూపర్ హిట్ కావడం మా అందరికీ సంతోషకరమైన విషయం.

ఈ చిత్రం షూటింగ్‌కు కృష్ణంరాజు వెళ్లేవారా?

కొన్నిసార్లు వెళ్లారు. కొంత సేపు అక్కడ గడిపి, అక్కడున్న వాళ్లందరితోనూ మాట్లాడి ఇంటికి తిరిగి వచ్చాక నాతో... 'కల్కి' చాలా పెద్ద హిట్ అవుతుంది. చిత్ర పరిశ్రమలో ప్రవేశించిన 20 ఏళ్లకే ప్రభాస్ మరే ఇతర హీరో సాధించలేని ఘన విజయాలు సాధించాడు. ఇంకా అభివృద్ధి లోకి వస్తాడు. మన వంశానికి గొప్ప పేరు తెస్తాడు" అని చెప్పి మురిసిపోయేవారు. ఆయన నమ్మకాన్ని ప్రభాస్ నిలబెట్టాడు. బాబుతో 'భక్త కన్నప్ప' చిత్రం తీయాలని రాజుగారు అనుకొనేవారు. 'కన్నప్ప అంటే పెద్ద బాజీగారే (కృష్ణంరాజును పెద్ద బాజీ అని ప్రభాస్ పిలుస్తారు) కదా. ఆయన్ని మించి నేను నటించగలనా' అనే వాడు. బాబు వరుస సినిమాల వల్ల 'భక్త కన్నప్ప' తీయలేకపోయాం. ఇప్పుడు మంచు విష్ణు 'కన్నప్ప' చిత్రాన్ని అద్భుతంగా తీస్తుండడం, అందులో బాబు ఓ ముఖ్య పాత్ర పోషించడం ఆనందంగా ఉంది.

'కల్కి' సినిమా గురించి మీకు మొదటి రిపోర్ట్ ఎక్కడ నుంచి వచ్చింది?

మా పెద్దమ్మాయి సినిమా చాలా బాగుందంటూ మొదట ఫోన్ చేసి చెప్పింది. ఆ వెంటనే అమెరికా నుంచి ప్రభాస్ అభిమాని ఒకరు ఫోన్ చేసి 'బ్లాక్‌బస్టర్ మూవీ' అని చెప్పాడు. తెల్లారే ఈ ఫోన్లు రావడంతో ఇక అప్పటి నుంచి ఎప్పుడు తెల్లారుతుందా... థియేటర్‌లో జనం మధ్య కూర్చుని సినిమా ఎప్పుడు చూస్తానా అనిపించింది. సినిమా రిలీజ్ రోజున బాబు ఇక్కడే ఉన్నాడు. ఆయనకి ఎన్నో ఫోన్లు, అభినందనలు. సాయంత్రం నేను ఫోన్ చేసి అభినందిచాను. పై నుంచి చూస్తూ మీ పెద్ద బాజీ ఎంత ఆనందిస్తుంటారో' అని చెప్పగానే బాబు కూడా 'దీనికంతా కారణం పెద్దబాజీనే కదా.. అంతా ఆయనే చూసుకుంటారు' అని ఎమోషనల్ అయ్యాడు. ఇలా ప్రతి విషయంలోనూ వాళ్ల పెద్దనాన్నను ప్రభాస్ గుర్తు చేసుకుంటూనే ఉంటాడు. వాళ్ల నాన్నగారన్నా, పెద్ద నాన్నగారన్నా అతనికి ఎంతో అభిమానం. గౌరవం. ఆ తర్వాత ప్రభాస్ అమ్మగారితో మాట్లాడాను. 'బాబు ప్రభంజనం సృష్టించాడు' అనగానే ఆవిడ కూడా ఎంతో పొంగిపోయారు. తల్లిగా నాకు, పెద్దతల్లిగా మీకు ఆనందకరమైన విషయం కదా ఇదన్నారు.

సలార్, కల్కి.. ఇలా ప్రభాస్ వరుస హిట్స్‌తో మీ ఫ్యామిలీ ఎలా ఫీలవుతోంది?

ప్రభాస్ అభిమానులు ఎంత ఆనందంగా ఉంటే మా కుటుంబానికి అంత సంతోషం. ప్రజల ఆదరణ, ఫ్యాన్స్ సంతోషమే కదా మాకు కావాల్సింది. ఫ్యాన్స్ ఏది కోరుకుంటున్నారో బాబు అది ఇవ్వగలిగాడు.

ఈ సినిమా థియేటర్ దగ్గర ఉంచిన 'బుజ్జి' (కారు)ను ఎక్కి మీరు బాగా ఎంజాయ్ చేసినట్లున్నారు!

రాజమౌళిగారు రూపొందించిన 'బాహుబలి' చిత్రంలో ఏనుగు సీన్ బాగా హైలైట్ అయింది. ఆ సినిమా తర్వాత ఏనుగు అంటే నాకు ప్రత్యేక అభిమానం ఏర్పడింది. ఏనుగు బొమ్మ డిజైన్ల చీరలు కడుతుంటాను. నా మెళ్లో కూడా ఏనుగు బొమ్మ ఉన్న గొలుసే ఉంది. అలాగే 'కల్కి' సినిమాతో బుజ్జి కారుకు అంత పాపులారిటీ వచ్చింది. ఆ కారు నిన్న భీమవరం వెళ్లింది. అక్కడి జనం దాన్ని ఎక్కడానికి బారులు తీరారు. ఆ కారు ఎక్కే ఛాన్స్ ఇవ్వమని నాకు ఒకటే ఫోన్లు. అలాగే ఈరోజు వైజాగ్ వెళ్లింది. అక్కడ కూడా రెస్పాన్స్ బాగుంది. సినిమాలో ఒక కారుకి అంత ఇంపార్టెన్స్ ఇవ్వడం, అందులో ప్రభాస్ ఎక్కడం జనంలో క్రేజీ అయింది. అందుకే నేను కూడా ఆ కారు ఎక్కి ఎంజాయ్ చేశా. ఇంకో విషయం... ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్‌గారి నటన అద్భుతం. అశ్వత్థామ పాత్రను ఆయన పోషించిన తీరు చూస్తుంటే కృష్ణంరాజు గారు ఉంటే ఇటువంటి పాత్రను పోషించి ఉండేవారు కదా' అనిపించింది. పౌరాణిక పాత్రలు అంటే రాజుగారికి ఎంతో ఇష్టం. అమితాబ్‌గారు ఆ పాత్ర చేయడం సినిమాకు చాలా ప్లస్ అయింది. 'కురుక్షేత్రం' సినిమాలో రాజుగారు కర్ణుడి పాత్ర పోషించారు. 'కల్కి' సినిమాలో ప్రభాస్ మళ్లీ ఆ పాత్రలో కనిపించడం ఆనందం కలిగించింది. రథం మీద నుంచి కిందకు దిగుతూ ప్రభాస్ చూసిన చూపు చూడగానే రాజుగారు గుర్తుకు వచ్చారు. మైండ్ బ్లోయింగ్ సీన్ అది. ఆనందం పట్టలేక నేను కూడా చప్పట్లు కొట్టాను. మా అబ్బాయి అని కాదు కానీ ప్రభాస్ కోహినూర్ వజ్రం. గొప్ప వ్యక్తిత్వం అతనిది.

ప్రభాస్ సినిమా షూటింగ్ అంటే రకరకాల వంటల రుచి చూపిస్తుంటారని అందరూ అంటారు. ఈ అలవాటు ఎలా వచ్చింది?

మా ఫ్యామిలీలో అందరికీ అదే అలవాటు. రాజుగారి నాన్నగారి రోజుల నుంచి ఇది మొదలైంది. అక్కడి నుంచి రాజుగారు, ఆ తర్వాత ప్రభాస్.. ఇలా కంటిన్యూ అవుతోంది. ఏ రకం వాళ్లు ఇష్టపడతారో తెలీదు కనుక అన్ని రకాల వంటకాలు చేయించి పెడుతుంటారు ప్రభాస్. అలాగే ఒక్కోసారి ఎదుటి వాళ్లకు ఏది ఇష్టమో తెలుసుకుని ఆ వంటకాన్ని ప్రత్యేకంగా తయారు చేయిస్తుంటారు. ఇలా అందరికీ పెట్టడం, తిన్న తర్వాత వాళ్లు బాగుందని మెచ్చుకుంటే సంతోషించడం రాజుగారికి అలవాటు. దాన్నే ప్రభాస్ ఫాలో అవుతున్నాడు.

ప్రభాస్ ఫ్యామిలీకి ఎక్కువ సమయం కేటాయిస్తుంటారా?

ప్రభాస్ ఫ్యామిలీ మ్యాన్. తను ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఎప్పుడన్నా ఒక రోజు ఖాళీ దొరికితే చాలు వాళ్ల చెల్లెళ్లని పిలిపించుకుని వారితో సరదాగా గడుపుతాడు. నాతో ఫోన్లో మాట్లాడతాడు. అలాంటి అబ్బాయిని మనం చూడం. ఈ రోజు ప్రభాస్ అంటే ప్రపంచం, ప్రపంచం అంటే ప్రభాస్. అంతకుమించి నేను చెప్పను.

'కల్కి' ప్రాజెక్ట్ గురించి కృష్ణంరాజు ఏమని చెప్పేవారు?

దర్శకుడు నాగ్ అశ్విన్ ప్రతిభ మీద రాజుగారికి ఎంతో నమ్మకం. 'ఎవడే సుబ్రహ్మణ్యం' చిత్రంలో ఆయన నటించారు. చాలా దగ్గరుండి అతన్ని గమనించారాయన. నాగీ ఆలోచనా విధానం, టేకింగ్ ఆయన్ని ఆకట్టుకున్నాయి. 'నాగీ చాలా గొప్ప దర్శకుడు అవుతాడు' అని రాజుగారు అప్పుడే చెప్పారు. అందుకే 'కల్కి' సినిమా నాగీ దర్శకత్వంలో తీస్తున్నట్లు అశ్వనీదత్‌గారు చెప్పగానే రాజుగారు ఎంతో సంతోషించారు. 'నాగీ మంచి స్టోరీ తయారు చేశాడు. అందులో ప్రభాస్ నటిస్తే బాగుంటుంది. మీరు ఒక మాట బాబుకి చెప్పాలి' అని అశ్వనీదత్‌గారు ఆయన్ని అడిగారు. నాగీ ప్రతిభ, అశ్వనీదత్ గారితో ఉన్న స్నేహం కారణంగా వెంటనే ప్రభాస్‌కి ఫోన్ చేసి చెప్పారు రాజుగారు. ఆ తర్వాత ప్రభాస్ కథ వినడం, అతనికి నచ్చడంతో ఈ ప్రాజెక్ట్ మొదలైంది.



అల్లూరి సీతారామరాజు పాత్ర ప్రభాస్ చేసే ఆలోచన ఏమన్నా ఉందా?

ఇటీవల నేను భీమవరం వెళ్లినప్పుడు చాలా మంది అడిగారు... గతంలో కృష్ణంరాజుగారు అల్లూరి సీతారామరాజు చిత్రాన్ని తీయాలని ప్లాన్ చేసి, మానేశారు. ఆ తర్వాత కృష్ణగారు ఆ సినిమా తీసి అద్భుతంగా నటించారుజ ఎంతో పేరు తెచ్చుకున్నారు. ఆ సినిమా వచ్చి 50 ఏళ్లు దాటాయి. ఇప్పుడు ఆ పాత్రలో ప్రభాస్‌ను చూడాలనివుంది.. అని. బాబుకి కూడా ఆ పాత్ర చేయాలని మనసులో ఉంది కానీ వరుసగా ప్రాజెక్ట్స్‌తో చాలా బిజీగా ఉన్నాడు. సమయం చూసి మీ కోరికను ప్రభాస్‌కు చెబుతా.. అని వారితో అన్నాను.

గోపీకృష్ణా బేనర్ మీద మళ్లీ సినిమాలు తీసే ఆలోచన ఉందా?

ఉందండీ. మా పెద్దమ్మాయి నిర్మాతగా మారింది. రాజుగారు ఉండగానే పాపతో కొన్ని సినిమాలు తీయాలని ప్లాన్ చేశారు. ఆయన మరణంతో అది వాయిదా పడింది. అందరి సహకారంతో సొంతంగా సినిమాలు చేస్తాం. మా రెండో పాప 'కల్కి' చిత్రానికి ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసింది.

• వినాయకరావు
ఫొటోలు : రాజ్‌కుమార్

సంక్రాంతికి సిద్ధంకండి!

తెలుగు వారికి సంక్రాంతి చాలా పెద్ద సినీ పండుగ. ఈ పండుగకు ముందుగానే అందరూ సిద్ధమవుతూ ఉంటారు. వచ్చే ఏడాది సంక్రాంతికి అప్పుడే పెద్ద సినిమాలు రెడీ అయిపోతున్నాయి.

థియేటర్లు అవే.. ప్రేక్షకులు వారే.. కానీ ఆ థియేటర్లలో ప్రేక్షకులను ఆకర్షించటానికి పెద్ద స్టార్స్ అందరూ పోటీ పడుతూ ఉంటారు. ఇంకా ఐదు నెలలు ఉన్నా- ఇప్పటికే ఇండస్ట్రీలో సంక్రాంతి పోటీ ప్రారంభమయిపోయింది. వచ్చే సంక్రాంతికి మెగా స్టార్ చిరంజీవి 'విశ్వంభర' విడుదలకు సిద్ధం అవుతోంది. దీనికి సంబంధించిన డబ్బింగ్, వీఎఫ్ఎక్స్ కార్యక్రమాలు ఈ మధ్యనే ప్రారంభమయ్యాయి. ఏడు లోకాల కథగా అందరూ పేర్కొంటున్న ఈ సినిమాపై చాలా అంచనాలున్నాయి. ఈ సినిమాకు పోటీగా వెంకటేష్ హీరోగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో ఒక సినిమా రానుంది. గత వారమే షూటింగ్ ప్రారంభమయింది. వాస్తవానికి ఈ కథను చిరంజీవికి ముందు చెప్పారని.. ఆయన అంగీకరించకపోవటంతో - ఈ కథ వెంకటేష్ దగ్గరకు వెళ్లిందనే వార్తలు జోరుగా వినిపించాయి. ఏది ఏమైనా సైంధవ తర్వాత మార్కెట్ స్లంప్‌లో ఉన్న వెంకటేష్ కెరీర్ మరి కొద్ది కాలం కొనసాగటానికి ఇది ఒక మంచి అవకాశమనే చెప్పాలి. ఈ రెండు సినిమాలకు పోటీగా బాబీ దర్శకత్వంలో బాలకృష్ణ సినిమా కూడా సంక్రాంతికే విడుదల కానుంది. వీటితో పాటుగా సూపర్‌హిట్ టాక్ పొందిన శతమానం భవతి సీక్వెల్ శతమానం భవతి 2 కూడా సంక్రాంతికే విడుదల అవుతుందని ప్రకటించారు. ఇక తమిళ సూపర్‌స్టార్ అజిత్ తీస్తున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కూడా సంక్రాంతికి సిద్ధమవుతోంది.

ఈ సినిమాలన్నీ థియేటర్లలో విడుదల అవుతాయి.. కానీ ఓటీటీల పరిస్థితి ఏమిటనే విషయమే చాలా మందిని వేధిస్తున్న ప్రశ్న. ఈ ఏడాది ఓటీటీ ప్లాట్‌ఫాంలు సినిమాలు కొనుగోలు చేయటం తగ్గించేశాయి. తమ వద్ద బడ్జెట్లు లేవని అంతరంగిక సమావేశాల్లో వారి ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. కల్కి, పుష్ప-2, ఇండియన్, గేమ్ ఛేంజర్ వంటి పెద్ద పెద్ద సినిమాలకు



ఎక్కువ బడ్జెట్లు పెట్టడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందనేది ఒక వాదన. దీనికి కూడా ఒక కారణముంది. ఓటీటీ ఒక సినిమాకు- థియేటర్ల నుంచి, ఓవర్‌సీస్ మార్కెట్ నుంచి, శాటిలైట్ (టీవీలు) నుంచి, మ్యూజిక్ రైట్స్ నుంచి ఆదాయం లభించేది. వీటి ఆధారంగా బడ్జెట్స్ నిర్ణయమయ్యేవి. శాటిలైట్‌కు ఎక్కువ ఆదాయం వచ్చేది కాబట్టి- ఆ మొత్తం హీరో రెమ్యూనిరేషన్‌గా నిర్ణయించుకొనేవారు. ఓటీటీలు రంగ ప్రవేశం చేసిన తర్వాత ఈ లెక్కలలో మార్పులు వచ్చాయి. సినిమాలకు- ఓటీటీల నుంచి వచ్చే ఆదాయం.. థియేటర్ల నుంచి వచ్చే ఆదాయం ప్రధాన వనరుగా మారింది. పెద్ద సినిమాలను ప్రకటించిన వెంటనే ఓటీటీలు ముందుకు వచ్చి కొనుగోలు చేస్తున్నాయి. దీనితో ఓటీటీలు ఇచ్చే అడ్వాన్స్ హీరో రెమ్యూనిరేషన్‌గా నిర్ణయయింది. దీనితో హీరోల రెమ్యూనిరేషన్స్ విపరీతంగా పెరిగిపోయాయి. వీటితో పాటు సినిమా నిర్మాణం చేసే రోజుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిపోయింది. అంతే కాకుండా హీరోలు అవుట్‌డోర్ షూటింగ్‌లకు రావటం మానేశారు. దీనితో హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో సెట్టింగ్‌లు వేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉదాహరణకు హైదరాబాద్‌లో ఏ లోకేషన్‌లోనైనా సినిమా షూటింగ్ చేయటానికి కనీస అద్దె 50వేల రూపాయల దాకా ఉంది. ఒక సినిమా వంద రోజులు షూటింగ్ చేయాలంటే 50 లక్షల రూపాయల కేవలం లోకేషన్‌కు మాత్రమే చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇలా నిర్మాణ వ్యయాలు బాగా పెరిగిపోవటం వల్ల ఎక్కువ థియేటర్లలో ఒకే సారి విడుదల చేసి రెండు మూడు రోజుల్లో తాము పెట్టిన పెట్టుబడి వెనక్కి తీసుకోవాలనే ఉద్దేశంలో ఎక్కువ మంది నిర్మాతలు ఉన్నారు. అయితే ఈ మధ్యకాలంలో సోషల్ మీడియా బాగా వ్యాప్తి చెందిన తర్వాత - ఒక్క చెడు రివ్యూ ప్రత్యక్షమయినా- దాని ప్రభావం కలెక్షన్లపై పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో - సినిమాలు తీయటం.. వాటిని విడుదల చేయటం కష్టమని చాలా మంది భావిస్తున్నారు. చిన్న నిర్మాతల పరిస్థితి అయితే చాలా కష్టంగా ఉంది. ప్రస్తుతం- ఓటీటీలు చాలా అరుదుగా చిన్న సినిమాలను నేరుగా కొనుగోలు చేస్తున్నాయి. చాలా సినిమాలను పే పర్ వ్యూ పద్ధతిలో రిలీజ్ చేస్తున్నాయి. దీని వల్ల చిన్న నిర్మాతలకు కొంత భరోసా ఉన్నా లాభాలు వచ్చే పరిస్థితి అయితే లేదు. ఈ పరిస్థితే కొనసాగితే వచ్చే ఏడాది సినిమాల సంఖ్య తగ్గిపోతుందని ఇన్‌సైడర్స్ అభిప్రాయపడుతున్నారు. •

నవ్య **'దృశ్యం పేజీ'** లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/09S1oCv లో చదవండి.



అలనాటి కథ

మరపురాని గ్రీకు జ్ఞాపకాలు

కొన్ని సంఘటనలు మన మనసులపై చెరగని ముద్ర వేస్తాయి. అలాంటి ఒక సంఘటనే- శేషేంద్రతో నా గ్రీసు ప్రయాణం. అనేక రకాల మలుపులు తిరిగిన ఈ ప్రయాణాన్ని నేను ఎప్పటికీ మర్చిపోను.

ఒక రోజు హఠాత్తుగా శేషేంద్రకు యూరోపియన్ కల్చరల్ సెంటర్ నుంచి గ్రీసులోని డెల్ఫిలో - "భారత దేశంలోని పూర్వకవులు' అనే అంశంపై ప్రసంగించటానికి ఒక ఆహ్వానం వచ్చింది. శేషేంద్రకు క్రీస్తుపూర్వం ఒకటో శతాబ్దంలో నివసించిన కాళిదాసు అంటే చాలా ఇష్టం. అందువల్ల తను కాళిదాసుపై ప్రసంగించాలని నిర్ణయించుకున్నాడు. మేము ఎథెన్స్‌కు ప్రయాణమయ్యాం. మమల్ని ఎయిర్‌పోర్టులో అన్నా డీ వారుస్, పెబ్లో అనే మా స్నేహితులు రిసీవ్ చేసుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎక్రోపోలిస్ కట్టడం ఎదురుగా ఉన్న ఒక హోటల్‌లో మమల్ని ఉంచారు. ఆ రోజు రాత్రి ప్లాజా కాపోలిలో డిన్నర్ చేశాం.. గోట్ చీజ్, ఆలీవ్స్ వంటి అనేక గ్రీకు వంటకాలతో రుచికరమైన భోజనం చేశాం. ఆ మర్నాడు ఉదయం మేమందరం కారులో డెల్ఫికి వెళ్లాలి.

ఉదయాన్నే నేను లేచి ఎక్రోపోలీస్ మీదుగా సూర్యోదయాన్ని చూశాను. నేను బయటకు వెళ్లేసరికి శేషేంద్ర నిద్ర లేవలేదు. నేను తిరిగి వచ్చి నావి, శేషేంద్రవి బట్టలు సర్దాను. ఈ లోపులో శేషేంద్ర లేచిన అలికిడి వినిపించింది. "త్వరగా లే.. మనం వెళ్లిపోవాలి" అని లోపలి నుంచి అరిచాను. బయటకు వచ్చి చూసేసరికి శేషేంద్ర లేవటానికి ఇబ్బంది పడుతున్నాడు. నాకు అలా ఎందుకు ఉన్నాడో అర్థం కాలేదు. తన దగ్గరకు వెళ్తే- "అప్పుడే ఉదయం అయిందా?" అని అడిగాడు. తనెందుకు అలా అడుగుతున్నాడో నాకు అర్థం కాలేదు. "కిటికీలో నుంచి సూర్యోదయం చూడు. ఎంత బావుందో.." అన్నా. తను వెంటనే- "నాకు కనిపించటం లేదు" అన్నాడు. నేను మరింత దగ్గరగా వెళ్లి శేషేంద్రను భుజాలు పట్టుకొని కుదిపి "ఏమైంది" అని అడిగాను. "ఏమో నాకు అర్థం కావటం లేదు.." అన్నాడు. "ఇంకొంచెం సేపు పడుకుంటావా" అని అడిగాను. "లేదు.. వెంటనే డాక్టర్ దగ్గరకు వెళ్లాలి.. నాకు ఏమి కనబడటం లేదు" అన్నాడు. నాకు గుండె ఆగినంత పనిఅయింది. ఒక్క క్షణం ఏం చేయాలో తెలియలేదు. వెంటనే తేరుకొని - నా స్నేహితు






రాలు అన్నాకు ఫోన్ చేసి- జరిగింది చెప్పా. ఆ రోజు మాతో డిల్ఫికి అన్నా కూడా రావాలి. అందుకోసం తను తయారవుతోంది. నేను చెప్పింది విన్న తర్వాత తను వెంటనే బయలుదేరి వచ్చేసింది. ఒక వైపు శేషేంద్రతో- "డాక్టర్ వస్తున్నాడు.. సుగర్ పెరిగి ఉంటుంది.. అంత కన్నా ఏం లేదు" అని చెబుతున్నా.. కానీ మరో వైపు

నా బుర్రలో- శేషేంద్రకు కళ్లు ఎందుకు కనిపించటం లేదు.. ఏదైనా పెద్ద జబ్బా.. తనకి కళ్లు కనిపించకపోతే- సెమినార్‌లో ఎలా మాట్లాడతాడు.."- ఇలా వెయ్యి ఆలోచనలు తలెత్తాయి. ఈ లోపులో అన్నా తలుపుకొట్టింది. లోపలికి వచ్చి- "ఎలా ఉన్నారు?" అని శేషేంద్రను పలకరించింది. శేషేంద్ర వెంటనే తనను డాక్టరు దగ్గరకు తీసుకువెళ్లమని అడిగాడు. రోడ్డు అవతల క్లినిక్స్ ఉన్నాయని అన్నా బదులుఇచ్చింది. మేము వెంటనే రోడ్డు అవతల ఉన్న క్లినిక్కు బయలుదేరాం.

క్లినిక్‌కు వెళ్లి డాక్టర్ కోసం వెయిట్ చేయటం మొదలుపెట్టాం. అరగంట.. గంట.. ఇలా సమయం గడుస్తోంది. కానీ డాక్టర్ రావటం లేదు. డాక్టర్ వచ్చి చూస్తే ఏం జరిగిందో తెలుస్తుందనే మా ఆత్రుత తను వాళ్లు పట్టించుకోవటం లేదు. ఇక లాభం లేదని అన్నా లోపలకి వెళ్లి గట్టిగా అరవటం మొదలుపెట్టింది. వెంటనే అక్కడ ఉన్న స్టాఫ్‌కు పరిస్థితి అర్థమయింది. వెంటనే మమల్ని డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్లారు. శేషేంద్ర కళ్లు పరీక్షించిన తర్వాత- డ్రాప్స్ రాసి ఇచ్చాడు. ప్రతి రోజు మూడు సార్లు వేయమన్నాడు. కంటి చూపు వస్తుందో రాదో- 'నో గ్యారంటీ' అన్నాడు. మేము రూమ్‌కు వచ్చేసరికి- మమల్ని డిల్ఫికి తీసుకువెళ్లటానికి పాల్వోస్ అనే మరో స్నేహితుడు వచ్చాడు. మేమందరం డెల్ఫికి ప్రయాణం ప్రారంభించాం. కానీ నా మనసులో రకరకాల ఆలోచనలు. మేము సురక్షితంగా హైదరాబాద్‌కు చేరుకుంటే చాలని దేవుడిని ప్రార్థించటం మొదలుపెట్టాను. డెల్ఫికి వెళ్లిన తర్వాత- శేషేంద్రకు ఆరోగ్యం బావుండకపోవటంతో- తన తరఫున నేను పార్టీలకు వెళ్లాల్సి వచ్చేది.

శేషేంద్ర ప్రసంగించాల్సిన రోజు రానే వచ్చింది. మొత్తం ఆడిటోరియం అంతా శ్రోతలతో నిండిపోయింది. శేషేంద్ర ప్రసంగ పాఠాన్ని గ్రీకు భాషలో అనువాదం చేయటానికి ముందే ఇచ్చాం. అయితే శేషేంద్ర చదవలేడు కాబట్టి అనర్గళంగా ప్రసంగించటం ప్రారంభించాడు. తన ప్రసంగానికి విపరీతమైన స్పందన వచ్చింది. అందరూ శేషేంద్రను చుట్టుముట్టారు. కొందరు మహిళలైతే శేషేంద్ర కట్టుకున్న పొందూరు ఖద్దరు పంచెను ముట్టుకొని మరీ చూశారు. వారికి - 'ఆ శారీ'- చాలా నచ్చింది. ఆ మర్నాడు మేము మళ్లీ అథెన్స్‌కు బయటదేరాం. మార్గ మధ్యంలో ఒక చిన్న నీటి ప్రవాహం కనిపించింది. అక్కడ నీళ్లు తాగి- భగవంతుడిని ఏదైనా కోర్కె కోరుకుంటే- అది తీరుతుందని స్థానికుల నమ్మకం. నేను శేషేంద్ర కళ్లు బాగుపడాలని దేవుడిని ప్రార్థించాను.. తనకు నయం అయితే మరో సారి గ్రీకు వస్తానని మొక్కాను. హైదరాబాద్‌కు వచ్చిన వెంటనే తిరుపతి, కాళహస్తికి వెళ్లాం. కాళహ



స్తిలో మా పూర్వీకులు కట్టించిన గుడి ఉంది. అక్కడకు వెళ్లి దేవుడిని ప్రార్థించాను. హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తర్వాత - శేషేంద్ర చూపు మెరుగుపడటం ప్రారంభమయింది. ఆ తర్వాత కొద్ది కాలానికి తనకు పూర్తిగా చూపు వచ్చేసింది.

ఆ తర్వాత ఏడాది మళ్లీ మేమిద్దరం గ్రీసుకు వెళ్లాం. అక్కడ యానిస్ రిటోస్, నికిఫోరస్ వ్రటకోస్ వంటి ప్రఖ్యాత రచయితలను కలుసుకున్నాం. యానిస్ రిటోస్ ఎంత పాపులర్ రచయిత అంటే- ఆయనను కలుసుకోవటానికి ఏడాది ముందు అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సి వచ్చింది. రెండో సారి వెళ్లినప్పుడే- శేషేంద్ర రాసిన 'నా దేశం నా ప్రజలు'- గ్రీకు అనువాదం విడుదలయింది. దీనికి నికిఫోరస్ వ్రటకోస్ ముందు మాట రాశారు. ఈ పర్యటనలోనే చెక్ రిపబ్లిక్ రాష్ట్రపతి అయిన ప్రముఖ రచయిత వకల్ హోవెల్‌ను కలుసుకున్నాం. ఆయన తాను రాసిన పుస్తకాలను సంతకం చేసి ఇచ్చారు.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

గ్రీసులో ప్రజలు నాటకాలకు మంచి ప్రాధాన్యత ఇస్తారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన అనేక నాటకాలు గ్రీకుభాషకు చెందినవే! నేను గ్రీసుకు వెళ్లినప్పుడు జరిగిన ఒక సంఘటన గురించి చెబుతాను. అక్కడ ఉన్న ఒక యాంఫీ థియేటర్‌లో ప్రపంచప్రఖ్యాతి చెందిన రచయిత అరిస్టోఫెన్ రాసిన 'బర్డ్స్ అనే నాటకాన్ని ప్రదర్శిస్తున్నారట. ప్రదర్శన జరుగుతుండగా హఠాత్తుగా వాన పడటం మొదలయిందిట. మన దగ్గర అయితే వాన పడితే నాటంక చూడకుండా చెల్లాచెదురు అయిపోతారు. కానీ అక్కడి ప్రేక్షకులు కదలకుండా ఆ నాటకాన్ని చూశారట. ఈ విషయం తెలిసి నాకు చాలా ఆశ్చర్యం అనిపించి- "వానను లెక్క చేయకుండా నాటకాన్ని ఎందుకు చూశారు?' అని నాటకానికి హాజరయిన ఒకరిద్దరిని అడిగాను. "వాన వస్తుంది.. పోతుంది.. కానీ బర్డ్స్ నాటకాన్ని చూసే అవకాశం చాలా అరుదుగా వస్తుంది" అని వారు చెప్పిన సమాధానం నాకు ఇప్పటికీ గుర్తుంది. అక్కడి వారు నాటకం పట్ల అంత శ్రద్ధను చూపిస్తే- సమావేశాలకు వెళ్లిన మన రచయితలు కొందరు మాత్రం - వాన పడే అవకాశం ఉందనే సాకుతో నాటకానికి వెళ్లనే లేదు!

అందర్నీ కడుపుబ్బా నవ్వించే డార్లింగ్



నిర్మాతలుగా 'హను-మాన్' చిత్రంతో సూపర్‌హిట్ అందుకున్నారు కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య. లేటెస్ట్‌గా ప్రియదర్శి, నభానటేశ్ జంటగా రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'డార్లింగ్' చిత్రాన్ని నిర్మించారు. 'వై దిస్ కొలవెరీ' అనేది ఉప శీర్షిక. అశ్వనీ రామ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత చైతన్య మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

'కపుల్స్ మధ్య జరిగే సంఘటనలని వినోదాత్మకంగా చూపించే ప్రయత్నమే ఈ సినిమా. యూత్, ఫ్యామిలీ ఇలా.ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకునేలా సినిమాను దర్శకుడు తీర్చిదిద్దారు. ఇందులో కథానాయకుడి పాత్ర చాలా అమాయకంగా.. కథానాయిక పాత్ర చలాకీగా ఉండాలి. ఈ పాత్రలకి ప్రియదర్శి, నభానటేశ్ సరిపోతారని అనిపించి వారిని తీసుకున్నాం. సినిమాలో ఇద్దరి క్యారెక్టర్లకీ సమ ప్రాధాన్యత ఉంటుంది. వినోదంతో పాటు భావోద్వేగాలని సమపాళ్లలో మిక్స్ చేసి తీసిన ఈ సినిమాలో.. హీరో హీరోయిన్ల మధ్యన వచ్చే సన్నివేశాలు అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. వివేక్ సాగర్ సంగీతం సినిమాకు స్పెషల్ హైలైట్. 'హను-మాన్'కు సీక్వెల్‌గా వస్తున్న 'జై హనుమాన్' సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉంది. ఈ సినిమాలో హనుమంతుడి పాత్రలో ఎవరు నటిస్తారనేది మాత్రం సస్పెన్స్" అని చెప్పారు.

అనాథలే స్టార్స్

సంజయ్ శ్రీరాజ్‌ను హీరోగా, ప్రియా శ్రీనివాస్ హీరోయిన్‌గా నటించిన 'గల్లీ గ్యాంగ్ స్టార్స్' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సినిమా గురించి దర్శకుడు ధర్మ మాట్లాడుతూ 'నెల్లూరులో చిత్రాన్ని నిర్మించాం. ఓ గల్లీలో నివసించే అనాథలు ఎదుర్కొనే సమస్యలను



చిత్రంలో వివరించాం' అని చెప్పారు. చిత్ర నిర్మాత డాక్టర్ అరవేటి యశోవర్ధన్ మాట్లాడుతూ 'క్రైమ్ డ్రామా చుట్టూ చిత్రకథ నడుస్తుంది. ఇందులో నాలుగు పాత్రలు ప్రముఖంగా ఉంటాయి. అనాథలైన వారి జీవితాలు ఎలా ఎవరి వల్ల మలుపు తిరిగిందో చూపించాం. మాస్ ఆడియన్స్‌కు నచ్చేసినిమా ఇది' అని చెప్పారు.

దర్శకధీరుడిపై డాక్యుమెంటరీ



దర్శకధీరుడు రాజమౌళిపై ఓ డాక్యుమెంటరీ తెరకెక్కుతోంది. రాఘవ్ ఖన్నా దర్శకత్వంలో 'ద మోడరన్ మాస్టర్స్' పేరుతో ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ డాక్యుమెంటరీని నిర్మిస్తోంది. ఆగస్టు 2న ఇది విడుదల కానుంది. దర్శకుడిగా రాజమౌళి ప్రయాణాన్ని.. ఆయన ఇండియన్ సినిమాపై చూపిన ప్రభావాన్ని ఇందులో చూపించనున్నారు. ఈ డాక్యుమెంటరీలో రాజమౌళి గురించి ఆయన బంధుమిత్రులు, దర్శకులు జేమ్స్ కామెరూన్, రుస్సో బ్రదర్స్, హీరోలు రానా, ప్రభాస్ తమ అభిప్రాయాలను తెలియజేయనున్నారు.

బడ్డీ హార్ట్ టచింగ్ సాంగ్



అల్లు శిరీష్ నటించిన తాజా చిత్రం 'బడ్డీ' ఈ నెల 26న విడుదల కానుంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని జ్ఞానవేల్ రాజా, అధన నిర్మిస్తున్నారు. శామ్ ఆంటోన్ దర్శకుడు. ఈ సినిమా నుంచి 'చూసాలే నాలో నీ కలనే.. దాచాలే దాచాలే నాలో ఆ కలనే' అంటూ సాగే ఈ హార్ట్ టచింగ్ సాంగ్‌ను సాయి హేమంత్ రాశారు. సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళ స్వరపరిచి ఐరా ఉడిపితో కలసి పాడారు. గాయత్రి భరద్వాజ్, అజ్మల్, అమీర్, ప్రిషా రాజేశ్ సింగ్, ముఖేశ్‌కుమార్ తదితరులు నటించిన ఈ చిత్రానికి నేహా జ్ఞానవేల్ రాజా సహ నిర్మాత.

ఆధారాలు సమర్పించండి..

హీరో రాజ్‌తరుణ్‌పై ఫిర్యాదు చేసిన మహిళకు నోటీసులు



సినీ హీరో రాజ్‌తరుణ్ తనను మోసగించాడంటూ ఫిర్యాదు చేసిన లావణ్య అనే మహిళకు నార్సింగ్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఆమె ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన ఆధారాలను విచారణ నిమిత్తం తమకు సమర్పించాలని నోటీసులో పేర్కొన్నారు. లావణ్య ఆధారాలు సమర్పిస్తేనే ఈ కేసు దర్యాప్తులో పురోగతి ఉంటుంది. లేదంటే కోర్టు అనుమతితో పోలీసులు కేసును చట్ట ప్రకారం మూసివేస్తారు.

శేఖర్ కమ్ముల చేతుల మీదుగా...



సాయితేజ కల్వకోట, పావని కరణమ్ జంటగా నటిస్తున్న చిత్రం 'పైలం పిలగా'. తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ హాస్యభరిత వ్యంగ్య చిత్రాన్ని యాడ్ ఫిల్మ్‌మేకర్ ఆనంద్ గుర్రం దర్శకత్వంలో రామకృష్ణ బొదుల నిర్మించారు.శుక్రవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'సోడు సోడు' పాటను డైరెక్టర్ శేఖర్ కమ్ముల లాంచ్ చేశారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ 'ఈ పాటకు మంచి సాహిత్యంతో పాటు ఆకట్టుకునే సంగీతం తోడైంది' అని చెప్పారు. 'పూర్తి స్థాయి కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రమిది" అని నిర్మాత రామకృష్ణ బొదుల తెలిపారు. ఈ పాటకు ఆనంద్ గుర్రం, అక్కల చంద్రమౌళి సాహిత్యం అందించగా, యశ్వంత్ నాగ్‌నారు సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: రవితేజ కుర్మన, డీఓపీ: సందీప్ బొద్దుల.

దిక్సూచి

ఇంజనీరింగ్ వెబ్ కౌన్సెలింగ్ జాగ్రత్తలు

తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించినకౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. టీజీఈఏపీ సెట్/ఏపీ ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంక్ వస్తే ఇబ్బంది ఏమీ లేదు. కోరుకున్న కాలేజీలో, అనుకున్న బ్రాంచీలో సులువుగా సీటు పొందవచ్చు. మధ్యస్థంగా ర్యాంకు వచ్చిన అభ్యర్థులకే కొన్ని ఇబ్బందులు ఉంటాయి. ఎలా చేస్తే, మంచి కాలేజీలో, కోరుకున్న బ్రాంచీలో సీటు వస్తుందన్నది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎదురయ్యే ప్రశ్న. ఈ విషయంలో నిపుణుల మాటేమిటో చూద్దాం.



ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ మొదలైనప్పుడు ఇరవై నుంచి ముప్పయ్ ఆప్షన్లు పెట్టుకుంటే చాలు అని ఎక్కువమంది విద్యార్థులు అనుకుంటారు. అయితే అది తప్పని కౌన్సెలింగ్ నిర్వాహకులు పదేపదే చెబుతున్నారు. నిజానికి వందల కొద్దీ ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఉంది. అలాంటప్పుడు కేవలం కొన్ని ఆప్షన్లు మాత్రమే పెట్టుకుంటే, నష్టం జరిగే అవకాశమే ఎక్కువ. ముఖ్యంగా పెద్ద సంఖ్యలో ర్యాంకు వచ్చినప్పుడు విద్యార్థులు కనీసం రెండు, మూడు వందలు, వీలైతే అంతకన్నా ఎక్కువ ఆప్షన్లు పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తప్పకుండా వస్తాయన్న వాటికితోడు, అటూ ఇటూగా రావడానికి అవకాశం బాగా ఉన్న కాలేజీలు, బ్రాంచీలను కూడా ఎంచుకోవాలి. ప్రత్యేకించి మనకు రాదనుకున్న బ్రాంచ్ లేదా కాలేజీకి ఎవరూ ఆప్షన్ పెట్టుకోని పక్షంలో పరిస్థితి అనుకూలిస్తే మనకే దక్కవచ్చు.

అవకాశం ఒక్కసారే: ర్యాంక్ పెద్ద సంఖ్యలో వచ్చినప్పటికీ మంచి కాలేజీలు, కోర్సుల విషయంలో రాజీ పడాల్సిన పని లేదు. మనకు నచ్చిన కాలేజీ లేదంటే కోర్సు నుంచి ఆప్షన్లు ఆరంభించవచ్చు. ర్యాంకుల ఆధారంగా మాత్రమే సీట్ల కేటాయింపు ఉంటుంది. అంటే మొదటి ర్యాంక్ తరవాత రెండో ర్యాంక్ క్యాండిడేట్ ఇచ్చుకున్న ఆప్షన్ల ఆధారంగా అలాట్‌మెంట్ ఉంటుంది. ఉదాహరణకు వందో ర్యాంక్ వచ్చిన అభ్యర్థి ప్రత్యేకించి నచ్చిన కాలేజీలను తనిష్టం వచ్చిన రీతిలో పెట్టుకున్నాడని అనుకుందాం. ఆ అభ్యర్థికి ఆర్డర్ ఆఫ్ మెరిట్ ప్రకారం సీటు కేటాయింపు జరుగుతుంది. అంటే ఆ వ్యక్తిని వందో అభ్యర్థిగా పరిగణిస్తుంది. తనకు ముందున్న 99 మందికి సీట్ల కేటాయింపు పూర్తయ్యాక ఇతని వంతు వస్తుంది. అప్పుడు సీటు కేటాయింపు ఆ వ్యక్తి పెట్టుకున్న మొదటి ఆప్షన్ నుంచి ఆరంభమవుతుంది. ఆప్షన్ నెంబర్ 1, 2, 3.. అలా మొదలవుతుంది. ఆప్షన్ 30 దగ్గర క్లిక్ కావచ్చు. లేదంటే 200 వద్ద క్లిక్ కావచ్చు. ఆ ఆప్షన్‌గా పెట్టుకున్న కాలేజీ, కోర్సులో సీటు లభిస్తుంది. వందో వ్యక్తిగా మాత్రమే ఆ అభ్యర్థికి కేటాయింపు ఆరంభమవుతుంది. ముఖ్యంగా ఈ వెబ్ కౌన్సెలింగ్‌లో గరిష్ఠంగా ఆప్షన్లకు అవకాశం ఇవ్వడం అందుకోసమేనని గుర్తించాలి. అసలు ఒక్కరూ ఆప్షన్ పెట్టుకోనందున కొన్ని సీట్లు విగిలిపోయాయని చెబుతూ ఉంటారు. అలాగే ఒక్కరు కూడా చేరని కాలేజీలు లేదా బ్రాంచీల వివరాలను కౌన్సెలింగ్ నిర్వాహకులు అధికారికంగానే ప్రకటిస్తుంటారు. ఆ కాలేజీలు లేదా ఆ గ్రూపులు కొన్ని అంత డిమాండ్ లేనివి కావచ్చు. అలాగే డిమాండ్ ఉన్నప్పటికి రాదని కొందరు ఆప్షన్లుగా ఇచ్చుకుని ఉండకపోవచ్చు. కారణం ఏమైనా ఆ సీట్లు మొదటి రౌండ్‌లో మిగిలిపోయాయన్నది వాస్తవం.

మొదటి అవకాశమే మంచిది: ఇలాంటి వెబ్ కౌన్సెలింగ్‌లో తొలి ఎంపికే కీలకం. రెండోసారి కౌన్సెలింగ్‌కు అవకాశం ఇచ్చినప్పటికీ, అప్పుడు ఛాన్స్‌లు తక్కువ. కేవలం మిగిలిన సీట్లకు మాత్రమే పోటీపడాల్సి వస్తుంది. అందువల్ల మొదటి కౌన్సెలింగ్ సమయంలోనే కొద్దిగా తెలివిగా వ్యవహరించాలి.

లాస్ట్ ఇయర్ కటాఫ్ చూడాలి: కాలేజీలు, సీట్లవారీగా గత ఏడాది కేటాయింపు సమాచారం చూస్తే మంచిది. అయితే ఇది కేవలం గైడింగ్ ఫ్యాక్టర్ మాత్రమే. ఈ ఏడాది కూడా అదే మాదిరిగా కేటాయింపు జరగాలని లేదు. ప్రత్యేకించి ప్రసిద్ధ కాలేజీల్లో మాత్రం ర్యాంకింగ్‌లో కొద్దిగా అటూ ఇటూగా మాత్రమే మారుతుంది.



ప్రొఫెసర్ ఎస్.వి.రమణారావు
రాయపూర్ ఎన్ఐటి డైరెక్టర్

ఆంధ్రప్రదేశ్
ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 7 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 10 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 12
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 13
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 16
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 17 - 22
- **తరగతులు ప్రారంభం:** జూలై 19 నుంచి
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in/

తెలంగాణ
ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 12 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 6 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 15 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 15
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 19
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 19 - 23
- **వెబ్‌సైట్:** tgeapcet.nic.in

జయశంకర్ వర్సిటీలో పాలిసెట్ ప్రవేశాలు

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- వ్యవసాయ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. తెలంగాణ పాలిసెట్ 2024 (అగ్రికల్చర్ స్ట్రీమ్) ర్యాంక్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో 260 సీట్లు, అనుబంధ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 540 సీట్లు ఉన్నాయి. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివిన విద్యార్థులకు ప్రతి ప్రోగ్రామ్‌లో 60 శాతం సీట్లు కేటాయించారు. ఇప్పటికే ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి.

కౌన్సెలింగ్ షెడ్యూల్: తెలంగాణ పాలిసెట్ 2024(అగ్రికల్చర్ స్ట్రీమ్)లో 447 నుంచి 19998 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 10న, 20015 నుంచి 46924 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 11న, 47062 నుంచి 68151 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 12న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. కౌన్సెలింగ్ ప్రక్రియ ఉదయం తొమ్మిదిన్నరకు ప్రారంభమౌతుంది.

- **కౌన్సెలింగ్ వేదిక:** యూనివర్సిటీ ఆడిటోరియం, పీజేటీఎస్ఏయూ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్
- **ఎంపికైన అభ్యర్థులు చెల్లించాల్సిన ఫస్ట్ సెమిస్టర్ ఫీజు:** యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో రూ.19,460; ప్రైవేట్ అనుబంధ కళాశాలల్లో రూ.22,210.
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/DcuZeEgలో చదవండి.

న్యూట్రిషన్, ఓటీసీ వ్యాపారం బలోపేతంపై



డాక్టర్ రెడ్డీస్ ఫోకస్

వ్యాక్సిన్లు, కీలక మాలిక్యూల్స్ కోసం భాగస్వామ్యాలు

2023-24 వార్షిక నివేదికలో వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ లేబొరేటరీస్.. వచ్చే ఐదేళ్ల కాలంలో తన ఔషధ పోర్టుఫోలియోను మరింత పటిష్ఠం చేసుకునేందుకు సన్నాహాలు చేస్తోంది. 2029-30 ఆర్థిక సంవత్సరం నాటికి భారత్‌లో ఓవర్ ది కౌంటర్ (ఓటీసీ) వ్యాపారాన్ని బలోపేతం చేయటంతో పాటు వ్యాక్సిన్లు, కీలకమైన మాలిక్యూల్స్ కోసం కొత్త భాగస్వామ్యాలను ఏర్పాటు చేయటంపై దృష్టి పెట్టనున్నట్లు డాక్టర్ రెడ్డీస్ తన 2023-24 వార్షిక నివేదికలో వెల్లడించింది. భవిష్యత్ హెల్త్‌కేర్ ట్రెండ్స్‌కు తగ్గట్టుగా ఆయా ప్రాంతాలకు ప్రాధాన్యతను ఇవ్వటంతో పాటు అందుకు అనుగుణంగా వ్యాపార విధానాలను రూపొందించనున్నట్లు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ చైర్మన్ కే సతీష్ రెడ్డి, సంస్థ కో చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ వార్షిక నివేదికలో వెల్లడించారు. ఇందులో భాగంగానే ఇప్పటికే కీలకమైన మాలిక్యూల్స్ (ఎన్‌సీఈ, ఎన్‌బీఈ, కార్-టీ), డిజిటల్ థెరాప్యుటిక్స్ (వేరబుల్స్, యాప్స్), కన్స్యూమర్ హెల్త్‌కేర్ (న్యూట్రిషన్, ఓటీసీ వెల్‌నెస్)పై పెట్టుబడులు పెట్టడం ప్రారంభించినట్లు వారు పేర్కొన్నారు. భవిష్యత్‌లో కంపెనీ మరింత వృద్ధి పథంలోకి సాగటానికి ఇవి కీలకంగా ఉంటాయని భావిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నెస్లే ఇండియాతో కలిసి జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయటం కూడా ఇందులో భాగమేనని వారన్నారు. నెస్లే భాగస్వామ్యంతో అంతర్జాతీయంగా పేరొందిన న్యూట్రిషనల్ హెల్త్ సొల్యూషన్స్‌ను డాక్టర్ రెడ్డీస్ భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ భాగస్వామ్యం భారత్‌లో కంపెనీ న్యూట్రిషన్, ఓటీసీ వ్యాపారాన్ని మరింత బలోపేతం చేస్తుందని డాక్టర్ రెడ్డీస్ అంచనా వేస్తోంది. అంతేకాకుండా రానున్న రోజుల్లో మరిన్ని బలమైన భాగస్వామ్యాలను ఏర్పాటు చేయటంతో పాటు కొత్తగా పెట్టుబడులు పెట్టడం ద్వారా దీర్ఘకాలంలో కంపెనీ పోర్టుఫోలియోను పటిష్ఠం చేసుకోవాలని భావిస్తోంది.

ఐదేళ్లలో 150 కోట్ల మంది రోగులకు దరి చేరేలా: 2029-30 ఆర్థిక సంవత్సరం నాటికి 150 కోట్ల మంది రోగులకు తమ ఔషధాలు దరి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ప్రస్తుతం 70.4 కోట్ల మంది రోగులకు కంపెనీ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. కాగా కంపెనీ కీలక వ్యాపారాలైన యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ), జెనరిక్స్ బ్రాండెడ్ జెనరిక్స్, బయోసిమిలర్స్ విభాగాలను మరింత పటిష్ఠం చేయనున్నట్లు పేర్కొంది.

త్వరలో యూఎస్ మార్కెట్లోకి రిటుక్సిమాబ్ బయోసిమిలర్: రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, ప్రాణాంతక లింఫోసైటిక్ లుకేమియా వ్యాధి చికిత్సలో వినియోగించే రిటుక్సిమాబ్ బయోసిమిలర్‌ను అమెరికా మార్కెట్లోకి త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ఈ ఔషధానికి సంబంధించి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ) నుంచి కంప్లీట్ రెస్పాన్స్ లెటర్ అందుకున్నట్లు తెలిపింది. అంతేకాకుండా ఎఫ్‌డీఏ లేవనెత్తిన అన్ని అంశాలను నిర్దేశిత సమయంలోపు పూర్తి చేయనున్నట్లు పేర్కొంది.

అంకాలజీ పోర్టుఫోలియోపై దృష్టి: వర్ధమాన దేశాల మార్కెట్లో మరింతగా పట్టును చేజిక్కించుకునే ఉద్దేశంతో అంకాలజీ, బయోసిమిలర్స్ విభాగంలో కొత్త ఔషధాలను విడుదల చేయటంతో పాటు ప్రస్తుత ఉత్పత్తుల మార్కెటింగ్‌పై దృష్టిని కేంద్రీకరించనున్నట్లు డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. ఇందులో భాగంగానే క్యాన్సర్ ఔషధం టోరిపాలిమాబ్‌ను భారత మార్కెట్లోకి తీసుకువచ్చేందుకు ఇక్కడి నియంత్రణ సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. అలాగే రష్యా, చైనా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా మార్కెట్లలో కార్యకలాపాలను విస్తరించటంపై దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించింది.

6 నెలల్లో రూ.87,400 కోట్లు

ఈ ఏడాది ప్రథమార్ధంలో ప్రమోటర్ల వాటాల విక్రయ విలువ

ఐదేళ్లలో ఇదే అత్యధికం: కోటక్



ముంబై: లిస్టెడ్ కంపెనీల్లో ప్రమోటర్లు వాటాలు విక్రయించే ట్రెండ్ ఊపందుకుంది. ఈ ఏడాది ప్రథమార్ధం (జనవరి-జూన్)లో 37 కంపెనీల ప్రమోటర్లు 10.5 బిలియన్ డాలర్ల (1,050 కోట్ల డాలర్లు=రూ.87,400 కోట్లు) విలువైన షేర్లను విక్రయించారని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తాజా నోట్‌లో వెల్లడించింది. ఐదేళ్లలో ఇదే అత్యధికమని రిపోర్టులో పేర్కొంది. ఈ ఏడాది టీసీఎస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో), ఇండస్ టవర్స్, ఎంఫసిస్ ప్రమోటర్ల వాటాల విక్రయాలే మొత్తం విలువలో దాదాపు సగానికి సమానమని తెలిపింది. అంతేకాదు, ఈ ఏడాదిలో ప్రమోటర్ల వాటాల విక్రయాలు 2023లో నమోదైన 12.4 బిలియన్ డాలర్ల (రూ.లక్ష కోట్లు) స్థాయిని మించిపోవచ్చని అంటోంది.

తగ్గిన ప్రమోటర్ల వాటాలు

గత ఏడాది డిసెంబరు చివరినాటికి బీఎస్ఈ 200 సూచీలోని కంపెనీల్లో ప్రమోటర్ల వాటా 42.1 శాతంగా నమోదు కాగా.. ఈ ఏడాది మార్చి త్రైమాసికం చివరినాటికల్లా 38.8 శాతానికి తగ్గిందని కోటక్ నివేదిక తెలిపింది. అయితే, ఈ కంపెనీల్లో ప్రమోటర్లు విక్రయించిన షేర్లలో చాలావరకు వాటాను దేశీయ మ్యూచువల్ ఫండ్స్ దక్కించుకున్నాయని వెల్లడించింది.

ప్రమోటర్ల వాటాల విక్రయాలకు కారణాలు

- స్టాక్ మార్కెట్ ర్యాలీతో కంపెనీలో వారి వాటా విలువ గణనీయంగా పెరగడం
- వ్యాపార విస్తరణ అవసరాలు
- సెబీ విధించిన కనీస పబ్లిక్ వాటా నిబంధనలు
- రుణ భారం తగ్గించుకునేందుకు..
- ప్రమోటర్ కుటుంబ హోల్డింగ్స్‌లో సర్దుబాటు
- వ్యక్తిగత అవసరాలు
- వ్యూహాత్మక వాటా సర్దుబాట్లు

ఆందోళనకరమా..?

కంపెనీలో ప్రమోటర్ అధిక వాటా కలిగి ఉండటం ఆ కంపెనీపై విశ్వాసానికి ప్రతీక. అయితే, ఆధునిక ఆర్థిక ప్రపంచంలో అవసరాలతో పాటూ వ్యూహాలూ మారుతున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు. చాలా వరకు ప్రమోటర్లు వాటా విక్రయించిన సందర్భాల్లో ఆ వాటాలను దేశీయ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లే కొనుగోలు చేశారు. అది మార్కెట్లో కంపెనీకి సానుకూల సంకేతమే అవుతుందని ఆనంద్ రాఠీ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ డైరెక్టర్, ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్ హెడ్ ప్రశాంత్ రావు అన్నారు. ప్రమోటర్లు స్వల్ప మొత్తంలో (4-5 శాతం) వాటాలు విక్రయించడం ఆ కంపెనీ భవిష్యత్ పట్ల ఆందోళన చెందాల్సిన విషయమేమీ కాదని అన్నారు.

శ్రీరామ్ లైఫ్ నుంచి డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్

ప్రైవేట్ రంగంలోని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ తమ కస్టమర్లకు రిటైర్మెంట్ అనంతరం సైతం నిలకడగా ఆదాయం అందించడం లక్ష్యంగా డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్‌ను తీసుకువచ్చింది. ఏడాదికి రూ.60,000 నుంచి యాన్యుటీ ప్లాన్ ప్రారంభం అవుతుంది. ప్లాన్‌లో చేరడానికి ఎంట్రీ వయోపరిమితి 40-75 సంవత్సరాలు. డిఫర్ కాలపరిమితి 5-10 సంవత్సరాలుంటుంది. ఆ తర్వాత యాన్యుటీ చెల్లింపులు ప్రారంభమవుతాయి. ఈ ప్లాన్ కొనుగోలు ధరపై రాబడి (రిటర్న్ ఆన్ పర్చేజ్ ప్రైస్) ప్రయోజనం అందిస్తుంది. దీనివల్ల ప్రారంభ సమయంలోనే ఏదైనా ఊహించి ప్రాణాంతక వ్యాధికి గురైనా లేదా మరణించినా పెట్టుబడికి రక్షణ కలుగుతుంది.

డిఫర్మెంట్ గడువు ముగిసిన అనంతరం పాలసీదారుడు గుండెపోటుకు గురైనా లేదా మరణించినా ఆ వ్యక్తి ఇన్వెస్ట్ చేసిన మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందచేస్తారు. డిఫర్మెంట్ కాలంలో మరణించినట్టయితే మొత్తం కొనుగోలు ధరపై 125 శాతం డెత్ బెనిఫిట్‌గా అందచేస్తారు.

అదానీ వర్సెస్ బిర్లా



ఈ రెండు గ్రూప్‌ల మధ్య సి'మంట'

వ్యాపార విస్తరణ, మార్కెట్‌పై పట్టు కోసం దక్షిణాదిలో పోటాపోటీగా కంపెనీల కొనుగోళ్లు

దేశీయ సిమెంట్ రంగంలో గడిచిన కొన్నేళ్లలో కొనుగోళ్లు, టేకోవర్ల ట్రెండ్ ఊపందుకుంది. ముఖ్యంగా దక్షిణాదిలో కొనుగోళ్ల విషయంలో ప్రధానంగా రెండు కంపెనీల మధ్యనే పోటీ నడుస్తోంది. ఒకటి గౌతమ్ అదానీకి చెందిన అదానీ సిమెంట్స్, మరొకటి కుమార మంగళం బిర్లాకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్. వ్యాపార విస్తరణతో పాటు మార్కెట్‌పై పట్టుకోసం ఇరు వర్గాలు పోటాపోటీగా దక్షిణాదిలోని సిమెంట్ కంపెనీలను కొనుగోలు చేస్తున్నాయి. అల్ట్రాటెక్ ఈ మధ్యనే ఇండియా సిమెంట్స్‌లో 23 శాతం వాటాను రూ.1,900 కోట్లకు కొనుగోలు చేయగా.. అంతకు కొన్ని వారాల క్రితం అదానీ సిమెంట్‌లో భాగమైన అంబుజా సిమెంట్.. హైదరాబాద్‌కు చెందిన పెన్నా సిమెంట్‌లో 100 శాతం వాటాను రూ.10,420 కోట్లకు చేజిక్కించుకుంది. అంతకంటే ముందే అల్ట్రాటెక్.. టీకే బిర్లా గ్రూప్‌నకు చెందిన కేశోరామ్ సిమెంట్‌ను హస్తగతం చేసుకుంది. బిర్లాకు చెందిన అల్ట్రాటెక్ దేశంలోనే అతిపెద్ద సిమెంట్ కంపెనీగా ఉంది. కాగా, స్విట్జర్లాండ్‌కు చెందిన సిమెంట్ దిగ్గజం హోల్సిమ్ నుంచి అంబుజా సిమెంట్స్, ఏసీసీలో మెజారిటీ వాటాను 1,050 కోట్ల డాలర్లకు కొనుగోలు చేయడం ద్వారా 2022లో అదానీ గ్రూప్ సిమెంట్ తయారీ రంగంలోకి ప్రవేశించింది. తద్వారా దేశంలో రెండో అతిపెద్ద సిమెంట్ కంపెనీగా అవతరించింది. అప్పటి నుంచే మార్కెట్‌లో అగ్రస్థానం కోసం బిర్లా, అదానీ మధ్య పోటీ ప్రారంభమైంది. అది సిమెంట్ రంగంలో కొనుగోళ్లు, విలీనాల ట్రెండ్‌కు బాటలు వేసింది. ఉత్పత్తి సామర్థ్యంతోపాటు మార్కెట్ వాటా పెంపు కోసం ఈ రెండు కంపెనీలు వ్యూహాత్మక కొనుగోళ్లకు పాల్పడుతున్నాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు.

ఓరియంట్ సిమెంట్‌పై బిర్లా కన్ను: కుమార మంగళం బిర్లా తన బంధువైన సీకే బిర్లాకు చెందిన ఓరియంట్ సిమెంట్‌ను సైతం కొనుగోలు చేసేందుకు చర్చలు కొనసాగిస్తున్నట్లు తెలిసింది. దక్షిణ, పశ్చిమ భారత మార్కెట్లపై ముఖ్యంగా తెలంగాణ, మహారాష్ట్రలో మరింత పట్టుసాధించేందుకు అల్ట్రాటెక్‌కు ఈ డీల్ దోహదపడనుంది. ఓరియంట్ సిమెంట్‌కు ఒక్కో షేరుకు రూ.350-375 వరకు చెల్లించేందుకు అల్ట్రాటెక్ ముందుకొచ్చిందని, ఈ లెక్కన ఓరియంట్ మార్కెట్ విలువ రూ.7,300-7,800 కోట్లవుతుందని ఓ ఆంగ్ల దినపత్రిక కథనం పేర్కొంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,800 ▲	67,650 ▲	99,300 ▲
ముంబై	72,640 ▲	66,538 ▲	90,709

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక్ 100 గుడ్లు)

7వ తేదీ

హైదరాబాద్	525	విజయవాడ	545
వరంగల్	527	గోదావరి	545
చిత్తూరు	573	విశాఖపట్నం	560
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	114	విజయవాడ	123
వరంగల్	114	గుంటూరు	123
కరీంనగర్	114	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	127
కర్నూలు	114	నెల్లూరు	127
విశాఖపట్నం	124	అనంతపురం	123
గోదావరి	123		

ఐసీఐసీఐ లొంబార్డ్ ఎలివేట్

ఏఐ పవర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్‌ను ప్రవేశపెట్టిన సంస్థ

సాధారణ బీమా సేవల సంస్థ ఐసీఐసీఐ లొంబార్డ్ ఇండస్ట్రీలో తొలిసారిగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత హెల్త్ ఇన్సూరెన్స్ పథకం 'ఎలివేట్'ను ప్రవేశపెట్టింది. ఆధునిక ఫీచర్లు, యాడ్-ఆన్స్‌తో కూడిన ఈ ప్లాన్.. ఆధునిక జీవనశైలి, ఊహించని వైద్య అత్యవసరాలు, పెరుగుతున్న వైద్య ఖర్చులు వంటి అవసరాలను తీర్చేలా పాలసీదారులకు వ్యక్తిగత పరిష్కారాలను అందించనుందని కంపెనీ పేర్కొంది. పరిమితి లేని సమ్ ఇన్స్యూర్డ్, క్లెయిమ్ అమౌంట్, అస్యూరెన్స్‌తో పాటు పవర్ బూస్టర్ యాడ్-ఆన్, రీసెట్ బెనిఫిట్ వంటి ఫీచర్లు ఈ పథకానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని ఐసీఐసీఐ లొంబార్డ్ వెల్లడించింది.

ఏజిస్ ఫెడరల్ లైఫ్ గోల్డెన్ ఇయర్స్ పెన్షన్ ప్లాన్

ఏజిస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్.. సరికొత్త పెన్షన్ ఫండ్‌ను తీసుకువచ్చింది. బ్లూచిప్ పెన్షన్ ఫండ్‌తో కలిపి గోల్డెన్ ఇయర్స్ పెన్షన్ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. పదవీ విరమణ అనంతరం పాలసీదారుల భవిష్యత్ ఆర్థిక అవసరాలను తీర్చే విధంగా ఈ ప్లాన్‌ను రూపొందించినట్లు వెల్లడించింది. ఇది యూనిట్ లింక్డ్, నాన్-పార్టిసిపేటింగ్, ఇండివిడ్యువల్ ప్లాన్. క్లాసిక్, గోల్డెన్ వేవర్ ప్రీమియం ఆప్షన్స్‌తో పాలసీదారులు ఈ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. అలాగే మంచి ట్రాక్ రికార్డు కలిగిన బ్లూచిప్ స్టాక్స్‌తో పాటు మెరుగైన రిటర్నులు అందిస్తున్న షేర్లలో బ్లూచిప్ పెన్షన్ ఫండ్ ద్వారా పెట్టుబడులు పెట్టనుంది.

స్పోర్ట్స్

తొలి టీ20లో భారత్ ఓటమి

చాంపియన్లకు ఝలక్

నేడే రెండో మ్యాచ్

సాయంత్రం 4.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



రజా (3/25)

జింబాబ్వే ఘన విజయం

హరారే: టీ20 వరల్డ్‌కప్ టైటిల్ జోష్‌లో ఉన్న టీమిండియాకు బలహీన జింబాబ్వే గట్టి షాకే ఇచ్చింది. తమ బ్యాటర్లు విఫలమైనా.. స్వల్ప స్కోరును కాపాడుకునే క్రమంలో ఆతిథ్య జట్టు బౌలర్లు చిరస్మరణీయ ప్రదర్శన కనబర్చారు. అంతేనా.. మెరుపు ఫీల్డింగ్‌తోనూ ఆకట్టుకోగలిగారు. దీంతో అంతగా అంతర్జాతీయ అనుభవం లేని గిల్ సేన 13 పరుగుల తేడాతో ఓడింది. పొట్టిఫార్మాట్‌లో అజేయంగా దూసుకెళుతున్న భారత జట్టుకు ఈ ఏడాదిలో ఇదే తొలి ఓటమి. ఐపీఎల్‌లో దుమ్మురేపిన ఆటగాళ్లు ఇక్కడ పూర్తిగా తేలిపోగా.. అటు జింబాబ్వేలో ఆరుగురు బౌలర్లు కూడా వికెట్లు తీయడం విశేషం. వీరి ధాటికి 8మంది భారత బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట భారత బౌలర్లు సత్తా చాటడంతో జింబాబ్వే 20 ఓవర్లలో 9 వికెట్లకు 115 రన్స్ చేసింది. క్లైవ్ మదండె (29 నాటౌట్), డియాన్ మైర్స్ (23), బెన్నెట్ (22), మధెవెరె (21) రాణించారు. స్పిన్నర్లు రవి బిష్ణోయ్‌కు 4, వాషింగ్టన్ సుందర్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 19.5 ఓవర్లలో 102 రన్స్‌కే కుప్పకూలింది. కెప్టెన్ గిల్ (31), సుందర్ (27), అవేశ్ (16) మినహా అంతా నిరాశపరిచారు. చటార, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజాలకు మూడేసి వికెట్లు దక్కాయి. భారత్ నుంచి రియాన్ పరాగ్, అభిషేక్ శర్మ, ధ్రువ్ జురెల్ అరంగేట్రం చేశారు.



గిల్

తేలిపోయారు: 116 పరుగుల లక్ష్య ఛేదనే కావడంతో భారత్ అవలీలగా గెలుస్తుందనుకున్నా.. బరిలోకి దిగిన బ్యాటర్లు అనూహ్యంగా తడబడ్డారు. జింబాబ్వే బౌలర్లను ఎదుర్కొనే క్రమంలో పేలవ షాట్లకు మూల్యం చెల్లించుకున్నారు. తొలి ఐదు ఓవర్లలోనే అభిషేక్ (0), రుతురాజ్ (7), పరాగ్ (2), రింకూ (0) పెవిలియన్ చేరడంతో జట్టు 22/4 స్కోరుతో కష్టాల్లో పడింది. ఓవైపు గిల్ పోరాడాలని చూసినా మరో ఎండ్‌లో సహకారం లేకపోయింది. తొలి 7 ఓవర్లలో జట్టు 30 డాట్ బాల్స్ ఆడిందంటేనే పరుగుల వేటలో ఎలా వెనుకబడిందో అర్థం చేసుకోవచ్చు. ఇక, 11వ ఓవర్‌లో గిల్ వెనుదిరగడంతో జట్టు కోలుకోలేకపోయింది. ఆఖర్లో అవేశ్, సుందర్ పోరాటం ఫలితాన్నివ్వలేకపోయింది.

టీ20ల్లో తక్కువ స్కోరుకే ఆలౌటవడం గత ఎనిమిదేళ్లలో భారత్‌కిదే తొలిసారి.

1 టీ20ల్లో భారత్‌పై తక్కువ స్కోరును కాపాడుకున్న జట్టుగా జింబాబ్వే. అలాగే టీమిండియా వరుస 12 టీ20 విజయాలకు బ్రేక్ పడింది.

స్పిన్నర్లు కట్టడి చేశారు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వేను స్పిన్నర్లు బిష్ణోయ్, సుందర్ సమర్థవంతంగా అడ్డుకున్నారు. అయితే రెండో ఓవర్‌లోనే వికెట్ కోల్పోయినా.. బెన్నెట్, ఓపెనర్ మధెవెరె నిలకడగా ఆడడంతో పవర్‌ప్లేలో జట్టు 40/2 స్కోరుతో నిలిచింది. కానీ ఆ తర్వాత స్పిన్నర్ల ధాటికి పరుగుల కోసం ఇబ్బంది పడక తప్పలేదు. మిడిలార్డర్‌లో మైర్స్, రజా (17) ఎక్కువసేపు నిలవలేకపోయారు. చివర్లోనూ బిష్ణోయ్ జోరు చూపి 2 వికెట్లు తీశాడు. అయితే ఆఖరి వికెట్‌కు చటార (0 నాటౌట్) సహకారంతో మదండె అజేయంగా జోడించిన 25 రన్స్ వీరి గెలుపులో కీలకంగా మారాయి. కాగా, రెండో మ్యాచ్ ఆదివారమే జరుగనుంది.

స్కోరుబోర్డు

జింబాబ్వే: మధెవెరె (బి) బిష్ణోయ్ 21; ఇన్నోసెంట్ (బి) ముకేశ్ 0; బెన్నెట్ (బి) బిష్ణోయ్ 22; సికందర్ రజా (సి) బిష్ణోయ్ (బి) అవేశ్ 17; మైర్స్ (సి అండ్ బి) సుందర్ 23; క్యాంప్‌బెల్ (రనౌట్) 0; మదండె (నాటౌట్) 29; మసకద్జ (స్టంప్) జురెల్ (బి) సుందర్ 0; జోంగ్వే (ఎల్బీ) బిష్ణోయ్ 1; ముజరబాని (బి) బిష్ణోయ్ 0; చటార (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 20 ఓవర్లలో 115/9. వికెట్ల పతనం:** 1-6, 2-40, 3-51, 4-74, 5-74, 6-89, 7-89, 8-90, 9-90. **బౌలింగ్:** ఖలీల్ 3-0-28-0; ముకేశ్ 3-0-16-1; బిష్ణోయ్ 4-2-13-4; అభిషేక్ 2-0-17-0; అవేశ్ 4-0-29-1; సుందర్ 4-0-11-2.

భారత్: అభిషేక్ (సి) మసకద్జ (బి) బెన్నెట్ 0; గిల్ (బి) రజా 31; రుతురాజ్ (సి) ఇన్నోసెంట్ (బి) ముజరబాని 7; పరాగ్ (సి సబ్) మవుటా (బి) చటార 2; రింకూ (సి) బెన్నెట్ (బి) చటార 0; జురెల్ (సి) మధెవెరె (బి) జోంగ్వే 6; సుందర్ (సి) ముజరబాని (బి) చటార 27; బిష్ణోయ్ (ఎల్బీ) రజా 9; అవేశ్ (సి) రజా (బి) మసకద్జ 16; ముకేశ్ (బి) రజా 0; ఖలీల్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 19.5 ఓవర్లలో 102 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-0, 2-15, 3-22, 4-22, 5-43, 6-47, 7-61, 8-84, 9-86, 10-102. **బౌలింగ్:** బెన్నెట్ 1-1-0-1; మసకద్జ 3-0-15-1; చటార 3.5-1-16-3; ముజరబాని 4-0-17-1; జోంగ్వే 4-0-28-1; సికందర్ రజా 4-0-25-3.

ఆసియాకప్ జట్టులో అరుంధతి



ముంబై: మహిళల టీ20 ఆసియాకప్ బృందంలో తెలుగు క్రికెటర్ అరుంధతి రెడ్డికి చోటు దక్కింది. ఈనెల 19 నుంచి శ్రీలంకలో జరిగే ఈ టోర్నీలో ఆడే భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. 15 మందితో కూడిన భారత బృందానికి హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహించనుంది. డిఫెండింగ్ చాంపియన్ భారత్ తొలి మ్యాచ్‌ను 19న పాకిస్థాన్‌తో, 21న యూఏఈతో, 23న నేపాల్‌తో ఆడనుంది. భారత్ ఈ ట్రోఫీని ఇప్పటిదాకా ఏడుసార్లు గెలవడం విశేషం.

మహిళల రెండో టీ20 నేడు
భారత్ X దక్షిణాఫ్రికా
రాత్రి 7 గం. నుంచి స్పోర్ట్స్ 18లో

నాలుగో ర్యాంకర్‌కు

షాకిచ్చి..



కెనడా ఓపెన్ సెమీస్‌లో రజావత్

కాల్గెరీ (కెనడా): భారత యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ కెనడా ఓపెన్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. క్వార్టర్స్‌లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ ఆండర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)కు షాకిచ్చి సంచలనం సృష్టించాడు. 39వ ర్యాంకరైన రజావత్ 21-11, 17-21, 21-19తో ఆంటోన్సెన్‌పై నెగ్గాడు. మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో గాయత్రీ-ట్రీసా జాలీ జోడీ ఓటమిపాలైంది.

స్పానిష్ గ్రాండ్ ప్రీ విజేత వినేశ్

మాడ్రిడ్: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ ఒలింపిక్స్‌కు ముందు అదరగొట్టింది. స్పెయిన్‌లో జరిగిన స్పానిష్ గ్రాండ్ ప్రీ రెజ్లింగ్ టోర్నీలో విజేతగా నిలిచింది. మహిళల 50 కిలోల విభాగం ఫైనల్లో వినేశ్ 10-5తో మరియా తుమెరెకోవా (రష్యా)ను చిత్తుచేసి స్వర్ణ పతకం అందుకుంది.



కఠిన సమయాలు నిరంతరం ఉండవు..

హార్దిక్‌కు మద్దతుగా నీతా అంబానీ వ్యాఖ్య



ముంబై: టీ20 వరల్డ్ కప్ గెలిచిన టీమిండియా హీరోలు రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్‌లకు అనంత్ అంబానీ-రాధిక మర్చంట్ సంగీత్ వేడుకలో ఘన స్వాగతం లభించింది. ఐపీఎల్ జట్టు ముంబై ఇండియన్స్‌లో కీలక ఆటగాళ్లయిన రోహిత్, హార్దిక్, సూర్యలను నీతా అంబానీ వేదికపైకి ఆహ్వానిస్తూ ఆ ముగ్గురు క్రికెటర్ల ఘనతను కొనియాడారు. అయితే హార్దిక్ పాండ్యా గురించి చెబుతూ ఆమె తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. 'కఠిన సమయాలు నిరంతరం ఉండవు. వాటికి ఎదురొడ్డి నిలిచిన వారే ముందుకు సాగుతారు' అని హార్దిక్‌నుద్దేశించి నీతా అంబానీ అన్నారు. గత ఐపీఎల్‌లో రోహిత్ స్థానంలో ముంబై కెప్టెన్‌గా నియమితుడైన హార్దిక్‌ను టోర్నీ ఆసాంతం ఫ్యాన్స్ గేలి చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు హార్దిక్ వ్యక్తిగత జీవితంపైనా పుకార్లు వచ్చాయి. భార్య స్టాన్కోవిక్ హార్దిక్ నుంచి విడిపోయిందనే వార్తలూ వచ్చాయి. ఈ నేపథ్యంలో హార్దిక్‌కు మద్దతుగా నీతా అంబానీ ఆ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నారు.



ఫైనల్లో పంకజ్ ఓటమి

ఆసియా బిలియర్డ్స్ చాంప్ ధ్రువ్

రియాద్: ఆసియా బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో హ్యాట్రిక్ టైటిల్ కొట్టాలన్న స్టార్ క్యూయిస్ట్ పంకజ్ అద్వానీ కల భగ్నమైంది. ఫైనల్లో పంకజ్‌కు భారత్‌కే చెందిన ధ్రువ్ సిత్వాలా షాకిచ్చి టైటిల్ ఎగరేసుకుపోయాడు. శనివారం జరిగిన తుదిపోరులో ధ్రువ్ 5-2తో పంకజ్‌ను ఓడించి విజేతగా నిలిచాడు.

పోర్చుగల్, స్విట్జర్లాండ్

షూటౌట్



ఫ్రాన్స్ ఆటగాళ్ల విజయానందం

సెమీస్‌లో ఫ్రాన్స్, ఇంగ్లండ్

యూరోకు రొనాల్డో వీడ్కోలు



రొనాల్డో

హాంబర్గ్: ఉత్కంఠభరిత పెనాల్టీ షూటౌట్‌లో పోర్చుగల్ గుండె పగిలింది. సాకర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో యూరోపియన్ చాంపియన్‌షిప్ ప్రయాణం ఓటమితో ముగిసింది. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ఫ్రాన్స్ 0-0 (5-3)తో పోర్చుగల్‌పై గెలిచి సెమీస్‌కు దూసుకెళ్లింది. నిర్ణీత, అదనపు సమయాల్లో ఇరుజట్లూ గోల్ చేయడంలో విఫలం కావడంతో మ్యాచ్ ఫలితం పెనాల్టీ షూటౌట్‌కు దారి తీసింది. ఫ్రెంచ్ టీమ్ ఐదు కిక్‌లకు ఐదు గోల్‌లోకి పంపగా.. పోర్చుగల్ ఆటగాడు జావో ఫెలిక్స్ కొట్టిన మూడో కిక్ గోల్ పోస్టుకు తగిలి బయటకు పోయింది. ఐదో కిక్‌ను థియో హెర్నాండెజ్ గోల్‌గా మలచడంతో ఫ్రెంచ్ జట్టు సంబరాలు చేసుకొంది. సెమీస్‌లో స్పెయిన్‌తో ఫ్రాన్స్ తలపడనుంది. ఒకరకంగా పోర్చుగల్ తరపున 39 ఏళ్ల రొనాల్డోకు ఇదే చివరి అంతర్జాతీయ మ్యాచ్‌గా భావిస్తున్నారు. వయసు రీత్యా వరల్డ్‌కప్ వరకు అతడు జట్టులో కొనసాగడం అనుమానమే. ఓటమి తర్వాత తీవ్రంగా బాధపడుతున్న సహచరులను రొనాల్డో ఓదార్చాడు. మరో వెటరన్ 41 ఏళ్ల పెపెకు కూడా దాదాపుగా ఇదే చివరి మెగా టోర్నీ. దీంతో అతడు రొనాల్డోను పట్టుకొని విలపించాడు. అంతిమంగా 'సాకర్ ఎంతో క్రూరమైంది' అని పెపె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.

ఇక్కడా ఉత్కంఠే..: గత టోర్నీ రన్నరప్ ఇంగ్లండ్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన ఉత్కంఠభరిత క్వార్టర్‌ఫైనల్లో ఇంగ్లండ్ 1-1 (5-3)తో స్విట్జర్లాండ్‌ను పెనాల్టీ షూటౌట్‌లో ఓడించింది.

గుకేశ్, ప్రజ్ఞానందకు నిరాశ

కరువానాకు 'సూపర్‌బెట్' టైటిల్

బుచారెస్ట్ (రొమేనియా): టైబ్రేక్‌లో భారత టీనేజ్ గ్రాండ్ మాస్టర్లు గుకేశ్, ప్రజ్ఞానందను ఓడించిన డిఫెండింగ్ చాంప్ ఫాబినో కరువానా (అమెరికా) సూపర్‌బెట్ క్లాసిక్ టైటిల్‌ను నిలబెట్టుకొన్నాడు. అలీ రెజా రెండో స్థానంలో, గుకేశ్ మూడు, ప్రజ్ఞానంద నాలుగో స్థానంలో నిలిచారు. క్లాసిక్ 9వ, ఆఖరి రౌండ్‌లో కరువాన ఓడగా.. గుకేశ్, ప్రజ్ఞానంద, అలీ రెజా (ఫ్రాన్స్) తమ గేమ్‌లను డ్రాగా ముగించారు. దీంతో ఈ నలుగురు తలో 4.5 పాయింట్లతో సంయుక్తంగా టాప్‌లో నిలిచారు. ఫలితంగా విజేతను నిర్ణయించడానికి నిర్వహించిన టైబ్రేక్‌లో గుకేశ్, ప్రజ్ఞానంద, అలీ రెజాపై మూడు గేమ్‌లూ నెగ్గిన కరువానా టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు.

స్వియటెక్ అవుట్

వింబుల్డన్



స్వియటెక్



యులియా

లండన్: వింబుల్డన్‌లో ఆరోరోజు అతిపెద్ద సంచలనం నమోదైంది. మహిళల హాట్‌ఫేవరెట్, ప్రపంచ నెంబర్‌వన్ స్వియటెక్ మూడో రౌండ్లోనే ఇంటిబాట పట్టింది. యులియా పుతిన్‌త్సెవా (కజకిస్థాన్) 3-6, 6-1, 6-2తో ఐదు గ్రాండ్‌స్లామ్‌ల విజేత స్వియటెక్ (పోలెండ్)ను కంగుతినిపించి ఈ వేదికపై తొలిసారి ప్రీక్వార్టర్స్ చేరింది. ఇక 21వ సీడ్ స్విటోలినా (ఉక్రెయిన్) 6-1, 7-6(4)తో 10వ సీడ్, రెండుసార్లు ఫైనలిస్టు ఓన్స్ జెబ్యూర్ (ట్యునీషియా)ను చిత్తుచేసి నాలుగోరౌండ్‌లో అడుగుపెట్టింది. 13వ సీడ్ ఒస్టాపెంకో 6-1, 6-3తో బెర్నార్డ్ పెరాపై, 17వ సీడ్ కలిన్స్కయా 7-6 (4), 6-2తో 15వ సీడ్ సంసొనోవాపై గెలిచి ప్రీక్వార్టర్స్ చేరారు. పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్ జానిక్ సిన్నర్ 6-1, 6-4, 6-2తో కెక్‌మనోవిక్‌పై, 4వ సీడ్ జ్వెరెవ్ 6-4, 6-4, 7-6 (15)తో కామెరూన్ నోరీపై విజయాలతో ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించారు. ఇక, పురుషుల డబుల్స్‌లో భారత స్టార్ రోహన్ బోపన్న పోరాటం ముగిసింది. రెండోరౌండ్లో బోపన్న-ఎబ్డెన్ జోడీ 3-6, 6-7 (7)తో జర్మనీ జంట జెబెన్స్-ఫ్రాంజెన్ చేతిలో ఓడింది.



సచిన్

సచిన్‌కు ఘన స్వాగతం: జ్వెరెవ్-నోరీ మధ్య సెంటర్ కోర్టులో జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌కు సచిన్ టెండూల్కర్ విచ్చేశాడు. ఈ సందర్భంగా స్టాండ్స్‌లోని ప్రేక్షకులు నిలుచొని పెద్దగా చప్పట్లు చరుస్తూ టెండూల్కర్‌ను స్వాగతించారు.

ప్రభుత్వ సలహాదారుగా కేకే

» క్యాబినెట్ హోదాతో నియామకం

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కే కేశవరావును రాష్ట్ర ప్రభుత్వం సలహాదారుగా నియమించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ వ్యవహారాల సలహాదారుగా ఆయన వ్యవహరించనున్నారు. ప్రభుత్వం ఆయనకు క్యాబినెట్ హోదా కల్పించింది.



రామోజీరావు సంస్మరణ సభలో మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే కూనంనేని, సురవరం సుధాకర్ రెడ్డి, కె.నారాయణ తదితరులు

కమ్యూనిస్టు యోధులే రామోజీకి స్ఫూర్తి

» సీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో సంస్మరణ సభలో తుమ్మల

» సామాజిక ఉద్యమకారుడు రామోజీ: కూనంనేని

హైదరాబాద్ సిటీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య వంటి మహనీయుల స్ఫూర్తితో, వామపక్ష భావజాలంతో రామోజీరావు వ్యాపార సంస్థలను నిర్వహించారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ (సీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో శనివారం రామోజీరావు సంస్మరణ సభ నిర్వహించారు. ప్రధాన వక్తగా తుమ్మల మాట్లాడుతూ పత్రికాధిపతిగా రామోజీ నిర్వహించిన పాత్రను శ్లాఘించారు. ప్రజాహితం తప్ప ఆయన ఏ రోజూ ప్రభుత్వాల పక్షాన నిలిచినవాడు కాదని కొనియాడారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రామోజీరావు పైకి పెట్టుబడిదారుడిగా కనిపించినా, ఆయన ఓ సామాజిక ఉద్యమకారుడు అని అభివర్ణించారు. ఆనాడు కమ్యూనిస్టు పార్టీలో నేర్చుకున్న విలువలే ఆయనను మహామనిషిగా తీర్చిదిద్దాయన్నారు. పత్రికా నిర్వాహకుడిగా రామోజీరావు తెలుగు సమాజానికి విలువైన సేవలు అందించారని సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి కొనియాడారు. సీపీఐ జాతీయ నాయకుడు కె.నారాయణ మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ వృద్ధాశ్రమంగా పేరున్న సీఆర్ ఫౌండేషన్ నిర్మాణం వెనుక రామోజీ ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. అందుకే ఆయన సంస్మరణ సభను తాము ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్టు వివరించారు.

అచ్చంపేట మునిసిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం

అచ్చంపేట టౌన్, జూలై 6: నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. శనివారం... పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ ఎన్నికను ఆర్డీవో మాధవి శనివారం నిర్వహించారు. మొత్తం 20 మంది కౌన్సిలర్లకు గాను కాంగ్రెస్ అభ్యర్థి గార్లపాటి శ్రీనివాసులుకు 16 మంది మద్దతు తెలిపారు. పోటీలో ఒక్కరే ఉండటంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక పత్రాన్ని ఆర్డీవో మాధవి అందజేశారు. అనంతరం శ్రీనివాసులు చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. వైస్ చైర్మన్‌గా శైలజారెడ్డి నియమితులయ్యారు. ఈ ఎన్నికకు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరయ్యారు. గత చైర్మన్ ఎడ్ల నర్సింహ్మ గౌడ్‌పై జూన్‌లో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో బీఆర్ఎస్ అచ్చంపేట పీఠాన్ని కోల్పోయింది.

నిరుద్యోగుల పట్ల బీఆర్ఎస్ మొసలి కన్నీరు

» వారి ఉచ్చులో పడకండి..: మధు యాష్కీ

» కేసీఆర్.. పదేళ్లు మీరేం చేశారు: తీన్మార్ మల్లన్న

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల పాటు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు వారి పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ మండిపడ్డారు. నిరుద్యోగ యువత.. మరోసారి బీఆర్ఎస్ ఉచ్చులో పడొద్దని సూచన చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం త్వరలోనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి.. ఉద్యోగ నియామకాలను చేపడుతుందన్నారు. తెలంగాణ వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి.. ఆ తర్వాత మాట మార్చిన చరిత్ర కేసీఆర్‌దని విమర్శించారు. తమ రాజకీయ ఉనికి కోసమే బీఆర్ఎస్ నేతలు యువతను రెచ్చగొట్టి దీక్షలు, ఆందోళనలు చేయిస్తున్నారని ఫైర్ అయ్యారు. విభజన సమస్యలపై తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి సమావేశమైతే.. కేసీఆర్, ఆయన పరివారం జీర్ణించుకోలేకపోతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. దీన్ని రాజకీయంగా ఉపయోగించుకుని బురద చల్లాలని చూస్తోందని మండిపడ్డారు. పదేళ్ల పాటు సీఎంగా ఉన్న కేసీఆర్.. విభజన సమస్యల పరిష్కారానికి ఎందుకు కృషి చేయలేదని నిలదీశారు. ప్రస్తుతం దేశంలో ఉన్న ముఖ్యమంత్రుల్లో అత్యుత్తమ సీఎం రేవంత్‌రెడ్డి అంటూ మాజీ మంత్రి శంకర్‌రావు కొనియాడారు.

'ఉల్లంఘన' కేసులో షా, కిషన్‌రెడ్డి పేర్ల తొలగింపు

చార్మినార్ జూలై 6 (ఆంధ్రజ్యోతి) : చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచారంలో ఎన్నికల నిబంధనలు పాటించలేదని మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డిల పేర్లను పోలీసులు తొలగించారు. ఎనిమిదవ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు దాఖలు చేసిన చార్జిషీటులో కేంద్రమంత్రి అమిత్ షా, కిషన్ రెడ్డిలకు ఈ కేసుతో సంబంధం లేదని మొఘల్‌పురా పోలీసులు తెలిపారు. మే మూడున చిన్న పిల్లలతో ఎన్నికల ప్రచారం నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించారంటూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జి. నిరంజన్ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు అయింది. ఈ విషయంపై మొఘల్‌పురా పీఎస్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా... ఈ కేసులో అమిత్‌షా, కిషన్ రెడ్డి ప్రమేయం లేకపోవడంతో వారి పేర్లు తొలగించామని... యమన్ సింగ్, మాధవీ లత, ఎమ్మెల్యే రాజాసింగ్‌లపై కేసు ఉందన్నారు.

బడిలో ఏడో తరగతి విద్యార్థికి గుండెపోటు

» ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి

చుంచుపల్లి, జూలై 6: కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో విషాదం జరిగింది. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న బాలుడు గుండెపోటుతో కుప్పకూలి మృతిచెందాడు. మృతుడు 12 ఏళ్ల హరికృష్ణ. చుంచుపల్లిలో ఉంటున్న తేజావత్ నరసింహా దంపతుల ముగ్గురు సంతానంలో హరికృష్ణ రెండోవాడు. నరసింహా ఆటోడ్రైవర్. రోజు మాదిరిగానే హరికృష్ణను నరసింహా ఆటోలో ఎక్కించుకొని బడి వద్ద దిగబెట్టి వెళ్లిపోయాడు. కొద్దిసేపటికే ఛాతీలో నొప్పి వస్తోందంటూ హరికృష్ణ కిందపడిపోయాడు. వెంటనే బాలుడిని పాఠశాల యాజమాన్యం చికిత్స నిమిత్తం రామవరం మాతా, శిశుఆరోగ్య కేంద్రానికి తరలించింది. ఆ బాలుడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతిచెందినట్లు నిర్ధారించారు. సమాచారాన్ని బాలుడి తల్లిదండ్రులకు చేరవేసిన యాజమాన్యం, మృతదేహాన్ని వారికి అప్పగించింది. కాగా చిన్నప్పటి నుంచే హరికృష్ణ గుండె జబ్బుతో బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

» బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కనీసం సంక్షేమ పథకాలకు కూడా నిధులు ఇవ్వలేని పరిస్థితి ఉందా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. అలా అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శనివారం, బీజేఎల్పీలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రజాపాలన అని చెప్పడం కాదు, పల్లె బాట పట్టాలని మంత్రులకు హితవు పలికారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిధులు లేక గ్రామ పంచాయతీలు విలవిలలాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు వెనకాడుతోందని ఆరోపించారు.

కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

హైదరాబాద్/గద్వాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లో మరో వికెట్ పడింది. ఆ పార్టీకి చెందిన, జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల నియోజకవర్గ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆయన హస్తం గూటికి చేరుకున్నారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో కృష్ణమోహన్ రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దానం నాగేందర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. వాస్తవానికి కృష్ణమోహన్‌రెడ్డి చేరిక నాలుగు రోజుల కిందటే ఖరారైనా.. స్థానికంగా గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య అనుచరులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వాయిదా పడుతూ వచ్చింది. దీంతో సీఎం రేవంత్ శనివారం తొలుత సరితతో మాట్లాడి నచ్చజెప్పారు. ఆ తర్వాత సరిత, కృష్ణమోహన్‌రెడ్డి ఇద్దరినీ కూర్చోబెట్టి మాట్లాడారు. ఏదైనా సమస్య వస్తే తన వద్దకు తీసురావాలని సూచించారు. దీంతో సరిత చల్లబడ్డట్లు తెలిసింది. కానీ, కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకొనే సమయంలో మాత్రం ఆమె హాజరుకాలేదు. ఇదిలా ఉండగా.. ఇప్పటికి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల సంఖ్య ఏడుకు చేరింది. మూడింట రెండొంతుల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. పలువురితో సంప్రదింపులు జరుపుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో మరికొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిసింది.



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

పట్నంలో బోనాల సందడి!

నేటి నుంచి ఆగస్టు 4వ తేదీ దాకా హైదరాబాద్‌లో ఉత్సవాలు

» గోల్కొండ జగదాంబ ఆలయంలో వేడుకలతో మొదలు

» అక్కడ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న కొండా సురేఖ

» హాజరుకానున్న పొన్నం.. వేడుకలకు గవర్నర్ వచ్చే అవకాశం?

» ఆలయ కమిటీలకు చెక్కులు పంపిణీ చేసిన మంత్రి సురేఖ

» ఉత్సవాల ప్రచార పోస్టర్, కేలండర్, వీడియో సాంగ్ ఆవిష్కరణ



'బోనాలు' వీడియోసాంగ్ సీడీని ఆవిష్కరిస్తున్న మంత్రులు కొండాసురేఖ, పొన్నం ప్రభాకర్. చిత్రంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు

హైదరాబాద్, నార్సింగ్, జూలై 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఇక బోనాల సందడి! ఆషాఢమాసం తొలి ఆదివారమైన నేటి నుంచి ఆగస్టు 4వ తేదీ దాకా నెలరోజుల పాటు ప్రధాన ఆలయాల్లో బోనాల ఉత్సవాలు జరుగతాయి. గోల్కొండ కోటలో జగదాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం జరిగే వేడుకలకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు పొన్నం, ఎమ్మెల్యే దానం నాగేందర్ సహా పలువురు నేతలు హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. గోల్కొండలో జరిగే బోనాల ఉత్సవాలకు గవర్నర్ రాధాకృష్ణన్ హాజరవుతారని భాగ్యనగర బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అయితే దీనిపై రాజ్‌భవన్ నుంచి ఎలాంటి ప్రకటనా విడుదల కాలేదు. కాగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా ఆషాడ బోనాల వేడుకలను ఆర్భాటంగా నిర్వహించేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం బేగంపేట టూరిజం ప్లాజాలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బోనాల ఉత్సవాల ఆలయ కమిటీలకు ఆమె చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడారు. నిరుటి కంటే ఘనంగా, అత్యంత వైభవోపేతంగా బోనాల పండుగ వేడుకలు నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.20కోట్ల నిధులు కేటాయించిందన్నారు. అనంతరం పొన్నం మాట్లాడారు. నిర్వహణలో ఎలాంటి లోటుపాటు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక దేవాలయాల కమిటీలను భాగస్వామ్యం చేసుకుంటూ ఉత్సవాలు విజయవంతం చేయడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు పడాలని, పంటలు చక్కగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకుంటున్నట్లు తెలిపారు. అ సందర్భంగా బోనాల వేడుకల ప్రచార సామగ్రి పోస్టర్‌ను ఆవిష్కరించారు. బోనాల జాతర కేలండర్, వీడియో సాంగ్, బోనాల చరిత్ర, సంస్కృతి, పరిణామక్రమం, క్రతువులను తెలుపుతూ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ రాసిన 'బోనాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, దేవాదాయశాఖ, సమాచార శాఖ కమిషనర్ హన్మంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

ఈవీ పరిశ్రమలకు ప్రోత్సాహకాలు: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వాహనాలు (ఈవీ), లిథియం బ్యాటరీల తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందజేస్తామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈవీల ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. శనివారం గోల్డ్‌స్టోన్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈటో ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాల సంస్థ ప్రతినిధులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారికి పలు హామీ ఇవ్వడంతోపాటు సూచనలు చేశారు. ఏటా పది వేల యూనిట్ల తయారీ సామర్థ్యంతో ఈటో ఆటో ఎలక్ట్రిక్ జడ్చర్ల వద్ద ఏర్పాటు చేసిన పరిశ్రమను మరింత విస్తరించాలని సూచించారు. ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరుగుతున్నందున విదేశీ పెట్టుబడులను తీసుకురావాలన్నారు. ఇందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని చెప్పారు. మహిళా ఆటో డ్రైవర్లను ప్రోత్సహించేందుకు ఈటో చేపట్టిన కార్యక్రమాన్ని శ్రీధర్ బాబు ప్రశంసించారు.

ఉమ్మడి జిల్లాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు

» గ్రామీణ యువతకు ఉపాధి కల్పనపై దృష్టి: భట్టి

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంపై పంచాయతీరాజ్ శాఖ అధికారులు దృష్టి పెట్టాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలుతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన వేలాదిమంది బీటెక్ పూర్తి చేస్తున్నారని, కానీ భావ వ్యక్తీకరణ నైపుణ్యం లేక ఉపాధి పొందలేకపోతున్నారని భట్టి అన్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా పాత ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోనూ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు మంత్రి సీతక్కతో కలిసి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై సచివాలయంలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలోని 'ఉపాధి కల్పన, మార్కెటింగ్ మిషన్' ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఎంతమందికి శిక్షణ ఇచ్చారు, వారు ప్రస్తుతం ఏం చేస్తున్నారు వంటి వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలతో అనుసంధానం చేసుకుని యువతకు ఉపాధి కల్పించే అంశంపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామీణ యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు వీలుగా వారం రోజుల్లో ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభిస్తున్నామని చెప్పారు. కాగా, ఉపాధి హామీ పథకం కింద చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టారని, రైతులు ఉచితంగానే ఆ పూడిక మట్టిని పొలాలకు తరలించుకుపోతున్నారని భట్టి అన్నారు. అయినా, గత పదేళ్లలో మిషన్ కాకతీయ పేరిట రూ.25వేల కోట్లు ఎలా ఖర్చయ్యాయని అధికారులను ప్రశ్నించారు. స్వీపర్ల వేతనాలు పెండింగ్‌లో ఉంటే వెంటనే వివరాలు పంపాలన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఆదాయాన్ని రాబట్టి, అప్పు చెల్లిస్తామంటూ గత ప్రభుత్వం రూ.30వేల కోట్ల అప్పు తెచ్చిందని అన్నారు. కానీ, ఆదాయాన్ని సాధించడం, అప్పు చెల్లించడంలో మిషన్ భగీరథ కార్పొరేషన్ పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. కాగా, 60 శాతం మంది మాత్రమే మిషన్ భగీరథ నీటిని వినియోగిస్తున్నారని అధికారులు భట్టికి వివరించారు. ఇందుకు స్పందించిన మంత్రి మిషన్ భగీరథ నీటి నాణ్యత, ఆరోగ్యం తదితర అంశాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని భట్టి చెప్పారు.

ఏటా 2 సార్లు టెట్

» నిబంధనలు సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇకపై ఏడాదిలో రెండుసార్లు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు ఏడాదిలో ఒకసారి.. ఏప్రిల్/మే నెలలో మాత్రమే టెట్‌ను నిర్వహించాలనే నిబంధన ఉండగా దాన్ని సవరిస్తూ ఏడాదిలో మొదట జూన్‌లో, రెండోసారి డిసెంబరులో పరీక్షలు నిర్వహించడానికి వెసులుబాటు కల్పిస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బి.వెంకటేశం శనివారం నిబంధనలు సవరిస్తూ జీవో నంబరు 18ను విడుదల చేశారు. ఉపాధ్యాయులుగా నియమితులు కావాలన్నా... ఉపాధ్యాయుల పదోన్నతికి అర్హత సాధించాలన్నా టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే టెట్‌ను పదేపదే నిర్వహించకపోవడంతో అభ్యర్థులు, ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోందనే విజ్ఞప్తితో తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

సీఎస్ఈ సీట్లు 4 వేలకు పైగా పెరిగే చాన్స్

» కోర్ బ్రాంచ్‌లు నిర్వహించే కాలేజీలను ప్రోత్సహించే యోచనలో సర్కారు

» ఎప్‌సెట్ కౌన్సెలింగ్ రెండో దశలో సీట్ల పెంపు ప్రకటనకు అవకాశం

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ), సీఎస్ఈ అనుబంధ కోర్సుల్లో గతేడాదికన్నా 4,500 సీట్లు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కోర్ బ్రాంచ్‌లు అయిన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, మెటలర్జీ వంటి ఇంజనీరింగ్ కోర్సులను నిర్వహించే కాలేజీలకు మరింత ప్రోత్సాహం ఇవ్వడంలో భాగంగా సీఎస్ఈ సీట్లను పెంచేందుకు సర్కారు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. అయితే ఎప్‌సెట్ రెండోదశ కౌన్సెలింగ్ తర్వాత సీట్ల పెంపు నిర్ణయాన్ని ప్రకటించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో కోర్ బ్రాంచ్‌ల్లో సీట్లు తగ్గించుకొని ఆమేరకు సీట్లను సీఎస్ఈలో పెంచుకునేందుకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ)కి కొన్ని కాలేజీలు దరఖాస్తు చేసుకున్నాయి. అలాగే, మరికొన్ని కళాశాలలు కోర్ బ్రాంచ్‌లను అలాగే కొనసాగిస్తూ అదనంగా సీఎస్ఈ కోర్సుల్లో సీట్ల పెంపునకు దరఖాస్తు చేశాయి. ప్రైవేటు కాలేజీల అభ్యర్థనలకు ఏఐసీటీఈ అమోదం తెలిపినప్పటికీ, కోర్ బ్రాంచ్ ల్లో సీట్ల తగ్గింపునకు సర్కారు విముఖత చూపుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో కోర్ బ్రాంచ్‌ల సీట్ల తగ్గింపు కోరుకున్న కళాశాలల్లో సుమారు 1,700 సీట్లు తగ్గుతుండగా, కోర్ బ్రాంచ్‌లు నిర్వహిస్తున్న కాలేజీలకు సుమారు 4,500 సీఎస్ఈ సీట్లకు అనుమతి లభించవచ్చని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అయితే, ఎప్‌సెట్ మొదటి దశ కౌన్సెలింగ్‌కు గతేడాది సీట్ల ప్రకారమే కాలేజీలకు అనుమతులు ఇస్తుండగా, రెండో దశ కౌన్సెలింగ్ నాటికి సీట్ల పెంపు ఉండే అవకాశం ఉందని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు చెబుతున్నారు. కాగా, ఈ నెల 8నుంచి మొదటి విడత వెబ్ ఆప్షన్స్ ఎక్సర్‌సైజ్ ప్రారంభం కానుండడంతో కళాశాలలకు అఫిలియేషన్/కోర్సులు/సీట్ల కేటాయింపు వివరాలను శనివారం సాయంత్రం జేఎన్‌టీయూ అధికారులు ఉన్నత విద్యామండలికి సమర్పించారు.

కాంగ్రెస్‌కు దమ్ముంటే.. ఎన్నికలకు వెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

చేయించలేదు? అని నిలదీశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని పాంచ్ న్యాయ్ ప్రకారం ఒక పార్టీ గుర్తుపై గెలిచిన నాయకుడు ఫిరాయింపునకు పాల్పడితే అనర్హత వేటు వేయాలని ఉందని.. మరి రాష్ట్రంలో చేస్తున్నది ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ ఉప ఎన్నికలు నిర్వహిస్తే అన్ని సీట్లను బీజేపీనే గెలుచుకుంటుందని.. తమ సీట్లు 34కు పెరిగి ప్రధాన ప్రతిపక్షం అవుతామని సంజయ్ పేర్కొన్నారు. ఏ పార్టీ ఎమ్మెల్యే అయినా చేరాలనుకుంటే రాజీనామా చేసి రావాలనేది బీజేపీ విధానమని, మునుగోడు, హుజూరాబాద్‌లో ఇలానే చేశామని వివరించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంజయ్ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేను చేర్చుకుంటోందని ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాలకు.. ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థుల ద్వారా అభివృద్ధి పనులు మంజూరు చేయిస్తున్నారని, ఇది ఎంతవరకు సమర్థనీయం? అని ప్రశ్నించారు. కేంద్రం కూడా బీజేపీ పాలిత రాష్ట్రాలకే నిధులిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాలని కాంగ్రెస్ నాయకులకు సంజయ్ సూచించారు. బీఆర్ఎస్‌లాగే వ్యవహరిస్తే కాంగ్రెస్ వారి ఉద్యోగాలు గల్లంతు కావడం ఖాయమని హెచ్చరించారు.

ఎంఐఎం గోడ మీది పిల్లి..

వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ, ఎంఐఎం మధ్యే పోటీ ఉండబోతోందని సంజయ్ అన్నారు.



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాకేశ్

కాంగ్రెస్, బీఆర్ఎస్.. ఎంఐఎం ఓట్ల కోసం పాకులాడుతాయని విమర్శించారు. ఎంఐఎం గోడ మీది పిల్లి.. ఏ పార్టీ అధికారంలో ఆ పార్టీ పంచన చేరుతుందని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ సమావేశంలో ప్రజా సమస్యలపై బీజేపీ కార్పొరేటర్లు ప్రశ్నిస్తే.. మహిళలు అని కూడా చూడకుండా ఎంఐఎం కార్పొరేటర్లు దాడి చేయడం సిగ్గుచేటని విమర్శించారు. బీజేపీ కార్యకర్తలు తలచుకుంటే వారు మిగతా ప్రాంతాలకు వెళ్లగలరా? అని ప్రశ్నించారు. కుటుంబం వ్యాపారాలు కాపాడుకోవడానికి, ఆస్తులు సంపాదించుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్తున్నారు తప్ప, ప్రజా సమస్యలపై కార్పొరేటర్లను ఎప్పుడైనా తీసుకువెళ్లారా? అని ఒవైసీని నిలదీశారు. ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న కాంగ్రెస్, ఏడు నెలల్లో ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వలేదని ఆరోపించారు. మిగతా 5 నెలల్లో ఇవ్వడం సాధ్యమా? అని సంజయ్ ప్రశ్నించారు. విభజనచట్టంలోని అంశాలపై తెలుగు రాష్ట్రాల సీఎంలు సమావేశం కావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కానీ.. గతంలో మాదిరిగా చేపల పులుసు, రొయ్యల వేపుడు పేరుతో తెలంగాణకు అన్యాయం జరిగే నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. కొంతమంది గోతికాడ నక్కలా సీఎంల భేటీని అడ్డం పెట్టుకుని సెంటిమెంట్ రెచ్చగొట్టి లబ్ధిపొందాలని చూస్తున్నారని, ఆ అవకాశం ఇవ్వొద్దని కోరారు. కేంద్రమంత్రి పదవితో చేతులు కట్టేసినట్లు అయిందని.. అయినా తన దూకుడు తగ్గదని సంజయ్ సరదాగా వ్యాఖ్యానించారు.

50రోజులైనా నిందితుల్ని అరెస్ట్‌చేయలేదేం?

వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపూర్ గ్రామ బీజేపీ సీనియర్ నేత శ్రీధర్ రెడ్డి హత్య జరిగి 50 రోజులు కావొస్తున్నా నిందితులను అరెస్ట్ చేయకపోవడం పట్ల బండి సంజయ్ అసహనం వ్యక్తం చేశారు. తక్షణం నిందితులను పట్టుకోవడంతో పాటు తగిన చర్యలు తీసుకోవాలని ఐజీ సుధీర్‌ను ఆదేశించారు. శ్రీధర్‌రెడ్డి తండ్రి బొడ్డు శేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు సహా పలువురు బీజేపీ నాయకులు శనివారం రాష్ట్ర కార్యాలయంలో సంజయ్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా, అసలైన నిందితులను వదిలేసి తమ సన్నిహితులను పిలిచి హింసిస్తూ కేసును పక్కదారి పట్టిస్తున్నారని శేఖర్‌రెడ్డి వాపోయారు. వెంటనే స్పందించిన సంజయ్ ఐజీకి ఫోన్ చేశారు. నిందితులను అరెస్ట్ చేయకపోవడానికి కారణాలను తెలుసుకున్నారు.

శ్రీధర్‌బాబుతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భేటీ

» హైదరాబాద్‌కు చెందిన ఆరుగురి సమావేశం

» కూకట్‌పల్లిలో సమస్యల పరిష్కారానికని మంత్రి వద్దకు

» వీరిలో ఐదుగురు 5న బీఆర్ఎస్ భేటీకి గైర్హాజరు



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

కూకట్‌పల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శనివారం మంత్రి డి.శ్రీధర్‌బాబును కలుసుకున్నారు. మాధవరం కృష్ణారావు, బండారు లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి, అరికపూడి గాంధీ, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కేపీ వివేకానంద.. సచివాలయంలో మంత్రిని కలిశారు. మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా శ్రీధర్ బాబు వ్యవహరిస్తుండడంతో.. ఆ జిల్లా పరిధిలోకి వచ్చే కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు.. మంత్రి శ్రీధర్ బాబుకు వద్దకు వెళ్లారు. నియోజకవర్గంలోని చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి దోమల సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. అదేవిధంగా విద్యుత్ స్థలాలు, వీధిదీపాలు, పారిశుధ్య సమస్యలతో కాలనీవాసులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేసేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వినతిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు రాజకీయాలకు అతీతంగా ప్రజాసమస్యల పరిష్కారంలో కోసం ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పినట్లు ఎమ్మెల్యే వివరించారు. అయితే కూకట్‌పల్లి నియోజకవర్గ సమస్యలపై వెళ్లిన ఎమ్మెల్యేతోపాటు ఇతర ఎమ్మెల్యేలు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. పైగా.. వీరిలో ఐదుగురు ఎమ్మెల్యేలు శుక్రవారం బీఆర్ఎస్ అధిష్ఠానం నిర్వహించిన శాసనసభ్యులు, కార్పొరేటర్ల సమావేశానికి గైర్హాజరు కావడంతో మంత్రితో వీరి భేటీపై స్థానికంగా పలురకాలుగా చర్చించుకుంటున్నారు.

రేపు భారీ వర్షాలు

» రాష్ట్రవ్యాప్తంగా 9.7 మి.మీ. సగటు వర్షపాతం నమోదు

హైదరాబాద్/కొత్తూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రెండ్రోజుల పాటు వర్షాలు కురుస్తాయని శనివారం హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆదివారం కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. సోమవారం ఎక్కువ చోట్ల భారీ వర్షాలు పడే అవకాశముందని పేర్కొంది. రాష్ట్రంలో స్థిరమైన ఈదురుగాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వెల్లడించింది. ఒక ఆవర్తనం దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరం వద్ద పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సగటు సముద్రమట్టానికి 5.8 నుంచి 7.6 కిలోమీటర్ల మధ్యలో కేంద్రీకృతమై ఉన్నట్లు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా శనివారం వర్షాలు కురిశాయి. ఒకట్రెండు జిల్లాలు మినహా అన్నిచోట్ల వానలు పడ్డాయి. దీంతో సగటు వర్షపాతం 9.7 మిల్లీమీటర్లగా నమోదైనట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్‌లోనూ సాయంత్రం మోస్తరు వాన కురిసింది. దీంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో భారీ వర్షం కురిసింది. గంటన్నర పాటు భారీ వర్షం కురియడంతో సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై పలుచోట్ల వాహనాలు నిలిచిపోయాయి. కొత్తూర్ మండల కేంద్రానికి సమీపంలో 44వ జాతీయ రహదారి వద్ద వై జంక్షన్ సమీపంలోని అండర్ పాస్ రహదారి మునిగిపోవడంతో పోలీసులు చాలాసేపు మూసివేశారు.

2 కమిటీలు



సమావేశంలో సీఎంలు రేవంత్, చంద్రబాబు, చిత్రంలో మంత్రులు భట్టి, దుద్దిళ్ల, అనగాని, కందుల దుర్గేశ్, జనార్దన్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు పాల్గొన్నారు. ఏపీ నుంచి సీఎం చంద్రబాబుతో పాటు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ప్రజా భవన్‌కు ముందుగా రేవంత్‌రెడ్డి చేరుకోగా.. ఆ వెంటనే చంద్రబాబు వచ్చారు. చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి సాదర స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సత్కరించారు. తెలంగాణ ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు రాసిన 'నా గొడవ' పుస్తకాన్ని చంద్రబాబుకు బహూకరించారు. కాగా, రేవంత్, భట్టివిక్రమార్కలకు చంద్రబాబు వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. సమావేశం ముగిసిన అనంతరం తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్.. మీడియాకు వివరాలు వెల్లడించారు.

త్వరితగతిన చర్చించుకుని ముందుకు..

'రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నేను, ఏపీ మంత్రులు అందరం కలిసి విభజన అంశాలపై లోతుగా చర్చించాం. విభజనకు సంబంధించిన చాలా సమస్యలు గత పదేళ్లుగా పరిష్కారానికి నోచుకోలేదు. వీటన్నింటిపై త్వరితగతిన చర్చించుకుని, ముందుకు వెళ్లాలన్న ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశాం. విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలతోపాటు పరిష్కారానికి నోచుకోని ఇతర అంశాలు కూడా చర్చకు వచ్చాయి. ఈ సమస్యలన్నింటికీ సమాధానాలు, పరిష్కారాలు సమావేశంలోనే దొరుకుతాయని అనుకోలేదు. వీటి పరిష్కారానికిగాను విధానపరమైన నిర్ణయం తీసుకోవడానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే సమావేశంలో కూలంకషంగా చర్చించుకుని ఒక నిర్ణయానికి వచ్చాం" అని భట్టివిక్రమార్క చెప్పారు. ఈ మేరకు విభజన సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి అధికారులతో కూడిన కమిటీని వేయాలని నిర్ణయించామన్నారు. చీఫ్ సెక్రటరీలతో సహా ఇరు రాష్ట్రాల నుంచి ముగ్గురు అధికారులతో ఈ కమిటీని నియమిస్తామన్నారు. " రెండు వారాల్లోగా ఈ కమిటీ సమావేశమై, వారి స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలపై చర్చిస్తుంది. ఒకవేళ ఈ ఉన్నతాధికారుల కమిటీ స్థాయిలో కూడా పరిష్కారం కాని సమస్యలు ఏవైనా ఉంటే.. వాటి పరిష్కారానికి రెండు రాష్ట్రాల మంత్రులతో కూడిన మరో కమిటీని వేయాలని నిర్ణయించాం. ఈ మంత్రుల కమిటీ కూడా సమావేశాలు నిర్వహించి, వారి స్థాయిలో సమస్యలను చర్చిస్తుంది. ఈ మంత్రుల కమిటీ చర్చించి పరిష్కరించే అంశాలను ముఖ్యమంత్రుల స్థాయిలో ఆమోదించడం జరుగుతుంది. అప్పటికీ పరిష్కారం కాకపోతే.. ముఖ్యమంత్రుల స్థాయిలో మళ్లీ సమావేశాలు నిర్వహించుకుని పరిష్కారం దిశగా ముందుకు వెళ్లాలని నిర్ణయించాం" అని భట్టివిక్రమార్క వివరించారు.

డ్రగ్స్ నిరోధానికి కో-ఆర్డినేషన్ కమిటీ

సమావేశంలో మరో అతి ముఖ్యమైన నిర్ణయం కూడా తీసుకున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. " తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. యాంటీ నార్కొటిక్స్ బ్యూరోకు ఒక అడిషనల్ డీజీ స్థాయి అధికారిని నియమించి, ప్రత్యేక డ్రైవ్ కొనసాగిస్తున్నాం. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఓ వ్యవస్థను ఏర్పాటు చేసి కార్యాచరణతో ముందుకు వెళుతున్నాం. దాంతోపాటు సైబర్ క్రైమ్ నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని ముందుకు వెళుతున్నాం. వీటిపై రెండు రాష్ట్రాలు ఒక కో-ఆర్డినేసన్ కమిటీ ద్వారా పని చేస్తే నియంత్రించడానికి అవకాశముంటుందని భావించాం. వివిధ సరిహద్దుల నుంచి రకరకాల డ్రగ్స్ వస్తున్నాయి. అందుకే వీటి నియంత్రణ కోసం ఇరు రాష్ట్రాల అడిషనల్ డీజీ స్థాయి అధికారులతో ఒక కో-ఆర్డినేషన్ కమిటీని వేయాలని నిర్ణయించాం. ఈ మహమ్మారి నుంచి రెండు రాష్ట్రాలను కాపాడాలని విధానపరమైన నిర్ణయం తీసుకున్నాం" అని భట్టి వివరించారు.



ప్రజాభవన్‌లోకి వస్తున్న చంద్రబాబు, రేవంత్

ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా పరిష్కారం: అనగాని

ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా విభజన అంశాలను పరిష్కరించుకోవాలని నిర్ణయించినట్లు ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. "ఇరు రాష్ట్రాల సీఎంలు సమావేశమైన ఈ రోజు తెలుగు జాతి హర్షించే మంచి రోజు. ఇప్పటికే తెలంగాణను అభివృద్ధి వైపు తీసుకెళ్లాలని ఇక్కడి సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సహచర మంత్రులు పని చేస్తున్నారు. అయితే తెలుగువారు ఎక్కడున్నా సుభిక్షంగా ఉండాలని భావించి మా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న విభజన సమస్యల పరిష్కారానికి సమావేశమవుదామంటూ రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఆ మేరకు జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై కూలకంషంగా చర్చించి, మంత్రులు, అధికారుల అభిప్రాయాలను తీసుకున్నాం. ఇదివరకు నీళ్ల, నిధులు, నియామకాల కోసం తెలంగాణ ఉద్యమం సాగింది. ఆంధ్రప్రదేశ్ మనోభావాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. ఎవరి మనోభావాలు దెబ్బ తినకూడదని, అందరి భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకుని, సమస్యలను సానుకూలంగా, సత్వరంగా పరిష్కరించుకోవాలని నిర్ణయించాం. అందులో భాగంగానే అధికారులు, మంత్రుల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. విభజన సమస్యలే కాకుండా.. రాబోయే రోజుల్లో మంచి వాతావరణాన్ని సృష్టించడానికి తరచుగా ముఖ్యమంత్రులు కలవాలని నిర్ణయించారు. తెలంగాణ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఉండాలన్న తపనతో పని చేస్తున్నారు. అక్కడ మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డ్రగ్స్ నియంత్రణకు ఆరుగురు మంత్రులతో సబ్ కమిటీ వేశాం. అక్కడ స్కూల్ బ్యాగుల్లో గంజాయి దొరుకుతున్న పరిస్థితులున్నాయి. అక్కడున్న డ్రగ్ కల్చర్‌కు, ఇక్కడి డ్రగ్స్ కల్చర్‌కు లింకు ఉంది. ఎందుకంటే అక్కడ గంజాయి ఉత్పత్తి అయి ఇక్కడి వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ఆందోళనతో ఉన్నారు. అందుకే ఇరు రాష్ట్రాల అదనపు డీజీ స్థాయి అధికారులతో ఓ కమిటీని వేశాం. రెండు వారాల్లో, ఇరు ముఖ్యమంత్రులు హర్షించేవిధంగా ముందుకు వెళ్లాలనుకుంటున్నాం. తెలుగు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ హర్షించే విధంగా ఈ విభజన సమస్యలన్నింటిని పరిష్కరిస్తాం" అని సత్యప్రసాద్ వివరించారు. కాగా, పలు అంశాలపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. అన్నింటినీ చర్చించడానికే కమిటీలు వేస్తున్నామంటూ భట్టివిక్రమార్క ఒకే వాక్యంలో సమాధానమిచ్చారు.



రేవంత్, భట్టికి జ్ఞాపికను అందజేస్తున్న చంద్రబాబు

చిన్న చిన్న సమస్యలపై

పేచీలు వద్దు

ఎవరి మనోభావాలూ దెబ్బతినకుండా పరిష్కరించుకుందాం

ముందుగా రెండయినా చక్కదిద్దితే సానుకూల వాతావరణం

- మొత్తం 70 అంశాలు.. అధికారుల స్థాయిలోనే 50 పరిష్కారం
- మిగతా 20 మంత్రుల కమిటీలతో తేల్చేయొచ్చు
- అప్పటికీ అవసరమైతే కేంద్రం వద్దకు వెళ్దాం
- సీఎంలు రేవంత్, చంద్రబాబు భేటీ

హైదరాబాద్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా, భావోద్వేగాలు వ్యాపించేందుకు తావు లేకుండా విభజన సమస్యలను పరిష్కరించుకుందామని తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. చిన్న చిన్న సమస్యలపై పేచీ పడకుండా, పూర్తి సుహృద్భావ వాతావరణంలో ముందుకెళ్లాలన్న అభిప్రాయానికి వచ్చారు. ముందుగా కొన్ని విషయాలను చక్కదిద్దితే, రెండు రాష్ట్రాల్లో సానుకూల వాతావరణం ఏర్పడుతుందనే భావన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రెండింటినైనా పరిష్కరించి ముందుకెళ్లాలని సీఎంలు అధికారులను ఆదేశించారు. కాగా, అధికారులు, మంత్రుల స్థాయి కమిటీలతో పరిష్కారం కాని సమస్యలుంటే.. కేంద్రం వద్దకు తీసుకెళ్లాలన్న ప్రతిపాదనను తెచ్చారు. శనివారం ప్రజాభవన్‌లో గంటా 45 నిమిషాల పాటు సుదీర్ఘంగా సాగిన సీఎంల సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. రెండు రాష్ట్రాల మధ్య పరిష్కరించుకోవాల్సిన 70 అంశాలను గుర్తించారు. ఇందులో 50 సమస్యలను ఉన్నతాధికారుల స్థాయిలో తేల్చేయవచ్చని, మిగతావాటిని మంత్రుల కమిటీలతో పరిష్కరించాలని నిర్ణయించారు. అప్పటికీ కాకపోతే.. కేంద్రం వద్దకు వెళ్దామన్న ఆలోచనకు వచ్చారు.

ఎవరికీ ఇబ్బంది రావొద్దు..

కేంద్రంలోని సంకీర్ణ ప్రభుత్వంలో తాము భాగస్వాములమైనందున, కేంద్రం వద్దకు వెళ్లాల్సి వస్తే.. తాను తీసుకెళ్తానంటూ చంద్రబాబు చెప్పగా రేవంత్ అంగీకరించారు. 'నాకు తెలంగాణ, ఏపీ ప్రజల మనోభావాలు తెలుసు. వాటిని దెబ్బ తీయొద్దు. ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకూడదు. పూర్తి సమ్మతంతో సమస్యలను పరిష్కరించుకుందాం" అని బాబు సూచించారు. దీంతోనే సమస్యల పరిష్కారానికి మంత్రులు, అధికారుల కమిటీలను వేద్దామంటూ రేవంత్ ప్రతిపాదించారు. దీనికి బాబు ఆమోదం తెలిపారు. ఈ కమిటీల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను తామే (సీఎంలు) ఆమోదించాలన్న నిర్ణయానికి వచ్చారు. 50 సమస్యలపై చర్చించేందుకు రెండు వారాల్లో అధికారుల కమిటీ భేటీ కావాలని ఆదేశించారు. ఆ తర్వాత మంత్రుల కమిటీ కూడా సమావేశమవుతూ సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుందని సీఎంలు పేర్కొన్నారు. "ఒకేసారి సమస్యలన్నీ తీరిపోతాయని అనుకోవద్దు. ఒక్కోదానిని నెమ్మదిగా పరిష్కరించుకుంటూ వెళ్లాలి. ఇక తీరవు కావు అన్న వాతావరణం ఉండకూడదు. సకాలంలో పరిష్కారం కాక.. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలు చాలా నష్టపోయాయి.. ఇకమీదటనైనా సాగదీయొద్దు" అని అభిప్రాయపడ్డారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుదాం: బాబు

మాదకద్రవ్యాలు పెద్ద మహమ్మారిలా మారాయని ఇద్దరు సీఎంలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే తెలంగాణలో ఉక్కుపాదం మోపుతున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పూర్తిగా నిర్మూలించేందుకు ఆంధ్రప్రదేశ్ సహకారం కావాలని కోరారు. ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి తెలంగాణకు గంజాయి స్మగ్లింగ్ అవుతోందని.. కలిసి పనిచేస్తే డ్రగ్స్‌ను నిరోధించవచ్చని ప్రతిపాదించారు. దీనికి చంద్రబాబు అంగీకరించారు. "డ్రగ్స్‌ను ఎక్కడైనా నిర్మూలించాల్సిందే. దీనిని కలిసికట్టుగా ఎదుర్కొందాం" అని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం అదనపు డీజీల స్థాయిలో ఒక సమన్వయ కమిటీని వేయాలని నిర్ణయించారు.

మీ స్ఫూర్తితో మళ్లీ జల సంరక్షణ: రేవంత్

సమావేశం అనంతరం చంద్రబాబు, ఏపీ మంత్రులకు రేవంత్‌రెడ్డి ప్రజాభవన్‌లో రాత్రి భోజనం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంలోనూ సీఎంలు పలు అంశాల గురించి మాట్లాడుకున్నారు. హైదరాబాద్ అభివృద్ధిపై చంద్రబాబు ఆరా తీశారు. ఇప్పటికే నగరానికి రీజనల్ రింగ్ రోడ్డు వచ్చిందని, దీనికి, ఔటర్ రింగు రోడ్డుకు మధ్యలో రేడియల్ రోడ్లు నిర్మించాలని నిర్ణయించామని రేవంత్ చెప్పారు. "మీరు ఉమ్మడి ఏపీకి సీఎంగా ఉన్నప్పుడు జల సంరక్షణకు పలు చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు 1,500 అడుగుల లోతుకెళ్లినా బోర్లలో నీరు పడడం లేదు. అందుకే మళ్లీ జల సంరక్షణ చేపట్టాలని నిర్ణయించాం. ఈ దిశగా పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడతాం" అని రేవంత్ వివరించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు, వరద పోటెత్తి హైదరాబాద్‌లో ఎక్కడికక్కడ నీరు నిలుస్తోందని, దీని పరిష్కారానికి కూడా తగిన చర్యలు చేపట్టాలనుకుంటున్నట్లు తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు గురించి చంద్రబాబు ఆరా తీశారు. ఇప్పటికే ఈ పనులు చేపట్టామని, మూసీ పరివాహక ప్రాంతాన్ని మొత్తం సుందరీకరిస్తామని రేవంత్ బదులిచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం గురించి బాబు అడగ్గా, ఈ పథకం బాగా కొనసాగుతోందని, మహిళల నుంచి అభినందనలు వస్తున్నాయని రేవంత్ చెప్పారు. కాగా, కార్మిక సంక్షేమ నిధి సమస్యను అధికారుల కమిటీ పరిష్కరిస్తుందని సీఎంలు స్పష్టం చేశారు. మరోవైపు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఏపీలో కలిపిన ఐదు గ్రామాలు, విద్యుత్తు బకాయిలు, ఇతర సంస్థలకు సంబంధించిన పంపకాల వ్యవహారాలను అధికారుల కమిటీ పరిశీలించి, ఆమోదయోగ్య ప్రతిపాదనలు చేసే అవకాశం ఉంది.

లింగ నిర్ధారణ దందా.. శిశువు విక్రయం

ప్రమాదమని తెలిసీ ఎనిమిదో నెల్లోనే కాన్పు

- కామారెడ్డిలో తండ్రీకొడుకులైన వైద్యుల నిర్వాకం
- కొడుకు ప్రభుత్వ వైద్యుడు
- వారితో పాటు ఆరుగురి అరెస్టు
- రూ.2 లక్షలకు ఆడశిశువును అమ్మిన వైనం

కామారెడ్డి టౌన్, జూలై 6: ఆ ఇద్దరు వైద్యులు తండ్రీకొడుకులు! చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. పుట్టబోయేది ఆడబిడ్డో, మగబిడ్డో అనేది సంబంధీకులకు చెప్పేస్తారు. పైగా.. ప్రాణాలకు ప్రమాదమని తెలిసి కూడా ఇటీవల 8 నెలల గర్భిణికి కాన్పు చేశారు. ఆ శిశువును బేరం పెట్టి అమ్మేశారు! కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఇట్టెం సిద్ధిరాములు, ఇట్టెం ప్రవీణ్ అనే వైద్యుల నిర్వాకమిది. ప్రవీణ్ ప్రభుత్వ వైద్యుడు. గాంధారి మెడికల్ ఆఫీసర్‌గా చేస్తున్నాడు. తండ్రి సిద్ధిరాములతో కలిసి కామారెడ్డి పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ప్రైవేటు ఆస్పత్రి నిర్వహిస్తున్నాడు. సీఐ చంద్రశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. సిద్ధిరాములు, ప్రవీణ్ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తేలడంతో వారు కౌసల్య అనే పేరుతో నిర్వహిస్తున్న ఆస్పత్రిని గతంలోనే అధికారులు సీజ్ చేశారు. కోర్టులో ఈ కేసు విచారణ నడుస్తోంది. కొన్నాళ్లకు వారు వైద్య శాఖలో కొందరు అధికారులను మచ్చిక చేసుకుని 'సమన్విత హాస్పిటల్ అండ్ ఫెర్టిలిటీ సెంటర్'ను తెరిచారు. లింగనిర్ధారణ పరీక్షలతో యథేచ్ఛగా తమ దందా కొనసాగిస్తున్నారు. తాజాగా 8 నెలల గర్భిణికి కాన్పు చేయడం, శిశువును విక్రయించడంతో వారి బండారం బయటపడింది. తాడ్వాయి మండలానికి చెందిన ఆ యువతికి, రామారెడ్డి మండలానికి చెందిన యువకుడికి పెళ్లయింది. తర్వాత రెండు నెలలకు భార్య గర్భిణి అనే సంగతి తెలుసుకొని భర్త, ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి స్కానింగ్ చేయించాడు. పరీక్షల్లో ఆమె 8 నెలల గర్భవతి అని తేలడంతో ఇద్దరి కుటుంబ సభ్యుల మధ్య గొడవ జరిగింది. అప్పటి నుంచి భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమె, ఆమె కుటుంబ సభ్యులు సమన్విత ఆస్పత్రిలో వైద్యులు ప్రవీణ్, సిద్ధిరాములను సంప్రదించారు. ఇదే అదనుగా వారు లింగ నిర్ధారణ పరీక్ష చేసి ఆడపిల్ల అని తేల్చారు. నెలలు నిండకుండా కాన్పు చేయడం ప్రమాదమని తెలిసి కూడా అందుకు రూ.2 లక్షలు డిమాండ్ చేశారు. ఏప్రిల్ 11న ఆమెకు కాన్పు చేశారు. ఆడపిల్ల పుట్టింది. ఆ పసికందును రూ.2 లక్షలకు అమ్మేందుకు వైద్యులు తమ ఆస్పత్రి మేనేజర్ ఉదయ్‌కిరణ్, సిబ్బందితో కలిసి సిరిసిల్లా జిల్లాకు చెందిన భూపతితో ఒప్పందం కుదుర్చుకున్నారు. బయానాగా భూపతి రూ.20 వేలు సదరు మేనేజర్, వైద్యులకు ఇచ్చి పసికందును తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఆ యువతి తన భర్త ద్వారానే గర్భం దాల్చానంటూ అతనికి లీగల్ నోటీసు పంపింది. దాంతో అతను శిశువు విక్రయం గురించి హైదరాబాద్‌లోని శిశు సంరక్షణ అధికారులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న కామారెడ్డి జిల్లా శిశు సంరక్షణ జిల్లా అధికారి స్రవంతి, అక్కడి పోలీసుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. వైద్యులు ప్రవీణ్, సిద్ధిరాములుతో పాటు శిశువు తల్లిని అదుపులోకి తీసుకుని విచారించగా పసికందును విక్రయించినట్లు తేలింది. వారితో పాటు శిశువును కొన్న భూపతిని, ఆస్పత్రి మేనేజర్ ఉదయ్‌కిరణ్, సిబ్బంది బాలరాజ్, బాలకిషన్, దేవయ్యను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శిశువును శిశు సంరక్షణ అధికారులకు అప్పగించారు. కామారెడ్డిలో గత కొన్నేళ్లుగా ఇట్టెం ప్రవీణ్, సిద్ధిరాములు తమ సమన్విత హాస్పిటల్ అండ్ ఫెర్టిలిటీ సెంటర్‌లో యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందని పట్టణ సీఐ తెలిపారు.

వైఎస్ వారసత్వం కోసం షర్మిల పోటీ!

- ఘనంగా జయంతి నిర్వహణకు సన్నాహాలు
- సోనియా, రాహుల్, ఖర్గే సహా కాంగ్రెస్ అతిరథులకు ఆహ్వానం
- చంద్రబాబు, పవన్‌కు కూడా..
- ఇడుపులపాయ సమాధికే జగన్ పరిమితం



అమరావతి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజకీయ వారసత్వం కోసం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డితో ఢీ అంటే ఢీ అంటున్నారు. సోమవారం (8న) ఆయన జయంతిని గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కర్ణాటక సీఎం సిద్దరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు సుశీల్‌కుమార్ షిండే, దిగ్విజయ్ సింగ్, వీరప్పమొయిలీ, అంబికాసోని, రమేశ్ చెన్నితల, జైరాం రమేశ్, సీపీఐ నేత కె.నారాయణ, సీపీఎం నేత బీవీ రాఘవులును ఆహ్వానించారు. వీరితో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్‌ను కూడా పిలువనున్నారు. వైఎస్ వారసుడిని తానేనని జగన్ చెబుతుంటే.. తండ్రికి తానంటేనే ఇష్టమని.. అందువల్ల తానే అసలు సిసలైన రాజకీయ వారసురాలినని.. రాజన్న బిడ్డను తానేనని షర్మిల జనంలోకి వచ్చి మరీ చెబుతున్నారు. ఆమె ఆలోచనలకు భిన్నంగా తండ్రి జయంతిని జగన్ ఇడుపులపాయ సమాధికే పరిమితం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పటి మాదిరిగా పెద్దగా హడావుడి చేయకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కొందరు వైసీపీ నేతలు మాత్రం తమ తమ ప్రాంతాల్లో వైఎస్ జయంతి కార్యక్రమాలకు సన్నద్ధమయ్యారు.

ఏడు బిల్లులకు గవర్నర్ ఆమోదం!

(మొదటిపేజీ తరువాయి)

విశ్వవిద్యాలయ హోదా లభించినట్లయింది. మరో ముఖ్యమైన బిల్లు మున్సిపల్ చట్ట సవరణ బిల్లు. పాత చట్టం ప్రకారం మున్సిపాలిటీల్లో ఇద్దరు, కార్పొరేషన్లలో నలుగురు కో-ఆప్టెడ్ సభ్యులను నియమించుకోవచ్చు. కొత్త చట్టం ప్రకారం వీళ్లకు అదనంగా ప్రత్యేక పరిజ్ఞానం, విశేష అనుభవం కలిగిన వారిని మున్సిపాలిటీల్లో ఇద్దరు, కార్పొరేషన్లలో ఆరుగురి వరకు నియమించుకోవచ్చు. ములుగు పంచాయతీని మున్సిపాలిటీగా మారుస్తూ మరో సవరణ చేశారు. హైదరాబాద్ కార్పొరేషన్ ఓటర్ల జాబితాను జనవరితో పాటు ఏప్రిల్, మే నెలల్లో కూడా సవరించి పబ్లిష్ చేసేందుకు అనుమతించారు. పంచాయతీరాజ్ చట్టానికి చేసిన సవరణలను కూడా ఆమోదించారు. అందులో భాగంగా భద్రాచలాన్ని మూడు మేజర్ గ్రామ పంచాయతీలుగా విభజించనున్నారు. మొదట మున్సిపాలిటీగా మార్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నించగా, షెడ్యూల్డ్ ఏరియా కావడంతో గవర్నర్ ఆమోదం తెలపలేదు. దాంతో ఆ ఆలోచనను విరమించుకొని రెండు పంచాయతీలుగా విభజించే ప్రయత్నం చేసింది. చివరకు భద్రాచలం, సీతారాంనగర్, శాంతినగర్ గ్రామ పంచాయతీలుగా విభజిస్తూ చేసిన సవరణకు గవర్నర్ ఆమోదం తెలిపారు. టిమ్స్ పేరుతో రాజధాని నగరానికి నలువైపులా నిర్మిస్తున్న నాలుగు ఆస్పత్రులకు నిమ్స్, ఎయిమ్స్ మాదిరిగా స్వయం ప్రతిపత్తి హోదా దక్కనుంది. ఈ మేరకు తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(టిమ్స్) బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. ఇది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉభయ సభలు ఆమోదించిన బిల్లులే. గచ్చిబౌలి, ఎల్బీనగర్, సనత్‌నగర్, అల్వాల్‌లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. ఈ బిల్లు ఆమోదంతో టిమ్స్‌లకు ప్రత్యేక పాలకమండలి ఉంటుంది. వైద్యులు, వైద్య సిబ్బంది, ఇతర పారా మెడికల్ స్టాఫ్‌ను స్వయంగా నియమించుకునే అధికారం ఈ సంస్థలకు ఉంటుంది. సొంతంగా ఆదాయాన్ని, నిధులను సమకూర్చుకొనే వెసులుబాటు కూడా ఉంటుంది. ఒక్కో టిమ్స్‌లో 150 గదులు ప్రైవేటు వ్యక్తులకు వైద్య సేవలకు ఉపయోగిస్తారు. టిమ్స్‌లకు చైర్మన్‌గా ముఖ్యమంత్రి ఉంటారు. నిమ్స్, ఎయిమ్స్ మాదిరిగా డైరెక్టర్స్‌ను నియమిస్తారు. పీజీ మెడికల్ సీట్లతో పాటు మెడికల్ రీసెర్చ్, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తారు. మైనార్టీ కమిషన్‌లో జైన్ సామాజిక వర్గానికికూడా ప్రాతినిధ్యం కల్పించారు. కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లు, బస్ భవన్ భూములు ఉండే ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా బిల్లును కూడా గవర్నర్ పరిశీలించినట్లు తెలిసింది. కానీ, దానికి ఆమోద ముద్ర పడిందా లేదా అన్నది తెలియరాలేదు.

నైనీలో బొగ్గు తవ్వకాలకు లైన్‌క్లియర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో

అటవీ అనుమతులు మంజూరు చేసిన ఒడిసా సర్కారు

న్యూఢిల్లీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఒడిసాలోని అంగుల్ జిల్లాలో సింగరేణి సంస్థకు కేటాయించిన నైనీ బొగ్గు గనిలో తవ్వకాలకు మార్గం సుగమమైంది. కేంద్ర, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో స్పందించిన ఒడిసా సర్కారు ఇటీవల అటవీ అనుమతులు మంజూరు చేసింది. దీంతో త్వరలో అటవీ భూముల బదిలీ జరగనుంది. నిజానికి, నైనీ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖలు 2022 అక్టోబరులోనే అటవీ అనుమతులు ఇచ్చాయి. కానీ, వన్యప్రాణుల నిర్వహణ ప్రణాళిక(వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ ప్లాన్)ను వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ సిద్ధం చేయకపోవడంతో ఒడిసా ప్రభుత్వం ఇన్నాళ్లూ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో అంగీకారం తెలపలేదు. దీంతో భూముల బదిలీ జరగలేదు. ఈ అంశమై బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఒడిసా అధికారులతో పలుమార్లు స్వయంగా సమావేశమయ్యారు. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖలు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాశాయి. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా కేంద్ర బొగ్గు, గనుల శాఖకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఒడిసా సీఎంతో మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమస్య పరిష్కారమయ్యేలా చేశారు. ఆటంకాలు తొలగిపోయిన నేపథ్యంలో నైనీ కోల్ బ్లాక్‌కు సంబంధించిన అటవీ భూముల బదిలీ, ఇతర అనుమతుల విషయంలో ఒడిసా ప్రభుత్వాధికారులను సింగరేణి సీఎండీ, డైరెక్టర్లు కలిశారు. వీలైనంత త్వరగా అటవీ భూమి బదలాయింపు చేయాలని కోరారు.

లంచావతారుల గుండెల్లో గుబులు!

- ఏసీబీ వరుస దాడులతో అధికారుల్లో భయం
- ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు లేకుండా..

పనులు జరుగుతున్నాయి: ఏసీబీ చీఫ్ సీవీ ఆనంద్

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొద్దిరోజులుగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) జరుపుతున్న దాడులతో లంచావతారుల్లో గుబులు మొదలైందంటున్నారు ఏసీబీ డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్. గత 6 నెలలుగా ఏసీబీ చేస్తున్న దాడులు, నమోదు చేస్తున్న కేసులు.. అవినీతి ఉద్యోగులందరిలో భయం పుట్టిస్తున్నాయని 'ఎక్స్' వేదికగా ఆయన పేర్కొన్నారు. అనుమానిత అధికారులు ఇప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారని, ప్రతి విషయాన్నీ అనుమానాస్పదంగా చూస్తున్నారని తెలిపారు. దీంతో వారిని ట్రాప్ చేసి పట్టుకునేందుకు తమ సిబ్బంది మరింత కష్టపడాల్సి వస్తుందన్నారు. అయితే ఇంత జరుగుతున్నా.. లంచాలకు అలవాటుపడ్డ కొందరి అత్యాశ వారిని ట్రాప్‌లో పడేలా చేస్తోందన్నారు. ఏదేమైనా ఏసీబీ దాడుల కారణంగా ప్రస్తుతం రాష్ట్రంలో పలు కార్యాలయాల్లో ప్రజలు లంచాలు ఇవ్వకుండా సులభంగా తమ పనులు చేయించుకోగలుగుతున్నట్లు తెలుస్తోందని సీవీ ఆనంద్ వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని రూపుమాపేందుకు తమ వంతు ప్రయత్నాన్ని నిరంతరం కొనసాగిస్తామన్నారు. సీవీ ఆనంద్ చేసిన ఈ పోస్టుతో ఏసీబీ పనితీరును నెటిజన్లు కొనియాడుతున్నారు. కాగా, రాష్ట్రంలో ఈ ఏడాది మొదటి 6 నెలల్లో సుమారు 90 వరకు ట్రాప్, ఆదాయానికి మించిన కేసులు నమోదయ్యాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మొదటి ఆరు నెలల్లో ఈ స్థాయిలో ఏసీబీ కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి.

నారాయణలో అధ్యాపకులుగా ఐఐటీయన్లు

- 180 మందిని నియమించుకున్న సంస్థ

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తమ విద్యా సంస్థల్లో అధ్యాపకులుగా ఐఐటీయన్లను నియమించకున్నామని నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం వెల్లడించింది. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. విద్యార్థులకు అర్థవంతంగా, విశ్లేషణాత్మకంగా బోధించే ఉపాధ్యాయులు/అధ్యాపకుల కొరతను దృష్టిలో పెట్టుకొని ప్రఖ్యాత విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీలలో బీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ పూర్తి చేసిన 180 మంది ప్రతిభావంతులైన అభ్యర్థులను క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపిక చేసినట్లు ఆ సంస్థ తెలిపింది. అన్ని పోటీ పరీక్షలకు అత్యంత కీలకమైన గణితం, రసాయన, భౌతిక శాస్త్రాలతో పాటు బయాలజీ సబ్జెక్టులకు సంబంధించిన 180 మంది ట్రైనీ ఫ్యాకల్టీ అభ్యర్థులను నారాయణ రిక్రూట్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా నియమించుకున్నామని వివరించింది. ప్రతిభావంతలైన నవతరం అభ్యర్థులను ప్రోత్సహించేందుకే నారాయణ విద్యాసంస్థ చొరవ తీసుకుందని నారాయణ విద్యా సంస్థల సీఇవో పునీత్ కొత్తప తెలిపారు. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి. సింధూర నారాయణ మాట్లాడుతూ.. రాబోయే కాలంలో అవసరాలను దృష్టిలో పెట్టుకొని నేటి నుంచే వనరులను సమకూర్చుకోవడం నారాయణ ముందు చూపునకు నిదర్శనమన్నారు. మరో డైరెక్టర్ శరణి నారాయణ మాట్లాడుతూ.. ప్రతి టీచర్ తప్పనిసరిగా కలిగి ఉండాల్సిన ముఖ్య లక్షణాల గురించి వివరించారు. కాగా రాబోయే 90 రోజుల్లో ట్రైనీ ఫ్యాకల్టీ అభ్యర్థులకు తరగతి శిక్షణా కార్యక్రమాన్ని ఇవ్వబోతున్నామని ఆ సంస్థ వెల్లడించింది.

'రివర్స్'లో పదోన్నతులపై గుర్రు!

డీఎంఈ పరిధిలో అడ్డగోలు వ్యవహారం.. రాష్ట్రంలో ఖాళీ పోస్టులన్నీ చూపని వైనం

- కేవలం 8 కాలేజీల్లోనే చేరాలని నిబంధన
- నేటి కౌన్సెలింగ్‌ను అడ్డుకుంటామని సీనియర్ల హెచ్చరిక



హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య సంచాలక కార్యాలయం (డీఎంఈ) పరిధిలోని పదోన్నతుల వ్యవహారం రోజురోజుకు ముదురుతోంది. వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారుల తీరుపై సీనియర్ ఆచార్యులు, అధ్యాపకులు అభ్యంతరం తెలుపుతున్నారు. ఎన్నడూ లేని విధంగా అడ్డగోలుగా రివర్స్ పద్ధతిలో పదోన్నతులు చేపడుతున్నారని ఆక్షేపిస్తున్నారు. పదోన్నతులను ముందుగా అదనపు వైద్య విద్య సంచాలకులతో మొదలుపెట్టాలి. తర్వాత ఆచార్యులు (ప్రొఫెసర్లు), ఆపై అసోసియేట్ ప్రొఫెసర్లు, చివరిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల పదోన్నతులు చేపట్టాలి. కానీ డీఎంఈలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. తొలుత అసిస్టెంట్ ప్రొఫెసర్ల నుంచి పదోన్నతులు చేపట్టారు. వీరికి ఆదివారం కౌన్సెలింగ్ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆయా కాలేజీల్లో నాలుగేళ్లుగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్న 245 మందికి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు దక్కాయి. వాస్తవానికి వీరు హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని కాలేజీలకు వెళ్లే వెసులుబాటు ఉంటుంది. కానీ ఉన్నతాధికారులు మాత్రం కొత్తగా ఏర్పాటైన (గద్వాల, నారాయణ్‌పేట్, ములుగు, మెదక్, యాదాద్రి భువనగిరి, వరంగల్ జిల్లా నర్సంపేట్, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, మేడ్చల్‌జిల్లా కుత్బుల్లాపూర్) 8 కాలేజీల్లోనే పోస్టింగులు చూపుతున్నారు. పదోన్నతులు తీసుకుని కచ్చితంగా ఆ కాలేజీలకే వెళ్లాలని చెబుతున్నారు. వీటిలోనే కాకుండా గత రెండేళ్ల నుంచి ఏర్పాటైన మెడికల్ కాలేజీల్లో కూడా పోస్టింగులు చూపాలని పదోన్నతులు పొందిన డాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. దీనికి వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు మాత్రం కుదరదంటున్నారు. వాస్తవానికి గత మూడేళ్లలో ఏర్పాటైన మెడికల్ కాలేజీల్లో కూడా భారీగా ఖాళీలున్నాయి. వాటిని కూడా కౌన్సెలింగ్‌లో చూపిస్తే తమ సమీప ప్రాంతాల్లోని కాలేజీల్లో చేరే అవకాశముంటుంది. ఉదాహరణకు ఆదిలాబాద్ రిమ్స్ మెడికల్ కాలేజీల్లో 8 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు దక్కాయి. వీరు తమకు సమీపంలోని ఆసిఫాబాద్, నిర్మల్ మెడికల్ కాలేజీల్లో ఉన్న ఖాళీలను చూపిస్తే చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. కానీ వైద్య శాఖ మాత్రం తాను పట్టినా కుందేటికి మూడే కాళ్లు అన్న చందంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఏ కాలేజీలో పనిచేస్తూ పదోన్నతి పొందినా వారు ఈ 8 కాలేజీల్లోనే చేరాలంటుండడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి బలవంతపు పోస్టింగ్‌ను చాలామంది ఇష్టపడటం లేదని సమాచారం. పదోన్నతులు పొందిన వారిలో 20-30 శాతం మంది చేరకపోవచ్చంటున్నారు.

అడ్డుకుంటామంటున్న వైద్య సంఘాలు

ఆదివారం డీఎంఈ ఆఫీసులో చేపడుతున్న కౌన్సెలింగ్ ప్రక్రియను అడ్డుకుంటామని వైద్య సంఘాలు హెచ్చరించాయి. అడ్డగోలుగా కౌన్సెలింగ్ చేపడతామంటే ఊరుకునేది లేదంటున్నాయి. నిబంధనల ప్రకారం ముందుగా అదనపు డీఎంఈలుగా పదోన్నతులు ఇవ్వాలి. వారిని కొత్త మెడికల్ కాలేజీలకు ప్రిన్సిపల్స్‌గా నియమిస్తారు. వాటి అనుబంధ ఆస్పత్రులకు సూపరింటెండెంట్ పోస్టులను కూడా వారితోనే భర్తీ చేస్తారు. అదనపు డీఎంఈలుగా పదోన్నతి పొందిన వారి స్థానాలు ఖాళీ అవుతాయి. వాటిని ప్రొఫెసర్లకు పదోన్నతులివ్వడం ద్వారా భర్తీ చేయాలి. తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్లు, ఆపై అసిస్టెంట్ ప్రొఫెసర్ల పదోన్నతులు చేపట్టాలి. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను నేరుగా భర్తీ చేస్తారు. ఇలా నిబంధనల ప్రకారం జరగాల్సిన వ్యవహారాన్ని పై నుంచి కాకుండా కింద నుంచి చేపట్టడం, అన్ని కాలేజీల్లో ఖాళీలు చూపకపోవడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

అన్యాయం జరిగితే సహించం

తెలంగాణ రాష్ట్రంలో సగటు ఉద్యోగికి లేని నియంత్రణలు ఒక్క బోధనా వైద్యులకే ఎందుకు పెడుతున్నారో తెలియడం లేదు. ఏవో కొన్ని కాలేజీలకే వెళ్లాలనడం కాకుండా రాష్ట్రంలో ఉన్న ఖాళీలన్నీ చూపాలి. బదిలీల జీవో 40 శాతం క్యాడర్ స్ట్రెంత్‌తో త్వరగా విడుదల చేయాలి. ఈ విషయంలో వైద్యులకు అన్యాయం జరిగితే సహించం. ఏ నిర్ణయం తీసుకోవడానికైనా వెనుకాడబోం.

- డాక్టర్ మాదల కిరణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం

పట్టుబడిన పార్థీ గ్యాంగ్

- హైవేల్లో వాహనదారులపై దాడి చేసి చోరీలు, హత్యలు..
- ఇళ్లలోకి చొరబడి దోపిడీలు చేసే ముఠా
- హైదరాబాద్ శివారులో ఇద్దరి అరెస్టు, మరో ఇద్దరు పరారీ

నల్లగొండ, జూలై 6: జాతీయ రహదారులపై ఆగి ఉన్న వాహనాల్లోని వాహనదారులపై రాళ్లతో దాడి చేసి చోరీలకు పాల్పడుతూ, ప్రతిఘటించిన వారి ప్రాణాలు తీస్తున్న పార్థీ గ్యాంగ్ అనే దొంగల ముఠాకు చెందిన ఇద్దరిని నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ శివారులో చిక్కిన ఈ దొంగలు తప్పించుకునేందుకు ఎదురుదాడి దిగగా.. పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి మరీ పట్టుకున్నారు. హత్య, చోరీలు వంటి 32 కేసుల్లో వీరు నిందితులుగా ఉండగా.. కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శనివారం విలేకరులకు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన అప్ప పాండ్రంగ, శుభం అశోక్, కాశ్మీర్ శశిపాల్ భోంస్లే, అధేష్ అనిల్ ఖలే ముఠాగా ఏర్పడి పార్థీ గ్యాంగ్ పేరుతో చోరీలు చేసేవారు. చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూరు మండలాలు, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ పరిధి, సంగారెడ్డి ప్రాంతాల్లో జాతీయ రహదారుల పక్కన వాహనాలు ఆపి నిద్రిస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవారు. నిద్రిస్తున్న వాహనదారులను రాళ్లు, స్క్రూడ్రైవర్లతో కొట్టి భయభ్రాంతులకు గురిచేసి వారి వద్ద ఉన్న బంగారం, నగదు దొంగలించి పరారయ్యేవారు. అలాగే, ఆరుబయట, ఇళ్లలో నిద్రిస్తున్న వారి మెడలోని బంగారు వస్తువులు చోరీ చేసేవారు. ఈ క్రమంలో తమకు ఎవరైనా ఎదురుతిరిగితే విచక్షణారహితంగా కొట్టి చంపేవారు. అలాగే, ఇళ్ల ముందు, పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలను దొంగలించి చోరీలకు వాడి పనయ్యాక శివారు ప్రాంతాల్లో వదిలేస్తుంటారు. ఇంత క్రూరమైన ఈ ముఠా గత నెల 18న ఏపీలోని కృష్ణా జిల్లా పామర్రు మండలం చాట్లవానిపురానికి చెందిన కొల్లూరి రాజవర్ధన్ (32)ను కట్టంగూరు పీఎస్ పరిధిలో హైవేపై హత్య చేసింది. రాజవర్ధన్ తన మినీ గూడ్స్ వ్యాన్‌ను రహదారి పక్కన ఆపి నిద్రిస్తుండగా దాడి చేసిన పార్థీ గ్యాంగ్.. రాజవర్ధన్‌ను కట్టేసి స్క్రూడ్రైవర్‌తో విచక్షణారహితంగా పొడిచి హత్య చేసి అతని వద్ద ఉన్న రూ.14,500 తీసుకుని పరారైంది. ఈ కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నిందితుల జాడ గుర్తించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో చౌటుప్పల్‌లో ఓ చోరీ చేసిన ఈ ముఠా ఓ ఆటోలో హైదరాబాద్ వైపు వెళుతుండగా గుర్తించిన పోలీసులు వారిని వెంబడించి రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఓఆర్ఆర్ వద్ద అడ్డుకున్నారు. తప్పించుకునేందుకు యత్నించిన దొంగలు తమ వద్ద ఉన్న కత్తెరలు, స్క్రూడ్రైవర్లతో దాడి చేయగా పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి ముఠాకు చెందిన అప్ప పాండ్రంగ, శుభం అశోక్‌ను అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారు. దొంగలు చేసిన దాడిలో విక్రమ్ శంకర్ అనే కానిస్టేబుల్ గాయపడ్డాడు. నిందితుల వద్ద నుంచి రూ.17వేల నగదు, స్క్రూడ్రైవర్, రెండు కత్తెరలు, జత వెండి పట్టీలు, టార్చ్‌లైట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో నమోదైన 32 కేసుల్లో తమ నేరాలను నిందితులు పోలీసు విచారణలో అంగీకరించారు. కాగా, ప్రస్తుతం రిమాండ్‌కు తరలించిన నిందితులను మళ్లీ కస్టడీకి తీసుకుని మరిన్ని వివరాలను రాబడతామని ఎస్పీ పేర్కొన్నారు.

కాళేశ్వరం పత్రాలు దాచేస్తున్నారా?

- ముందుకు సాగని కమిషన్ విచారణ
- అధికారుల తీరుపై అనుమానాలు
- ప్రతి దస్త్రాన్ని తన ముందు ఉంచాలని జస్టిస్ పీసీ ఘోష్ ఆదేశం
- పంపు హౌస్‌ల నిర్మాణంలో పాల్గొన్న అధికారుల విచారణ రేపు

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకం విచారణకు అధికారులు సహకరించడం లేదా? కీలక పత్రాలను దాచేస్తున్నారా? అంటే అవుననే సమాధానమే వస్తోంది. కాళేశ్వరం పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను అక్కడే కట్టాలని సిఫారసులు ఏమైనా ఉన్నాయా? ఉంటే ఆ పత్రాలను తన ముందు ఉంచాలని విచారణ కమిటీ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఆదేశించినా.. నెల రోజులుగా అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారు. దీంతో శనివారం నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను జస్టిస్ పీసీ ఘోష్ ప్రత్యేకంగా పిలిపించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో ముడిపడి ఉన్న ప్రతీ దస్త్రాన్ని రెండు వారాల్లోగా తన కార్యాలయంలో అందించాలని దిశానిర్దేశం చేశారు. కాగా, 2015 మార్చిలో కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ఇచ్చిన నివేదిక ఆధారంగానే ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకానికి రీ డిజైన్ చేసి, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం చేపట్టినట్లు గత ప్రభుత్వం చెబుతూ వచ్చింది. కానీ, 2014 జూలై 22నే కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై కీలక నేత విధాన నిర్ణయం తీసుకున్నారని కొన్ని పత్రాల ద్వారా తేలింది. అదే రోజున ప్రాణహిత-చేవెళ్లతోపాటు కంతనపల్లి, దుమ్ముగూడెం ప్రాజెక్టులపై అప్పటి ప్రభుత్వం హైపవర్ కమిటీ వేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ఎంత ఎత్తుతో కట్టాలి? ఏ విధంగా కట్టాలనే అంశంపై ఈ కమిటీనే 2016 అక్టోబరు 22న సిఫారసు చేసింది. కానీ, ఈ పత్రాలేమీ కమిషన్ వద్ద లేకపోవడం గమనార్హం. ఏ సిఫారసుల ఆధారంగా బ్యారేజీలు కట్టారని కమిషన్ పదే పదే ప్రశ్నిస్తున్నా.. అధికారులు స్పందించడం లేదన్న ఆరోపణలున్నాయి. తాజాగా జస్టిస్ ఘోష్ ఆదేశాలతోనైనా ఈ పత్రాలన్నీ ఇస్తారా? లేదా? అనేది తేలాల్సి ఉంది.

పంపుహౌస్‌ల నిర్మాణంపైనా విచారణ

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పంప్‌హౌస్‌ల నిర్మాణంలో భాగస్వాములైన అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) నుంచి చీఫ్ ఇంజనీర్(సీఈ) దాకా అన్ని స్థాయిల అధికారులకు కమిషన్ కబురు పంపింది. సోమవారం (8వ తేదీన) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు జరిగే విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. బ్యారేజీలతో పాటు పంప్‌హౌస్‌లపైనా విచారణ చేపట్టాలన్న పలువురి ఫిర్యాదు మేరకు కమిషన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అలాగే, నిపుణుల కమిటీతో శనివారం సమావేశమైన జస్టిస్ పీసీ ఘోష్.. త్వరితగతిన నివేదిక అందించాలని సూచించారు. మరోవైపు.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై పూర్తి స్థాయి నివేదికను అందించాలని ఎన్‌డీఎస్ఏ చైర్మన్‌ను జస్టిస్ పీసీ ఘోష్ కోరారు. విచారణకు ఈ నివేదికే కీలకమని, సత్వరమే అందించాలని నిర్దేశించారు. దాంతో పాటు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికను తెప్పించుకోవాలని సూచించారు. అఫిడవిట్లలో అందించిన పరస్పర విరుద్ధ సమాచారం ఇచ్చిన వారిని పిలిపించి, క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలని కమిషన్ నిర్దేశించింది. బ్యారేజీల వైఫల్యానికి కారణాలేంటో తెలుసుకోవాలని ఒక అధికారిని పుణెలోని కేంద్ర విద్యుత్, నీటి పరిశోధన సంస్థ(సీడబ్ల్యూపీఆర్ఎస్)కు కమిషన్ పంపించింది.

దోస్త్ మూడో దశలో 73,662 మందికి సీట్ల కేటాయింపు

డిగ్రీ కాలేజీల్లో సీట్ల కేటాయింపునకు ఉద్దేశించిన దోస్త్ మూడో దశ కౌన్సెలింగ్‌లో 80,312 మంది దరఖాస్తు చేసుకోగా... 73,662 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన వారు ఈ నెల 7 నుంచి 11వ తేదీ దాకా ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసి ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్. లింబాద్రి, కాలేజీయేట్ కమిషనర్ ఎ.శ్రీదేవసేన ఓ ప్రకటనలో తెలిపారు. ఫేజ్-1, 2, 3లలో సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా సీట్లను పొందిన విద్యార్థులంతా ఈ నెల 8 నుంచి 12వ తేదీలోపు కాలేజీకి వెళ్లి తమ సీట్లను ధ్రువీకరించుకోవాలని, ఒకవేళ రిపోర్ట్ చేయకపోతే సీట్లను కోల్పోతారని హెచ్చరించారు. ఈ నెల 15వ తేదీ నుంచి మొదటి సెమిస్టర్ క్లాసులు ప్రారంభమవుతాయని తెలిపారు. కేటాయించిన కాలేజీల్లో సీట్లు ధ్రువీకరించుకున్న అభ్యర్థులు ఇంట్రా కాలేజీ సీట్ల కోసం ఈనెల 16 నుంచి 18వ తేదీ దాకా వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని, వీరికి ఈనెల 19న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

సమంతకు క్షమాపణలు



ఆరోగ్య సలహాలను సోషల్ మీడియాలో అందించినందుకు సమంతపై సిరియాక్ అబ్బీఫిలిప్స్ (లివర్ డాక్టర్) అనే డాక్టర్ సీరియస్ అయిన విషయం తెలిసిందే. ఈ విమర్శలకు బదులిస్తూ సమంత కూడా వివరణ ఇచ్చారు. సమంతను విమర్శించినందుకు శనివారం సమంతకు సారీ చెప్పి.. ఆమెకు వైద్యం చేసిన డాక్టర్ జాకర్స్ మోసగాడు అని ఆయన పేర్కొన్నారు. "సమంతను బాధపెట్టడం నా ఉద్దేశం కాదు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకోగలను. ఆమె ఈ సమస్య నుంచి మరింత త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. ఆమె పోస్ట్‌పై నేను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెబుతున్నాను. ఈ విషయంలో తప్పంతా ఆమెకు వైద్యం అందించి.. ఇటువంటి హానికరమైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయమని సిఫార్సు చేసిన డాక్టర్ జాకర్స్‌దే. ఆయన అందరికీ చెప్పుకున్నట్లు ఎంబీబీఎస్ చేసిన డాక్టర్ కాదు. ఆయన ఓ ప్రకృతి వైద్యుడు. అయనపై పలు కేసులు కూడా ఉన్నాయి. అందుకే ఆ డాక్టర్ చెప్పిన సూచనలను పోస్ట్ చేసిన సమంతను తప్పుబట్టాను" అని వివరించారు.



ప్రాణం పోయుంటే ఎవరిది భాద్యత

సమంత పెట్టిన ఆరోగ్య చిట్కాలపై బాడ్మింటన్ ప్లేయర్ గుత్తా జ్వాల సీరియస్ అయ్యారు. "ఇటువంటి ఆరోగ్య సూత్రాలు అందించి ప్రజలకు మేలుచేయాలనుకుంటున్న సెలబ్రిటీల ఉద్దేశం మంచిదే. కానీ ఈ సూచనల వల్ల ఎవరికైనా ఆరోగ్యం దెబ్బతింటే దానికి బాధ్యత టిప్స్ అందించిన వ్యక్తి తీసుకుంటారా..లేదా ఆ వ్యక్తికి ఈ టిప్స్ అందించిన డాక్టరా?" అని ఎక్స్‌లో ప్రశ్నించారు.

ఓటీటీలు మునుపటిలా...



ఒకప్పుడు వరుసగా సినిమాలు చేసిన తాప్సీ. తన రూటు మార్చి సెలక్టివ్‌గా సినిమాలు చేస్తున్నారు. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి కొన్ని హిట్ చిత్రాలను ఖాతాలో వేసుకున్న ఆమె ఇటీవలే 'డుంకీ' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు. తాప్సీ లేటెస్ట్‌గా 'ఫిర్ ఆయీ హసీనా దిల్‌రుబా' చిత్రంలో నటించారు. 'ట్వల్త్ ఫెయిల్' సినిమా ఫేమ్ విక్రాంత్ మాసీ ఇందులో కథానాయకుడిగా నటించారు. 2021లో విడుదలైన 'హసీనా దిల్‌రుబా' చిత్రానికి ఇది సీక్వెల్. త్వరలోనే ఓటీటీలో విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె మీడియాతో పలు విషయాలను పంచుకున్నారు.

"కొన్నాళ్ళుగా చిన్న సినిమాలకు పెద్దదిక్కుగా ఓటీటీ సంస్థలుండేవి. థియేటర్లలో రిలీజ్ కాలేని చిత్రాలు నేరుగా ఓటీటీలో రిలీజై ప్రేక్షకులను ఆకట్టుకునేవి. కానీ ఇప్పుడు ఓటీటీ సంస్థలు సైతం రూటు మార్చాయి. చిన్న చిత్రాలను మునుపటిలా తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. స్టార్ కాస్టింగ్ లేని చిన్న చిత్రాల కోసం ప్రత్యేకంగా ప్రమోషన్లను నిర్వహించాలని.. వీటికి చాలా డబ్బులు ఖర్చు అవుతుందని వెనుకడుగు వేస్తున్నాయి. అలాగే, ఆ చిత్రాలను ముందుగా థియేటర్లలో రిలీజ్ చేశాకే.. ఓటీటీలోకి తీసుకుంటామని షరతులు పెడ్తున్నాయి. ఈ నిర్ణయం చిన్న సినిమాలపై చాలా ప్రభావం చూపిస్తోంది" అని చెప్పారు.



కొత్త సినిమాల ప్రకటనలు వచ్చిందే తడవు.. హీరో, దర్శకుడు తర్వాత ప్రేక్షకుల దృష్టంతా ఆ సినిమాలో నటించబోయే కథానాయికపైనే. కొత్త సినిమా ప్రకటించినప్పటి నుంచే కథానాయికగా నటించబోయే హీరోయిన్ల గురించి వార్తలు షికారు చేస్తాయి. కారణాలేమైనా వాటిలో కొన్ని కాంబినేషన్లు మాత్రమే చివరకు సెట్టవుతాయి. ఈ కోవలో ప్రస్తుతం ఇండస్ట్రీలో, ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచుతున్న సరికొత్త కాంబినేషన్లు ఇవే.

కొత్త జోడీ ఖాయమేనా?





తొలిసారి జోడీ కుదిరేనా



'ఉప్పెన' చిత్రంతో ఉవ్వెత్తున ఎగసిన కృతి శెట్టి కెరీర్ ఆ తర్వాత మాత్రం అనుకున్న విధంగా ముందుకు సాగలేదు. వరుస చిత్రాలు నిరాశపరిచాయి. స్టార్‌డమ్ చేతికి అందినట్టే అంది చేజారింది. ఇటీవలే శర్వానంద్ సరసన నటించిన 'మనమే' సైతం చేదు ఫలితాన్నే అందించింది. కొన్నాళ్ల క్రితమే తమిళ, మలయాళ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చిన కృతి అక్కడా సినిమాలు చేస్తూ బిజీగా మారారు. ప్రస్తుతం ఆమె తమిళంలో మూడు చిత్రాలు చేస్తున్నారు. కార్తీ సరసన 'వా వాత్తియార్'లో నటిస్తున్నారు. ఇది చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అలాగే ప్రదీప్ రంగనాథన్ కథానాయకుడిగా విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహిస్తున్న 'లవ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్' చిత్రంలో నటిస్తున్నారు కృతి. అగ్రహీరో జయం రవి సరసన 'జీనీ'లోనూ కథానాయికగా నటిస్తున్నారు. ఇప్పుడు మరో అరుదైన అవకాశం కృతికి దక్కిందంటున్నాయి పరిశ్రమ వర్గాలు. దుల్కర్ సల్మాన్ సరసన ఆమె కథానాయికగా నటించబోతున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ ఓ సినిమా చేస్తున్నారు. ఇందులో నటుడు రానా కీలకపాత్రలో నటించడంతో పాటు నిర్మిస్తున్నారనేది ఇండస్ట్రీ టాక్. ఇందులో కృతీశెట్టిని కథానాయికగా ఎంచుకున్నారని, త్వరలోనే అధికారిక ప్రకటన రావొచ్చని భావిస్తున్నారు.



నయన్ ప్లేస్‌లో శామ్?


అగ్రకథానాయికగా టాలీవుడ్‌లో తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన సమంత కెరీర్‌ను మయోసైటిస్ వ్యాధి దెబ్బకొట్టింది. హీరోయిన్‌గా అవకాశాలకు కొదువ లేకపోయినా అనారోగ్యం నుంచి కోలుకునేందుకు ఆమె విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. గతేడాది 'ఖుషీ', 'శాకుంతలం' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకొచ్చినా, అవి రెండూ డిజాస్టర్‌లుగా మిగిలాయి. ప్రస్తుతం ఆమె తన సొంత బేనర్‌లో 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని ప్రకటించారు. బయట సినిమాలేవీ అంగీకరించలేదు. అయితే సమంత నటించబోయే సినిమాలు అంటూ పరిశ్రమలో కొన్ని పేర్లు వినిపిస్తున్నాయి. ఆమె త్వరలో మలయాళ చిత్రం చేయబోతున్నారనే మాట వినిపిస్తోంది. మమ్ముట్టితో సమంత జతకట్టబోతున్నారట. నటుడు, దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ ఈ చిత్రానికి దర్శకుడు. ఈ సినిమాలో గతంలో నయనతారను కథానాయికగా తీసుకున్నారు. కానీ తర్వాత ఏవో కారణాల వల్ల ఆమె తప్పుకున్నారు. ఆ స్థానంలో సమంతను తీసుకోవాలనే ఆలోచనతో చిత్రబృందం చర్చలు జరుపుతోంది. ఒకవేళ సమంత అంగీకరిస్తే ఆమెకు ఇది తొలి మలయాళ చిత్రం అవుతుంది. అలాగే ఈ ఏడాది సమంత బాలీవుడ్ ఎంట్రీ సైతం ఖాయం అంటున్నాయి పరిశ్రమ వర్గాలు. ఇటీవలే 'డంకీ' చిత్రంతో అలరించిన షారూఖ్‌ఖాన్, దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీ కలయికలో మరో ప్రాజెక్ట్ ఓకే అయిది. ఇందులో షారూఖ్‌ఖాన్ సరసన సమంతను కథానాయికగా ఎంపిక చేసినట్లు సమాచారం. మంచి అవకాశం కావడంతో సమంత కూడా అంగీకరించారని అంటున్నారు. వచ్చే ఏడాది ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్తుంది.

కొత్త జంట

తను చేసే ప్రతి సినిమా ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా ఉండాలని భావించే కొద్దిమంది కథానాయికల్లో సాయిపల్లవి ఒకరు. ప్రస్తుతం తెలుగులో నాగచైతన్య సరసన 'తండేల్' చిత్రంలో ఆమె నటిస్తున్నారు. ఈ ఏడాది సాయిపల్లవి బాలీవుడ్ అరంగేట్రం చేస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా నటిస్తున్న 'రామాయణ్'లో ఆమె సీతాదేవి పాత్రను పోషిస్తున్నారు. అలాగే ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్‌ఖాన్ సరసన ఓ చిత్రంలో నటిస్తున్నారు. తమిళంలో శివకార్తికేయన్‌కు జోడీగా 'అమరన్' చిత్రంలో నటిస్తున్నారు. ఇప్పుడు ఆమె మరో తెలుగు సినిమాకు 'ఎస్' చెప్పారని టాలీవుడ్ టాక్. విజయ్ దేవరకొండ హీరోగా రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా సాయిపల్లవిని తీసుకునేందుకు చిత్రబృందం ప్రయత్నాలు చేస్తోందని సమాచారం. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కే చక్కని ప్రేమకథా చిత్రమిది. తన పాత్ర నచ్చడంతో సాయిపల్లవి కూడా సానుకూలంగా స్పందించారని తెలుస్తోంది. అయితే అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

మహారాజ దర్శకుడితో

గతేడాది 'జవాన్'తో బాలీవుడ్‌లో పాగా వేశారు నయనతార. ఆ సినిమా హిందీ పరిశ్రమలో సైతం కథానాయికగా ఆమె డిమాండ్ పెంచిందనే చెప్పాలి. అయితే ప్రస్తుతం ఆమె దక్షిణాది చిత్రాలపైనే దృష్టి సారించారు. ఇప్పుడు మరో సినిమాలో ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. విజయ్‌సేతుపతి హీరోగా 'మహారాజ' చిత్రాన్ని తెరకెక్కించి సూపర్‌హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు దర్శకుడు నిథిలన్ స్వామినాథన్. ఇప్పుడు ఆయన తన కొత్త ప్రాజెక్ట్ కోసం నయనతారను కథానాయికగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ హీరోయిన్ ఓరియంటెడ్ మూవీలో నయనతార శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారట. ప్రస్తుతానికి కథా చర్చలు జరుగుతున్నాయి. నయనతార ఈ సినిమాను అంగీకరించే అవకాశముందని కోలీవుడ్ టాక్. ప్రస్తుతం నయనతార యశ్ సరసన 'టాక్సిక్' చిత్రంలో నటిస్తున్నారు. ఇవి కాకుండా ఆమె నటిస్తున్న పలు తమిళ, మలయాళ చిత్రాలు వివిధ దశల్లో ఉన్నాయి.



హిందీ చిత్రంలో మృణాల్?

'సీతారామం' చిత్రంతో కథానాయికగా తెలుగు ప్రేక్షక హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు మృణాల్ ఠాకూర్. ఆ తర్వాత తెలుగులో నాని సరసన 'హాయ్ నాన్న', విజయ్ దేవరకొండతో 'ది ఫ్యామిలీ స్టార్' చిత్రాలు చేసిన అంతగా ఆదరణ పొందలేదు. ఇటీవలే 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో అతిథి పాత్రలో కనిపించారు. ప్రస్తుతం ఆమె చేతిలో తెలుగు సినిమాలు ఏవీ లేవు. 'పూజా మేరీ జాన్' అనే హిందీ చిత్రంలో నటిస్తున్నారు మృణాల్. ఇప్పుడు మరో బాలీవుడ్ ప్రాజెక్ట్‌కు ఆమె పచ్చజెండా ఊపారని తెలుస్తోంది. సంజయ్ దత్, అజయ్ దేవగణ్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్' చిత్రానికి సీక్వెల్ రాబోతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్‌ను కథానాయికగా ఎంపిక చేశారని బాలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. నటనకు ఆస్కారం ఉన్న పాత్ర కావడంతో ఆమె కథ వినగానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.




ఈ వారమే విడుదల


ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు







ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
రిసీవర్	వెబ్‌సిరీస్	జూలై 10
వైల్డ్ వైల్డ్ పంజాబ్	హిందీ చిత్రం	జూలై 10
వైకింగ్స్: వాల్‌హల్లా 3	వెబ్‌సిరీస్	జూలై 11
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
కమాండర్ కరణ్ సక్సేనా	హిందీ సిరీస్	జూలై 08
మాస్టర్‌మైండ్	వెబ్‌సిరీస్	జూలై 10
అగ్నిసాక్షి	తెలుగు సిరీస్	జూలై 12
షో టైమ్	వెబ్‌సిరీస్	జూలై 12
సోనీ లివ్		
36 డేస్	హిందీ సిరీస్	జూలై 12
లయన్స్ గేట్ ప్లే		
డాక్టర్ డెత్	వెబ్‌సిరీస్	జూలై 12
జియో సినిమా		
పిల్	హిందీ సిరీస్	జూలై 12
ఆపిల్ టీవీ ప్లస్		
సన్నీ	వెబ్‌సిరీస్	జూలై 10
మీ	వెబ్‌సిరీస్	జూలై 12
మనోరమా మ్యాక్స్		
మందాకిని	మలయాళ చిత్రం	జూలై 12



బిల్లాలో నటించనన్న జయలలిత

అమితాబ్ నటించిన 'డాన్' సినిమాని తమిళంలో 'బిల్లా' పేరుతో రీమేక్ చేశారు. రజనీకాంత్, శ్రీప్రియ జంటగా నటించిన ఈ చిత్రం 1980లో విడుదలైంది. అయితే ఇందులో కథానాయిక పాత్రకు మొదట జయలలితనే అనుకొన్న విషయం, ఆమె అందుకు తిరస్కరించిన వైనం చాలామందికి తెలీదు. ఈ విషయాన్ని జయలలితే ఓ సందర్భంలో స్వయంగా వెల్లడించారు. 1980 మే 25 నాటి 'సండే' పత్రికలోని 'ఖాస్‌బాత్' శీర్షికలో జయలలిత మళ్లీ సినిమా ఛాన్సుల కోసం ప్రయత్నిస్తున్నారని వార్త రాశారు. దానిపై జయలలిత ఘాటుగా స్పందిస్తూ ఆ పత్రికకు ఓ లేఖ రాశారు. 'రజనీకాంత్ హీరోగా నిర్మాత బాలాజీగారు నిర్మించిన 'బిల్లా' చిత్రంలో హీరోయిన్‌గా నటించమని మొదట నన్నే అడిగారు. నేను కాదన్న తర్వాతే శ్రీప్రియను బుక్ చేశారు. కళ్లు చెదిరే పారితోషికం ఆఫర్ ఇచ్చినా నేను ఒప్పుకోలేదు. సినిమా కెరీర్ మీద నాకు ఆసక్తి సన్నగిల్లింది. దేవుడి దయవల్ల నేను ఆర్థికంగా బాగానే ఉన్నాను. మిగిలిన జీవితంలో కూడా మహారాణిలా బతకగలను' అని ఆ లేఖలో స్పష్టం చేశారు జయలలిత. చెప్పినట్లుగానే ఆవిడ తదనంతర కాలంలో మహారాణిలానే బతికారు.

అభినయంతోనే రాణించారు

తెలుగు సినిమా కథానాయికల్లో సౌందర్యది ప్రత్యేక స్థానం. గడచిన రెండు దశాబ్దాల కాలంలో తెలుగు చిత్రపరిశ్రమకు లభించిన అరుదైన నటి. హీరోయిన్ అనగానే పరిశ్రమలో కొన్ని నిశ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఇక్కడ అందాలు ప్రదర్శిస్తేనే నాయికగా కొనసాగుతారు. లేకపోతే ఇంటి దారి పట్టక తప్పదు అంటుంటారు. అయితే ఆ విషయంలో సౌందర్యకు మినహాయింపు లభించింది. ఎక్స్‌పోజింగ్ జోలికి పోకుండా కేవలం అభినయంతోనే రాణించవచ్చని ఆమె నిరూపించారు. అగ్రస్థానం అందుకున్నారు. కన్నడ చిత్రపరిశ్రమ నుండి తెలుగులోకి వచ్చారు సౌందర్య. ఆమె తండ్రి సత్యనారాయణ రచయిత, దర్శకుడు, నిర్మాత కూడా. తెలుగులో ఆమె అంగీకరించిన తొలి సినిమా 'రైతు భారతం'. ఈ సినిమాలో హీరో కృష్ణ మరదలిగా, భానుచందర్ సరసన నటించారు. ఈ చిత్ర నిర్మాణ సమయంలోనే ఆమెకు 'మనవరాలి పెళ్లి' చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. రైతు భారతం చిత్ర నిర్మాణంలో జాప్యం జరగడంతో మనవరాలి పెళ్లి మొదట విడుదలైంది.



సౌందర్య అసలు పేరు సౌమ్య. ఆమె గురించి విని రైతు భారతంలో బుక్ చేయడానికి ఆ చిత్ర దర్శకుడు త్రిపురనేని శ్రీ ప్రసాద్ బెంగళూరు వెళ్లారు. సౌమ్య ఇంటికి వెళ్లి ఆమెను చూసారు. ఆయనకు నచ్చడంతో ఆమె తండ్రి సత్యనారాయణతో మాట్లాడారు. సౌమ్య పేరు బాగానే ఉందా.. మార్చమంటారా అని అడిగారు సత్యనారాయణ. ఏదన్నా మూడు అక్షరాల పేరు బాగుంటుందేమో.. సావిత్రి, వాణిశ్రీ లా గుర్తింపు పొందడానికి.. అన్నారు శ్రీప్రసాద్. వెంటనే సత్యనారాయణ ఏవో లెక్కలు వేసి జాతకం ప్రకారం సౌందర్య అని పెడితే బాగుంటుంది..మీరేం అంటారు అని అడిగారు. బాగుంది. మంచి పేరు..అన్ని భాషలకు సరిపోతుంది అన్నారు శ్రీప్రసాద్. ఆ తర్వాత 5 వేలు అడ్వాన్స్ ఇచ్చారు. ఆ డబ్బు తీసుకొంటూ రేపటి అగ్ర నటికి మీరు ఇప్పుడు అడ్వాన్స్ ఇచ్చారు. మా అమ్మాయి జాతకం ఇప్పుడే చెబుతున్నాను వినండి. తను అగ్ర హీరోలందరి సరసన నటిస్తుంది. 8 ఏళ్ళు చాలా బిజీగా ఉంటుంది. 2004లో ఆమె కెరీర్ ఎండ్ అవుతుంది అని చెప్పారు సత్యనారాయణ. కూతురు మీద, ఆమె జాతకం మీద ఆయనకు అంత నమ్మకం. సత్యనారాయణ చెప్పినట్లే జరిగింది. అయితే కెరీర్ ఎండ్ అవుతుంది అని చెప్పారు కానీ 2004 ఏప్రిల్ 17న సౌందర్య జీవితం ముగుస్తుందని మాత్రం ఎవరూ ఊహించలేదు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● ఆదివారం 7 జూలై 2024

తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. టీజీ ఈఏపీ సెట్/ఏపీ ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంక్ వస్తే ఇబ్బంది ఏమీ లేదు. కోరుకున్న కాలేజీలో, అనుకున్న బ్రాంచీలో సులువుగా సీటు పొందవచ్చు. మధ్యస్థంగా ర్యాంకు వచ్చిన అభ్యర్థులకే కొన్ని ఇబ్బందులు ఉంటాయి. ఎలా చేస్తే, మంచి కాలేజీలో, కోరుకున్న బ్రాంచీలో సీటు వస్తుందన్నది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎదురయ్యే ప్రశ్న. ఈ విషయంలో నిపుణుల మాటేమిటో చూద్దాం.

వెబ్ కౌన్సెలింగ్ జాగ్రత్తలు



తెలంగాణ

ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 12 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 6 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 15 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 15
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 19
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 19 నుంచి 23 వరకు

సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 26
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 27
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 27 నుంచి 28 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 28
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 31
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు

ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** ఆగస్టు 8
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** ఆగస్టు 9
- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 9 నుంచి 10 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** ఆగస్టు 10
- **సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 13
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** ఆగస్టు 13 నుంచి 15 వరకు

సెంట్రలైజ్డ్ ఇంటర్నల్ స్లయిడింగ్ షెడ్యూల్

- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 21 నుంచి 22 వరకు
- **ఫ్రీజింగ్ ఆప్షన్స్:** ఆగస్టు 22
- **సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 26
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** ఆగస్టు 27 నుంచి 28 వరకు
- **స్పాట్ అడ్మిషన్స్ గైడ్‌లైన్స్ విడుదల:** ఆగస్టు 28
- **వెబ్‌సైట్:** tgeapcet.nic.in

ఆంధ్రప్రదేశ్

ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 7 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 10 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 12
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 13
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 16
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 17 నుంచి 22 వరకు
- **తరగతులు ప్రారంభం:** జూలై 19 నుంచి నుంచి
- **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in/

ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ మొదలైనప్పుడు ఇరవై నుంచి ముప్పయ్ ఆప్షన్లు పెట్టుకుంటే చాలు అని ఎక్కువమంది విద్యార్థులు అనుకుంటారు. అయితే అది తప్పని కౌన్సెలింగ్ నిర్వాహకులు పదేపదే చెబుతున్నారు. నిజానికి వందలకొద్ది ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఉంది. అలాంటప్పుడు కేవలం కొన్ని ఆప్షన్లు మాత్రమే పెట్టుకుంటే, నష్టం జరిగే అవకాశమే ఎక్కువ. ముఖ్యంగా పెద్ద సంఖ్యలో ర్యాంకు వచ్చినప్పుడు విద్యార్థులు కనీసం రెండు, మూడు వందలు, వీలైతే అంతకన్నా ఎక్కువ ఆప్షన్లు పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తప్పకుండా వస్తాయన్న వాటికితోడు, అటూ ఇటూగా రావడానికి అవకాశం బాగా ఉన్న కాలేజీలు, బ్రాంచీలను కూడా ఎంచుకోవాలి. ప్రత్యేకించి మనకు రాదనుకున్న బ్రాంచ్ లేదా కాలేజీకి ఎవరూ ఆప్షన్ పెట్టుకోని పక్షంలో పరిస్థితి అనుకూలిస్తే మనకే దక్కవచ్చు. ఇది చీకట్లో రాయి ఎంతమాత్రం కాదు... అవకాశాన్ని అందిపుచ్చుకోవడమే.

అవకాశం ఒక్కసారే!

ర్యాంక్ పెద్ద సంఖ్యలో వచ్చినప్పటికీ మంచి కాలేజీలు, కోర్సుల విషయంలో రాజీ పడాల్సిన పని లేదు. మనకు నచ్చిన కాలేజీ లేదంటే కోర్సు నుంచి ఆప్షన్లు ఆరంభించవచ్చు. ర్యాంకుల ఆధారంగా మాత్రమే సీట్ల కేటాయింపు ఉంటుంది. అంటే మొదటి ర్యాంక్ తరవాత రెండో ర్యాంక్ క్యాండిడేట్ ఇచ్చుకున్న ఆప్షన్ల ఆధారంగా అలాట్‌మెంట్ ఉంటుంది. ఉదాహరణకు వందో ర్యాంక్ వచ్చిన అభ్యర్థి ప్రత్యేకించి నచ్చిన కాలేజీలను తనిష్టం వచ్చిన రీతిలో పెట్టుకున్నాడని అనుకుందాం. ఆ అభ్యర్థికి ఆర్డర్ ఆఫ్ మెరిట్ ప్రకారం సీటు కేటాయింపు జరుగుతుంది. అంటే ఆ వ్యక్తిని వందో అభ్యర్థిగా పరిగణిస్తుంది. తనకు ముందున్న 99 మందికి సీట్ల కేటాయింపు పూర్తయ్యాక ఇతని వంతు వస్తుంది. అప్పుడు సీటు కేటాయింపు ఆ వ్యక్తి పెట్టుకున్న మొదటి ఆప్షన్ నుంచి ఆరంభమవుతుంది. ఆప్షన్ నెంబర్ 1, 2, 3.. అలా మొదలవుతుంది. ఆప్షన్ 30 దగ్గర క్లిక్ కావచ్చు. లేదంటే 200 వద్ద క్లిక్ కావచ్చు. ఆ ఆప్షన్‌గా పెట్టుకున్న కాలేజీ, కోర్సులో సీటు లభిస్తుంది. వందో వ్యక్తిగా మాత్రమే ఆ అభ్యర్థికి కేటాయింపు ఆరంభమవుతుంది. ముఖ్యంగా ఈ వెబ్ కౌన్సెలింగ్‌లో గరిష్ఠంగా ఆప్షన్లకు అవకాశం ఇవ్వడం అందుకోసమేనని గుర్తించాలి. ఇక్కడే ఒక ఉదాహరణ. ఏటా ఇది వింటూ ఉంటాం. అసలు ఒక్కరూ ఆప్షన్ పెట్టుకోనందున కొన్ని సీట్లు మిగిలిపోయాయని చెబుతూ ఉంటారు. అలాగే ఒక్కరు కూడా చేరని కాలేజీలు లేదా బ్రాంచీల వివరాలను కౌన్సెలింగ్ నిర్వాహకులు అధికారికంగానే ప్రకటిస్తుంటారు. ఆ కాలేజీలు లేదా ఆ గ్రూపులు కొన్ని అంత డిమాండ్ లేనివి కావచ్చు. అలాగే డిమాండ్ ఉన్నప్పటికీ రాదని కొందరు ఆప్షన్లుగా ఇచ్చుకుని ఉండకపోవచ్చు. కారణం ఏదైనా ఆ సీట్లు మొదటి రౌండ్‌లో మిగిలిపోయాయన్నది వాస్తవం. మార్కెట్లో మంచి పేరున్న యూనివర్సిటీ కాలేజీల్లో సీట్లు మిగిలిపోయాయి అంటే ఎలా అర్థం చేసుకోవాలో చెప్పండి. అభ్యర్థులు సరిగ్గా ఆప్షన్లు ఇచ్చుకోనందువల్లే ఆ పరిస్థితి దాపురిస్తోంది.

మొదటి అవకాశమే మంచిది

ఇలాంటి వెబ్ కౌన్సెలింగ్‌లో తొలి ఎంపికే కీలకం. రెండోసారి కౌన్సెలింగ్‌కు అవకాశం ఇచ్చినప్పటికీ, అప్పుడు ఛాన్స్‌లు తక్కువ. కేవలం మిగిలిన సీట్లకు మాత్రమే పోటీపడాల్సి వస్తుంది. అందువల్ల మొదటి కౌన్సెలింగ్ సమయంలోనే కొద్దిగా తెలివిగా వ్యవహరించాలి. ఉదాహరణకు ఒక విద్యార్థికి 25,000 ర్యాంక్ వచ్చిందని అనుకుందాం. తను ఎంపిక చేసుకున్న కాలేజీ లేదా బ్రాంచ్‌కు సంబంధించి తనకు తనకంటే ముందు ఎంతమంది అదే ఆప్షన్ ఇచ్చారన్న విషయం అస్సలు తెలియదు. ఎవరు దేన్ని ఎంచుకుంటున్నారన్న విషయం అంతకంటే తెలియదు. అలాగే విద్యార్థినులకు సీట్ల కేటాయింపులో మూడో వంతు రిజర్వేషన్ ఉంది. ఆ కేటాయింపు అన్నది ఓపెన్ మొదలుకుని వివిధ రిజర్వేషన్ల వరకు వర్తిస్తుంది. ఒక కాలేజీ ప్రత్యేకించి ఒక బ్రాంచ్‌లో వంద సీట్లు ఉన్నాయనుకుంటే, తప్పనిసరిగా అన్నిచోట్లా రిజర్వేషన్ ఇచ్చుకుంటూ, మొత్తం 33 సీట్లు కేటాయించాలి.

లాస్ట్ ఇయర్ కటాఫ్ చూడాలి

కాలేజీలు, సీట్లవారీగా గత ఏడాది కేటాయింపు సమాచారం చూస్తే మంచిది. అయితే ఇది కేవలం గైడింగ్ ఫ్యాక్టర్ మాత్రమే. ఈ ఏడాది కూడా అదే మాదిరిగా కేటాయింపు జరగాలని లేదు. ప్రత్యేకించి ప్రసిద్ధ కాలేజీల్లో మాత్రం ర్యాంకింగ్‌లో కొద్దిగా అటూ ఇటూగా మాత్రమే మారుతుంది.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
రాయపూర్ ఎన్ఐటి డైరెక్టర్

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- వ్యవసాయ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. తెలంగాణ పాలిసెట్ 2024(అగ్రికల్చర్ స్ట్రీమ్) ర్యాంక్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆంగ్ల మాధ్యమంలో నిర్వహించే రెండేళ్ల డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, రెండేళ్ల డిప్లొమా ఇన్ ఆర్గానిక్ కల్చర్, మూడేళ్ల డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో 260 సీట్లు, అనుబంధ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 540 సీట్లు ఉన్నాయి. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివిన విద్యార్థులకు ప్రతి ప్రోగ్రామ్‌లో 60 శాతం సీట్లు కేటాయించారు. ఇప్పటికే ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. ఈ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను జనరల్, ఈడబ్ల్యూఎస్, బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల అభ్యర్థులకు ఉద్దేశించారు. ఎన్‌సీసీ, సీఏపీ, స్పోర్ట్స్, పీహెచ్‌సీ కేటగిరీల అభ్యర్థులకోసం త్వరలో మరో నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు.

జయశంకర్ వర్సిటీలో పాలిసెట్ ప్రవేశాలు



కౌన్సెలింగ్ షెడ్యూల్: తెలంగాణ పాలిసెట్ 2024(అగ్రికల్చర్ స్ట్రీమ్)లో 447 నుంచి 19998 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 10న, 20015 నుంచి 46924 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 11న, 47062 నుంచి 68151 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 12న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. కౌన్సెలింగ్ ప్రక్రియ ఉదయం తొమ్మిదిన్నరకు ప్రారంభమౌతుంది.

కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు: ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ, పదో తరగతి సర్టిఫికెట్, తెలంగాణ పాలిసెట్ 2024(అగ్రికల్చర్ స్ట్రీమ్) ర్యాంక్ కార్డ్&హాల్ టికెట్, నాలుగోతరగతి నుంచి పదోతరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, నాన్ మున్సిపల్ ఏరియా స్టడీ సర్టిఫికెట్, టీసీ, రెసిడెన్షియల్ సర్టిఫికెట్, సోషల్ స్టేటస్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్.

ముఖ్య సమాచారం

- **కౌన్సెలింగ్ వేదిక:** యూనివర్సిటీ ఆడిటోరియం, పీజేటీఎస్ఏయూ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్
- **ఎంపికైన అభ్యర్థులు చెల్లించాల్సిన ఫస్ట్ సెమిస్టర్ ఫీజు:** యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో రూ.19,460; ప్రైవేట్ అనుబంధ కళాశాలల్లో రూ.22,210.
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఎంబీఏ స్కాలర్‌షిప్



ముంబైలోని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్- ఎంబీఏ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది. నిర్దేశిత కళాశాలల్లో ఎంబీఏ/తత్సమాన కోర్సు చదువుతున్న పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించేందుకు దీనిని ఉద్దేశించారు. కళాశాలల వివరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. మొత్తం 350 మందికి అవకాశం కల్పిస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో పార్టిసిపేటింగ్ కళాశాలలు: ఐబీఎస్-హైదరాబాద్, ఐఎంటీ-హైదరాబాద్, ఎన్ఐఏఈఎం-హైదరాబాద్, ఎస్ఐబీఎం-హైదరాబాద్, ఐపీఈ-హైదరాబాద్, ఐఐఎం-విశాఖపట్నం

అర్హత: అభ్యర్థులు 2023-24 విద్యా సంవత్సరంలో నిర్దేశిత కళాశాలలో రెండేళ్ల ఎంబీఏ/తత్సమాన ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ పొంది ప్రస్తుతం మొదటి ఏడాది చదువుతూ ఉండాలి. ఏడాది వ్యవధి గల ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్, ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ ప్రోగ్రామ్, రెండేళ్ల కంటే ఎక్కువ/తక్కువ వ్యవధిగల ఎంబీఏ/పీజీడీఎం ప్రోగ్రామ్‌లు, డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు చేస్తున్నవారు; సంస్థ ఉద్యోగుల పిల్లలు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థి వయసు దరఖాస్తు నాటికి 35 ఏళ్లలోపు ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం ఏడాదికి ఆరు లక్షలు మించకూడదు.

ఎంపిక: అభ్యర్థులను డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, ఆన్ గ్రౌండ్ స్క్రీనింగ్‌ల ద్వారా షార్ట్‌లిస్ట్ చేస్తారు. సంస్థ నిబంధనల ప్రకారం అభ్యర్థుల తుది జాబితా రూపొందిస్తారు.

స్కాలర్‌షిప్: ఏడాదికి రూ.లక్ష చొప్పున రెండేళ్లు స్కాలర్‌షిప్ అందిస్తారు. అంటే స్కాలర్‌షిప్ కింద ట్యూషన్ ఫీజును కళాశాల అకౌంట్‌లో జమచేస్తారు. మొదటి ఏడాది కోర్సు పూర్తిచేసి రెండో ఏడాదికి ప్రమోట్ అయితేనే స్కాలర్‌షిప్ కొనసాగిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు లేదు.
- అభ్యర్థులు తమ దరఖాస్తుతోపాటు డిగ్రీ సర్టిఫికెట్, అడ్మిషన్ లెటర్, ఆదాయ ధ్రువీకరణ పత్రం తదితరాలను అప్‌లోడ్ చేయాలి.
- **వెబ్‌సైట్:** https://idfcfirstbank.com

హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు

జాబ్ కార్నర్

హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్... ఒప్పంద ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 63

1. హిందీ ట్రాన్స్‌లేటర్: **1 పోస్టు**
2. ఏరియా సేల్స్ మేనేజర్/అసిస్టెంట్ రీజనల్ మేనేజర్/డిప్యూటీ మేనేజర్: **22 పోస్టులు**
3. బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్-5/సర్వీస్ ఎగ్జిక్యూటివ్: **11 పోస్టులు**
4. బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్-3, 4: **27 పోస్టులు**
5. ఏరియా సేల్స్ మేనేజర్: **2 పోస్టులు**

విభాగాలు: కన్స్యూమర్ బిజినెస్ డివిజన్, సేల్స్ అండ్ సర్వీస్(వెండింగ్ బిజినెస్ డివిజన్), ఫార్మా డివిజన్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టుకు రూ.9000 - రూ.18,000; బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ - 4 పోస్టులకు రూ.11,000 - రూ.22,000; బిజినెస్ ఎగ్జిక్యూటివ్-5, ఏరియా సేల్స్ మేనేజర్‌కు రూ.11,500 - రూ.23,000; అసిస్టెంట్ రీజనల్ మేనేజర్‌కు రూ.13,000 - రూ.30,000; డిప్యూటీ మేనేజర్ పోస్టుకు రూ.14,000 - రూ.32,500.


ఉద్యోగ స్థానం: తమిళనాడు, కేరళ, గోవా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, పంజాబ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్.

దరఖాస్తు: పోస్టు/ఈమెయిల్ ద్వారా జూలై 17లోపు దరఖాస్తులు పంపించాలి.

చిరునామా: డీజీఎం(హెచ్‌ఆర్), హెచ్‌ఎల్ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్, హాల్‌భవన్, 26/4 వెలచేరీ- తంబరం మెయిన్ రోడ్, పల్లికరనై, చెన్నై.

వెబ్‌సైట్: www.lifecarehll.com/

లిటిల్స్



క్రమశిక్షణ

ఒక రాజ్యంలోని నలుదురు రాకుమారులు దేవ శర్మఅనే గురువు ఆశ్రమంలో విద్యాభ్యాసం చేసేవారు. వారి గురువు వారికి ఒక పాఠం బోధించి, ఆ పాఠం బాగా నేర్చుకున్న తరువాతే మరొక పాఠం చదవమనేవాడు.ఇవి ఆ రాకుమారులకు నచ్చేది కాదు.వారు ఒకేసారి నాలుగైదు పాఠాలు కొంచెంకొంచెం చదువుకునే వారు. ఒక రోజు గురువుగారువారికి ఒక పని అప్ప జెప్పారు.ఆ ఆశ్రమంలో వచ్చే వేసవి కోసం ఒక బావిని తవ్వడమే ఆ పని, గురువుగారి మాట ప్రకారం నలుగురు పలుగు పార పట్టుకుని, బావి తవ్వేందుకు బయల్దేరారు. కాసేపటి తరువాత గురువు గారు వచ్చి అప్పటి దాకా తవ్విన చోటు వదిలేసి మరో కొత్త ప్రదేశంలో బావిని తవ్వమని చెప్పాడు అలా నాలుగైదు చోట్ల తవ్వివిసుగు చెందిన రాకుమారులు ౹గురువు గారూ అలా అక్కడ కొంచెం ఇక్కడ కొంచెం తవ్వుతూ ఉంటే మంచినీళ్లబావి ఎప్పటికి పూర్తి అవుతుంది' అని అడిగారు ఆ మాటలు విన్నగురువుగారు 'ఎందుకు కాదు? 'మీరు ప్రతిదినం అదొక విషయం ఇదొక విషయం కొద్దికొద్దిగా చదువుతుంటే, మీకు చదువు వచ్చినట్లే ఇది కూడా' అన్నాడు. ఆ మాట విన్న రాకుమారులకు ఎంధకు గురువుగారు వారికి ఆ పరీక్ష పెట్టారో అర్థమయ్యిఆ రోజునుండి గురువుగారి మాటప్రకారం ఒకపాఠం పూర్తిగా నేర్చుకున్న తరువాతే మరో పాఠం నేర్చుకుని విద్యావంతులయ్యారు రాకుమారులు.

దారి కనుక్కోండి



6 తేడాలు గుర్తించండి!






ఎవి ఎన్ని



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 352

1	4		2		8			
		5	6					
				5	4			7
	6		4				5	3
	1	8				6	9	
3	5				9		8	
4			3	1				
					6	3		
			8		5		6	1

సుడోకు - 351 సమాధానం

3	8	5	4	2	1	6	9	7
9	4	7	8	6	3	5	1	2
6	1	2	7	5	9	8	3	4
2	9	1	3	7	5	4	8	6
4	3	8	6	1	2	7	5	9
7	5	6	9	4	8	1	2	3
5	2	4	1	9	6	3	7	8
1	6	3	2	8	7	9	4	5
8	7	9	5	3	4	2	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.